SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

సంపుటి: 19 | సంచిక: 19 | ఎడిటర్ : విక్రం కుమార్ | బుధవారం 22 అక్టోబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

# ఆపరేషన్ సిందూర్‌కు శ్రీరాముడే స్ఫూర్తి

## అయోధ్యలో రామాలయం తరవాత రెండో దీపావళి

## ప్రజలకు దీపావళి శుభాకాంక్షల్లో మోడీ ప్రస్తావన



న్యూఢిల్లీ : దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలను ఉద్దేశిస్తూ.. ప్రధాని నరేంద్ర మోదీ ఓ లేఖ రాశారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. ఆపరేషన్ సిందూర్ కు శ్రీరాముడే స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ భారత ధర్మాన్ని కాపాడటంతో పాటు.. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకుందన్నారు. 'అయోధ్యలో రామాలయం నిర్మించిన తర్వాత ఇది రెండో దీపావళి. ధర్మాన్ని కాపాడాలని శ్రీరాముడు మనకు బోధించాడు. అన్యాయాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని ఇస్తాడు. కొన్ని నెలల క్రితం మనం చేపట్టిన ఆపరేషన్ సిందూరే దీనికి

మిగతా 4 లో





పోలీస్ అంటేనే సమాజానికి ఒక నమ్మకం, భరోసా అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విధి నిర్వహణలో ఒక్కోసారి ప్రాణాలను సైతం పణంగా పెట్టాల్సి వచ్చినా పోలీస్ వెనుకడుగు వేయడని చెప్పారు. ఒకవైపు నెత్తురు చిందుతున్నా... మన రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వీరులు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు.

# పోలీస్ అంటేనే సమాజానికి నమ్మకం

- విధి నిర్వహణలో ఎందరో పోలీసుల ప్రాణార్పణం
- అమరులను సంస్మరించుకోవడం మన విధి
- అమరుల కుటుంబానికి అన్ని విధాలుగా అండ
- కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి కోటి పరిహారం
- మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాల్సిందే
- ఈగిల్ టీమ్‌తో డ్రగ్స్ ముఠా అరికడుతున్నాం
- సైబర్ నేరాలపై పోలీసుల కృషి ప్రశంసనీయం
- పోలీస్ అమరవీరుల దినోత్సవంలో రేవంత్ నివాళి

**హైదరాబాద్, అక్టోబర్ 21:** హైదరాబాద్ గోషామహల్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పోలీస్ ఫ్లాగ్ డే పరేడ్ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన పోలీస్ అమరవీరుల స్మారక స్థూపాన్ని ఆవిష్కరించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరులకు సీఎం నివాళులు అర్పించారు. విధి నిర్వహణలో దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఎందరో పోలీసు అమర వీరులను స్మరించుకోవడం మనందరి కర్తవ్యమని సీఎం వ్యాఖ్యానించారు. ఆ బాధ్యతతోనే దేశవ్యాప్తంగా ప్రతీ సంవత్సరం 'అక్టోబరు 21'న 'పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం'గా ఘనంగా నిర్వహించు కుంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో వీరమరణం పొందిన పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్లు పేర్కొన్నారు. శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసులు ప్రాణాలను సైతం పణంగా పెడుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విధి నిర్వహణలో

మిగతా 2 లో



# పోలీసుల త్యాగం మరువలేనిది

## ఎక్స్ వేదికగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

**అమరావతి :** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నివాళులు అర్పిస్తూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన వీర పోలీసు

మిగతా 5 లో



## భీమవరం డీఎస్పీ జయసూర్యపై నివేదిక

తరచూ సివిల్ వివాదాల్లో తలదూర్చడంపై ఆగ్రహం

ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడిని డిప్యూటి సిఎం పవన్

5

# రియల్ తహసీల్దార్

- బదిలీపై వెళ్తూ కాప్రా తహసీల్దార్ నిర్వాకం
- రూ. 50 కోట్ల సర్కారీ భూమి రియల్ ఎస్టేట్ కు ధారదత్తం

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, కాప్రా:** ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన రెవెన్యూ శాఖ అధికారులు, రియల్ ఎస్టేట్ మాఫియాతో కుమ్మక్కై కోట్ల రూపాయల విలువైన సర్కారీ భూమిని అక్రమంగా బదిలీ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. జీహెచ్ఎంసీ పరిధిలోని కాప్రా మండలం, చర్లపల్లి రెవెన్యూ పరిధిలో జరిగిన ఈ వ్యవహారం, రెవెన్యూ శాఖలో వ్యాపించిన అవినీతికి మరో ఉదాహరణగా నిలుస్తోంది. సర్వే నంబర్ 137లో 2 ఎకరాలు 16 గుంటల భూమి ఇమామ్ భూమిగా ప్రభుత్వ రికార్డుల్లో ఉంది. ఈ భూమిని పూజా రియల్ ఎస్టేట్ సంస్థ అక్రమంగా కొనుగోలు చేసి, ప్లాట్లుగా అభివృద్ధి చేయడానికి ప్రయత్నించింది.

05






# ప్రజల రక్షణ కోసం ముందుండేది పోలీసులే

## విధి నిర్వహణ కోసం ఎందరో కుటుంబాలకు దూరం

- సమాజంలో శాంతిభద్రతలతోనే పెట్టుబడుల రాక
- పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల కఠిన వైఖరి
- ఈగిల్, శక్తి విభాగాల ఏర్పాటుతో ఆధునికంగా పోలీస్ శాఖ
- డ్రగ్స్,గంజాయి, ఎర్రచందనం ముఠాల ఆటకట్టేల కృషి
- పోలీస్ అమరుల దినోత్సవం సందర్భంగా చంద్రబాబు నివాళి

**అమరావతి :** ప్రజల రక్షణ కోసం ముందుండేది పోలీసులేనని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విధి నిర్వహణ కారణంగా తమ కుటుంబంతో సరిగా గడపలేని పరిస్థితి వారిదని చెప్పారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని 6వ బెటాలియన్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత పోలీసు అమరవీరుల స్తూపం వద్ద సీఎం నివాళులర్పించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా 'అమరులు వారు' పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించి మాట్లాడారు. 1959 అక్టోబర్ 21న మన

మిగతా 5 లో

## లక్ష్మీనాయుడు హత్య కేసు విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు

నిందితులకు కఠిన శిక్ష పడేలా చేస్తాం: బాబు

05



# ధర్నా చౌక్‌గా మారిన సచివాలయం

- బిల్లుల కోసం సచివాలయం ముందు ధర్నాలు
- చిన్న కాంట్రాక్టర్లకు చెల్లింపుల్లో నిర్లక్ష్యం
- ప్రజారోగ్యం విస్మరించి.. బస్తీదవాఖానలపై నిర్లక్ష్యం
- మండిపడ్డ మాజీమంత్రి హరీష్ రావు

03



# వేడెక్కిన జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారం

- దీపక్ రెడ్డికి మద్దతుగా కేంద్రమంత్రుల ప్రచారం
- జూబ్లీహిల్స్ కిషన్ రెడ్డి అడ్డా అన్న బండి సంజయ్

03





# నేడు సదర్ ఉత్సవ వేడుకలు

## నారాయణగూడ ప్రాంతంలో ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్, అక్టోబర్ 21:** వాహనదారులకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కీలక సూచన చేశారు. సదర్ ఉత్సవ మేళా సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు తెలిపారు. నారాయణగూడలోని వైఎంసిఎ దగ్గర బుధవారం రాత్రి 7 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు సదర్ ఉత్సవ మేళా జరగనున్న నేపథ్యంలో ట్రాఫిక్ అమల్లో ఉంటాయని వెల్లడించారు. రామ్‌కోటి, లింగంపల్లి, నారాయణగూడ, బర్కత్‌పురా, విజయనగరం, హిమాయత్‌నగర్ ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు తాత్కాలికంగా మళ్లింపులు చేపట్టనున్నట్లు తెలిపారు. సదర్ మేళాకు వచ్చే వారు తమ వాహనాలను కేశవ మెమోరియల్ కళాశాల మైదానంలో పార్క్ చేయాలని పోలీసులు సూచించారు. వాహనదారులు సహకరించి ప్రత్యామ్నాయ మార్గాలు ఉపయోగించుకోవాలి- ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ రైజింగ్‌కు సలహాలు

## ఈనెల 25 తో ముగియనున్న సర్వే

**హైదరాబాద్, అక్టోబర్ 21:** తెలంగాణా రాష్ట్ర భవిష్యత్ రూపకల్పనకై ఉద్దేశించిన 'తెలంగాణ రైజింగ్- 2047 ' సిటిజన్ సర్వే కు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటివరకు ఈ సిటిజన్ సర్వే లో కేవలం తెలంగాణ నుండే వివిధ ప్రాంతాల నుండి దాదాపు మూడు లక్షలకు పైగా పౌరులు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందచేశారు. భారత దేశ స్వాతంత్యానికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుండి తగు సలహాలు, సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ - 2047 ' సిటిజన్ సర్వేను చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈ సర్వే ఈనెల 25 వతేదీ తో ముగుస్తుంది. ఈ సర్వే రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికీ అందుబాటులో ఉన్నందున వెబ్‌సైట్ లో సందర్శించి ప్రతీ ఒక్కరు తమ సలహాలు సూచనలను అందించాల్సింగా ఒక అధికార ప్రకటనలో తెలియ చేశారు.

# రియాజ్ ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ

## తెలంగాణ మానవ హక్కుల వేదిక డిమాండ్

**హైదరాబాద్, అక్టోబర్ 21:** నిజామాబాద్‌లో కానిస్టేబుల్ ప్రమోద్ హత్య కేసులు నిందితుడు రియాజ్ ఎన్‌కౌంటర్‌పై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని తెలంగాణ మానవ హక్కుల వేదిక డిమాండ్ చేసింది. ఈ ఎన్‌కౌంటర్‌ను హైకోర్టు, తెలంగాణ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా తీసుకుని న్యాయ విచారణ జరపాలని కోరింది. చట్టాన్ని ఉల్లంఘించిన వారు ఎంతటి వారైనా, వారికి శిక్ష పడేలా చేయాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. తిరుపతయ్య డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులను తక్షణమే సస్పెండ్ చేయాలని, వారిపై హత్యా నేరం మోపాలన్నారు. 'నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానలో కానిస్టేబుల్ తుపాకీ గుంజుకుని, అతనిపై తిరగబడ్డాడనే పేరుతో షేక్ రియాజ్‌ని పోలీసులు చంపేయటం బూటకపు ఎన్‌కౌంటర్ మాత్రమే కాక, ఇది తెలంగాణా పోలీసు శాఖలో పెరుగుతున్న హింసాప్రవృత్తికి నిదర్శనం అన్నారు. ఈ నెల 17న బైకులు, చైన్ స్నాచింగ్ లాంటి దొంగతనాలకు పాల్పడుతున్న రియాజ్‌ని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించే క్రమంలో.. బైక్ నడుపుతున్న కానిస్టేబుల్ ప్రమోద్‌ను కత్తితో పొడిచి, అక్కడి నుండి పారిపోయాడు. ఊహించని ఈ దాడి కారణంగా కానిస్టేబుల్ అక్కడికక్కడే చనిపోయాడు. ఆ కానిస్టేబుల్ న్యాయంగా డ్యూటీ నిర్వహిస్తుండగా, అతనిపై జరిగిన దాడిలో చనిపోవటం చాలా బాధాకరం. హంతకునికి ఖచ్చితంగా శిక్ష పడాల్సిందే. అయితే ఆ శిక్షను ఎవరు అమలు చేయాలనేదే నాగరిక సమాజంలో కీలకమైన విషయం. నిందితుడు ఎట్టి పరిస్థితుల్లోనూ శిక్ష నుంచి తప్పించుకోకుండా పోలీసులు తగిన సాక్ష్యాధారాలతో అతని నేరాన్ని నిరూపించి, చట్ట ప్రకారం కోర్టు ద్వారా శిక్ష పడేలా చేయటానికి అవకాశాలున్నాయి. కానీ, అలా కాకుండా పోలీస్ వ్యవస్థ రియాజ్‌ను హత్య చేయాలని ముందే నిర్ణయించుకున్నట్టుగా అనిపిస్తున్నది. ముందస్తు పథకం ప్రకారమే పోలీసుల మీద మరొకరు తిరుగుబాటు చేయకుండా, రియాజ్ ఉదంతం ఒక బెదిరింపుగా ఉండాలని చేసిన కౌంటర్ హత్య అని మా అనుమానం. తెలంగాణ పోలీసుల మానసిక వైఖరి, వారి ఎన్‌కౌంటర్ల చరిత్రలే ఇందుకు ఆధారాలు అన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలు అంటే తెలియని సామాన్య ప్రజలు ఈ విషయంలో పోలీసులకు వత్తాసు పలుకుతుండవచ్చు. కానీ, ఒక సమాజం నియమబద్ధంగా నడావలా లేక, కంటికి కన్ను, పంటికి పన్ను అనే ఆటవిక సమాజం లాగా నడవాలా అనేది మెజారిటీ మద్దతు ఉందనే పేరుతో నడవాల్సిన వ్యవహారం కాదు. ఒక ఆసుపత్రి నాలుగో అంతస్తులో, చుట్టుపక్కల వేరెవరు రోగులూ, వారి బంధువులూ లేకుండా ఉంచిన గదిలో జరిగిన ఈ హత్య నిజమైన ఎన్‌కౌంటర్ కాదని, బూటకపు ఎన్‌కౌంటర్ అని నిరూపించడానికి మృతుని బంధువులకు గానీ, హక్కుల సంఘాలకు గానీ, స్వచ్ఛంద సంస్థలకు గానీ ఎటువంటి అవకాశం ఉండదు. కాబట్టి రూల్ ఆఫ్ లాను, కోర్టులను, రాజ్యాంగ నియమాలని కాపాడటమా, లేక 'వారిలో ఒక మనిషి చనిపోతే వారు ఊరుకుంటారా?' అని సరిపెట్టటమా అనేది ఈరోజు ప్రభుత్వం, రాష్ట్ర, జాతీయ మానవ హక్కుల కమిషన్లు, హైకోర్టు, సుప్రీంకోర్టుల ముందూ ఉన్న ప్రశ్న అని మానవ హక్కుల వేదిక నేతలు అన్నారు.

# నల్లగొండలో మత్తు మాత్రల దందా

## పోలీసుల దాడిలో పలువరి అరెస్ట్

**నల్లగొండ, అక్టోబర్ 21:** నల్గొండలో అక్రమంగా మత్తు మాత్రలు విక్రయిస్తున్న ముఠా గుట్టురట్టయింది. ఈగల డ్రగ్ కంట్రోల్? బోర్డు అధికారుల తోపాటు నల్లగొండ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి మత్తు మాత్రలను విక్రయిస్తున్న ముఠాను పట్టుకున్నారు. నల్లగొండ జిల్లాలో జోరుగా మత్తు గోలీల అక్రమ దందా సాగుతోంది. ఎలాంటి ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మాత్రలను విక్రయిస్తున్న ముఠాతోపాటు కొనుగులు చేసిన వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి భారీగా మత్తు మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో తొర్రూర్ మండలం కేంద్రంలోని ఓ మెడికల్ షాపునుంచి కొనుగోలుచేసి అక్రమంగా విక్రియస్తున్నట్లు డ్రగ్ కంట్రోల్ అధికారులు గుర్తించారు. మంగళవారం నల్లగొండ పోలీసులు జరిపిన దాడిలో టాబ్లెట్లను అక్రమంగా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ప్రధాన పెడ్లర్ మద్ జబినుల్లా, మెడికల్ షాపు ఓనర్ దారం కృష్ణసాయితోపాటు 8 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో 9మంది పరారీలో ఉన్నారు. వీరిపై కేసు నమోదు చరేశారు. మహ్మద్ జబీనుల్లా అనే వ్యక్తి గత కొంత కాలంగా మత్తు మాత్రలకు బానిపై కొనుగోలు, అమ్మకాలు జరుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు.

# పోలీస్ అంటేనే సమాజానికి నమ్మకం, భరోసా

మొదటి పేజీ తరువాయి



వీర మరణం పొందిన పోలీసులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా 'అమరులు వారు' పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించి.. తొలి ప్రతిని డీజీపీ శివధర్‌కు అందించారు. అమరులైన పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఇటీవల చనిపోయిన ప్రమోద్ కుటుంబానికి అన్ని విధాలుగా సాయం చేస్తాం. భర్త ప్రమోద్‌ను పోగొట్టుకున్న అతని భార్య ప్రణీతకు, అతని ముగ్గురు కుమారులకు, వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఒక కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా, పదవీ విరమణ వరకు లాస్ట్ పే డ్రాన్ సాలరీతో పాటు కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, 300 గజాల ఇంటి స్థలం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వీటితోపాటు పోలీస్ భద్రత సంక్షేమం నుండి రూ.16 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు ఇంటిస్థలం కేటాయిస్తున్నాం. పలు విభాగాల్లో మన పోలీసులు దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీ సులు అడ్డుకుంటున్నారు. డ్రగ్స్ మహమ్మారిపై పోరాడేందుకు ఈగల్ పేరుతో బృందాలను నియమించాం. ఇటీవల అనేక మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. జనజీవన స్రవంతిలో కలవాలని మిగతా మావోయిస్టులనూ కోరుతున్నానని సీఎం తెలిపారు. ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా 191 మంది పోలీస్ సిబ్బంది, తెలంగాణ రాష్ట్రంలో ఆరుగురు పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించారని గుర్తు చేశారు. గ్రేహౌండ్స్ క మాండోలు.. టి. సందీప్, వి.శ్రీధర్, ఎన్. పవన్ కళ్యాణ్ సంఘవిద్రోహ శక్తులతో పోరాడుతూ వీరమరణం పొం దారని చెప్పారు. అసిస్టెంట్ కమాండెంట్ బానోతు జవహ ర్లాల్, నల్గొండ కానిస్టేబుల్ బి.సైదులు విధినిర్వహణలో మరణించారన్నారు. 29-06-2008న ఒరిస్సాలో మావోయిస్టుల దాడిలో మరణించిన 33మంది పోలీస్ కుటుంబాలకు గాజుల రామారంలో 200 గజాల స్థలం కేటాయించామన్నారు. తెలంగాణ పోలీస్ శాఖ అవలంబిస్తున్న విధానాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రాష్ట్ర పోలీస్ శాఖ దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం మా ప్రభుత్వానికి గర్వకారణమని పేర్కొన్నారు. తెలంగాణ పోలీస్ సిబ్బంది నిరంతర కృషి, అంకితభావానికి నిదర్శనమని చెప్పారు. ఇలాగే, ప్రజల భద్రత, శాంతిని కాపాడుతూ, తెలంగాణ పోలీస్ శాఖ దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. తీవ్రవాదం, ఉగ్రవాదం, సంఘ విద్రోహ కార్యకలాపాలు, మతతత్వ ఆందోళనలు, వైట్ కాలర్ నేరాలు, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, కల్తీ ఆహారాలు, గుట్కాలు, మట్కాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు రాష్ట్రంలో పెరగనివ్వకుండా అహర్నిశలు శ్రమిస్తూ తెలంగాణ పోలీసులు దేశానికే ఆదర్శంగా నిలిచారు. నేరం చేసి తప్పించుకోలేమన్న పరిస్థితిని సృష్టించడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని పెంచిన తెలంగాణ పోలీస్ శాఖను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. తెలంగాణలో డ్రగ్స్ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'ఈగల్' వింగ్ సమర్థవంతంగా తన బాధ్యతలు నిర్వర్తిస్తుంది. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చాలి అనేది మా ప్రభుత్వ సంకల్పం అని అన్నారు. సైబర్ నేరాలను ఎదుర్కొనేందుకు డీజీపీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో 'సైబర్ సెక్యూరిటీ బ్యూరో'ను ఏర్పాటు చేశాం. ఈ విభాగం అత్యంత సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ దేశంలో ది బెస్ట్ గా నిలిచింది. సైబర్ నేరగాళ్ళను అరికట్టడానికి అంతర్ రాష్ట్ర ఆపరేషన్లు సైతం నిర్వహిస్తున్న తెలంగాణ పోలీసులకు యావత్ దేశం సెల్యూట్ చేస్తోందని అన్నారు. మావోయిస్టు ఉద్యమంలో ఉన్న అజ్ఞాత నాయకులను జనజీవన స్రవంతిలో కలవాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ఇటీవల కొందరు మావోయిస్టు కీలక నాయకులు లొంగిపోయిన విషయం మీ అందరికీ తెలుసన్నారు. తెలంగాణ పోలీసు అకాడమీ, జైళ్ల శాఖ, ఎస్ఐబీ, ఏసీబీ, సీఐడీ, విజిలెన్స్, ఆర్మ్‌డ్ రిజర్వ్, సీసీఎస్, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలకు మహిళా ఐపీఎస్‌ల సారధ్యం వహించడం మా ప్రభుత్వానికి గర్వకారణం. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ ఈ కీలక పోలీసు కమిషనరేట్లలో జోన్ డీసీపీలుగా ఏడుగురు మహిళా అధికారులే. రెండేసి కీలక విభాగాలను సైతం సమర్థవంతంగా నడిపిస్తున్న మహిళా ఐపీఎస్ అధికారులను చూసి తెలంగాణ గర్విస్తోందన్నారు. తీవ్రవాదుల, ఉగ్రవాదుల హింసలో చనిపోయిన వారికి అందించే ఎక్స్‌గ్రేషియాను కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐల వరకు కోటి రూపాయలను, ఎస్సై సీఐలకు కోటి 25 లక్షల రూపాయలను, డీఎస్పీ, అడిషనల్ ఎస్పీలకు కోటి 50 లక్షల రూపాయలను, ఎస్పీలకు ఇతర ఐపీఎస్ అధికారులకు రెండు కోట్ల రూపాయలకు పెంచుతూ మా ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. సమాజ శ్రేయస్సే ఊపిరిగా విధులు నిర్వర్తిస్తున్న పోలీసులకు అండగా నిలవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఒలంపియన్, బాక్సర్ నిఖత్ జరీన్, వరల్డ్ కప్ విన్నర్ క్రికెటర్ మహమ్మద్ సిరాజ్ కు డీఎస్పీగా ఉద్యోగాలు ఇచ్చి తెలంగాణ పోలీసుల ప్రతిష్టతను పెంచాం. ముఖ్యంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు అనేవి అత్యంత ప్రాధాన్యతో కూడిన అంశం. ఈ విషయంలో మా ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేస్తూ పోలీసు శాఖ మా అందరిలో స్ఫూర్తి నింపుతోంది. సోషల్ మీడియా ప్రభావం బాగా పెరిగిన ఈ కాలంలో పోలీసుల ప్రతి అడుగు, మాట జాగ్రత్తగా ఉండాలి. 'ఫ్రెండ్లీ పోలీసింగ్' అంటే చట్టాన్ని గౌరవించే పౌరుల కోసమే, చట్టాన్ని ఉల్లంఘించే వారికి కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ప్రజాస్వామ్య పాలనలో ప్రజల హక్కులను కాపాడుతూ, వారి సమస్యలను తెలియజేసేందుకు చేపట్టే నిరసన కార్యక్రమాలకు పోలీసులు అనుమతి ఇస్తూనే, ఈ సందర్భంలో సాధారణ ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఎంతో సున్నితంగా వ్యవహరించాలి. సమాజంలో శాంతి భద్రతలను సుస్థిరంగా ఉంచేందుకు పాటుపడే క్రమంలో విధి నిర్వహణలో తమ ప్రాణాలను అర్పించిన పోలీసు అమర వీరుల త్యాగాలు వెలకట్టలేనివన్నారు. అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు.

# బంగాళా ఖాతంలో అల్పపీడనం

## తెలంగాణలో ఐదురోజులు మోస్తరు వర్షాలు



**హైదరాబాద్, అక్టోబర్ 21:** తెలంగాణలో రాగల ఐదురోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ హెచ్చరించింది. నైరుతి బంగాళాఖాతం ప్రాంతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ఇవాళ ఉదయం అల్పపీడనంగా మారిందని పేర్కొంది. పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ బుధవారం మధ్యాహ్నం నాటికి ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాలకు ఆనుకొని ఉన్న నైరుతి, పశ్చిమ వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే ఛాన్స్ ఉందని చెప్పింది. ఆ తర్వాత పశ్చిమ-వాయువ్య దిశగా కదిలి ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర వైపు కదులుతూ 24గంటల్లో మరింత బలపడే అవకాశాలున్నాయని తెలిపింది. ఈ క్రమంలో తెలంగాణలో ఐదురోజులు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే సూచనలున్నాయని చెప్పింది. బుధవారం కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. గురువారం ఖమ్మం, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని చెప్పింది. గురువారం, శుక్రవారాల్లో నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని.. కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో భారీ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని వాతావరణశాఖ వివరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. గడిచిన 24గంటల్లో రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, జనగాం, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాలతో పాటు పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయని టీజీడీపీఎస్ వివరించింది.

# ఆసిఫ్‌ను పరామర్శించి డీజీపీ

## ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా

**నిజామాబాద్, అక్టోబర్ 21:** నిజామాబాద్‌లో ఇటీవల చోటుచేసుకున్న సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ హత్య కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఆ హత్య కేసులో ప్రధాన నిందితుడు రౌడీషీటర్ రియాజ్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందగా, అతన్ని పట్టుకునే క్రమంలో మరొక యువకుడు ఆసిఫ్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం ఆసిఫ్ ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉండగా, ఆయన సాహసాన్ని ప్రశంసిస్తూ రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ మంగళవారం నాంపల్లిలోని మల్లారెడ్డి ఆసుపత్రిలో ఆయనను పరామర్శించారు. డాక్టర్లు వివరించిన ప్రకారం ఆసిఫ్‌పై సర్జరీ పూర్తయిందని, ప్రస్తుతం ఆయన చేతి నరాలను సవ్యంగా కలిపి సాధారణ స్థితికి తీసుకురావడానికి చికిత్స కొనసాగుతున్నదని తెలిపారు. ఆసిఫ్ పరిస్థితి స్థిరంగా ఉందని డీజీపీ వెల్లడించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన డీజీపీ శివధర్‌రెడ్డి, ఆసిఫ్ చాలా ధైర్యంగా, నిజమైన పోలీసు స్ఫూర్తితో వ్యవహరించాడు. నిందితుడిని పట్టుకునే ప్రయత్నంలో ఆయన చూపిన సాహసం ప్రశంసనీయం. ఆయన వైద్య ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుంది. అంతేకాదు, ఆసిఫ్ ధైర్యాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి గ్యాలంట్రీ మెడల్ కోసం సిఫార్సు చేస్తామని తెలిపారు. నిందితుడు రియాజ్ చేసిన దాడిలో ఆసిఫ్ రెండు చేతులకు లోతైన కత్తిగాట్లు అయ్యాయి. చేతి నరాలు కోసుకు పోవడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. ఒక సాధారణ వ్యక్తి అయినా పోలీసుల మాదిరిగా ప్రమాదంలో పాల్గొని నిందితుడిని పట్టుకునేందుకు సాహసం చేసినందుకు ఆయనను రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసిస్తున్నారు. డీజీపీ శివధర్‌రెడ్డి పేర్కొన్నట్లుగా, ఆసిఫ్ సాహసాన్ని గుర్తించి గ్యాలంట్రీ అవార్డుకు సిఫార్సు చేయడం ద్వారా ఆయనకు తగిన గౌరవం అందించనున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టులు లొంగిపోవాలని ఇప్పటికే సీఎం సూచించారు. తెలంగాణ నుంచి ఇంకా దాదాపు 65 మంది మావోయిస్టులు యాక్టివ్‌గా ఉన్నారు. వారిపై ఉన్న కేసుల విషయంలో సానుభూతితోనే వ్యవహరిస్తాం, ఎలాంటి వేధింపులు ఉండవని డీజీపీ తెలిపారు.



22-10-25 Samayam_Layout 1 10/22/2025 5:31 AM Page 3



# గెలిచిన వారు ఏ పార్టీలో ఉన్నారో ?

- దానం నాగేందర్ స్టార్ కాంపెయినర్ ఎలా
- ఖైరతాబాద్ బస్తీ దవాఖానలను పరిశీలించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ప్రభుత్వ వైద్యానికి సుస్తీ పట్టిందని విమర్శ



**హైదరాబాద్, అక్టోబర్ 21:** పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేక పోతున్నారని.. వాళ్ళకి సిగ్గనిపించడం లేదా అని ప్రశ్నించారు. స్పీకర్ దగ్గర తాము పార్టీ మారలేదని అబద్దాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. దానం నాగేందర్ పేరు కాంగ్రెస్ పార్టీ క్యాంపెయినర్ల లిస్టులో ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. దానం నాగేందర్ ఏ పార్టీలో గెలిచారు, ఏ పార్టీకి ప్రచారం చేస్తున్నాడని నిలదీశారు. ఏఐసీసీ అంటే.. ఆల్ ఇండియా కరప్షన్ కమిటీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీలో గెలిచిన వాళ్లను తీసుకుని, వాళ్ల పార్టీ క్యాంపెయినర్ల జాబితాలో పెట్టారని మండిపడ్డారు. రేవంత్ సర్కార్ హైదరాబాద్‌ను గాలికొదిలేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బస్తీ దవాఖానలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. హైదరాబాద్‌ను రేవంత్ గాలికి వదిలేశారని చెప్పారు. ప్రజల ఆరోగ్యం మీద ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలిసి ఖైరతాబాద్ లోని ఇబ్రహీంనగర్ బస్తీ దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రాని సందర్శించారు. ఈ సందర్భంగా బస్తీ దవాఖానలో సదుపాయాలను పరిశీలించారు. మందులు, పరికరాల పని తీరు, దవాఖానలో అందుతున్న వైద్య సేవల వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వం హైదరాబాద్ నలువైపులా నాలుగు టిమ్స్ దవాఖానలను ప్రారంభించిందని చెప్పారు. 90 శాతం పనులు బీఆర్ఎస్ హయాంలోనే పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 10 శాతం పనులు చేయడానికి ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదని మండిపడ్డారు. బస్తీ దవాఖానలను రేవంత్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ సందర్భంగా తమకు 4 నెలలుగా జీతాలు రావడం లేదని, జీతాల విషయంలో ప్రభుత్వం ఇబ్బందులు పెడుతుందని మహిళా డాక్టర్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో సమస్యలపై ఆరా తీశారు. చిన్నారులకు చా÷-లకెట్లు పంపిణీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నాడు కేసీఆర్ హయాంలో ప్రజలకు, ముఖ్యంగా పేదలు అందరికీ అందుబాటులో ఉండేలా 450 బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశారని తెలిపారు. వాటితో పాటు తెలంగాణ డయాగ్నస్టిక్స్ సెంటర్‌లను ఏర్పాటు చేసి, ప్రజలకు ఉచితంగా పరీక్షలు కూడా అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బస్తీ దవాఖానాలను నిర్లక్ష్యం చేసి, ప్రజారోగ్యాన్ని పూర్తిగా పక్కన పెట్టేశారని విమర్శించారు. నాలుగు ఐదు నెలలుగా బస్తీ దవాఖానాలో పనిచేసే సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదని చెప్పారు. బస్తీ దవాఖానల్లో మందు గోళీలు కూడా అందుబాటులో లేవన్నారు. ప్రజారోగ్యం అంటే రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం శ్రద్ధ ఉన్నదో దీనితో అర్థమవుతుందన్నారు.

# వేడెక్కిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం

- దీపక్ రెడ్డికి మద్దతుగా కేంద్రమంత్రుల ప్రచారం
- జూబ్లీహిల్స్ కిషన్ రెడ్డి అడ్డా అన్న బండి సంజయ్





**హైదరాబాద్, అక్టోబర్ 21:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం వేడెక్కింది. బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డి నామినేషన్ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ ర్యాలీ సభలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను విమర్శించారు. బండి సంజయ్ మాట్లాడుతూ.. ఏయ్ బిడ్డా? జూబ్లీహిల్స్ కిషన్ రెడ్డి అడ్డా అంటూ ప్రారంభించిన ఆయన.. కిషన్ రెడ్డి నాయకత్వంలో బీజేపీని గెలిపించాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దొందూ దొందే అని ఆయన విమర్శించారు. ఈ రెండు పార్టీలు కలిసి ప్రజలను దోచుకుంటున్నాయని ఆయన ఆరోపించారు.. ఈ రెండు పార్టీల పాలనలో జూబ్లీహిల్స్ ప్రజలకు ఒరిగిందేమిటి? అని ఆయన ప్రశ్నించారు. బీజేపీ కార్యకర్తలపై దాడులు జరిగినా పోలీసులు పట్టించుకోవడం లేదని, అయితే హరీష్ రావు చెప్పగానే ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయన్నారు. అసదుద్దీన్ ఓవైసీ కాంగ్రెస్‌కు మద్దతిస్తే, ఆయన తమ్ముడు బీఆర్ఎస్‌కు వత్తాసు పలుకుతున్నారని, బీజేపీని ఓడించడమే మజ్లిస్ పార్టీ ప్రధాన లక్ష్యమని సంజయ్ వ్యాఖ్యానించారు. జూబ్లిహిల్స్‌లో ఎంఐఎం ఎందుకు పోటీ చేయడం లేదు? ఈ రెండు పార్టీలతో చేసుకున్న బేరసారాలే నిదర్శనం అని ఆయన అన్నారు. బీజేపీ గెలిస్తేనే కేంద్ర నిధులతో జూబ్లిహిల్స్ అభివృద్ధి సాధ్యమని చెప్పారు. కిషన్ రెడ్డి మరిన్ని నిధులు తెచ్చి హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తారు. కానీ కాంగ్రెస్ గెలిస్తే బంజారాహిల్స్ పెద్దమ్మతల్లి స్థలాన్ని మజ్లిస్‌కు ధారాదత్తం చేసేలా ఒప్పందాలు కుదుర్చుకుంటారని సంజయ్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌పై కోపంతో బీఆర్ఎస్‌కు ఓటేయడం అంటే రెండు పార్టీలకీ బలమిచ్చినట్లేనని అన్నారు. బీజేపీని గెలిపించండి? ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పండని బండి సంజయ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ చీఫ్ రామచందర్ రావు, గౌతమ్ రావు, పాయల్ శంకర్ తదితర నేతలు హాజరయ్యారు.

# ధర్నా చౌక్‌గా మారిన సచివాలయం

- బిల్లుల కోసం సచివాలయం ముందు ధర్నాలు
- చిన్న కాంట్రాక్టర్లకు చెల్లింపుల్లో నిర్లక్ష్యం
- ప్రజారోగ్యం విస్మరించి.. బస్తీదవాఖానలపై నిర్లక్ష్యం
- మండిపడ్డ హరీష్ రావు



**హైదరాబాద్, అక్టోబర్ 21:** పరిపాలన కేంద్రంగా ఉండాల్సిన సచివాలయం కాంగ్రెస్ పాలనలో ధర్నాచౌక్‌లా మారిందని మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ మొన్న చిన్న కాంట్రాక్టర్లు సచివాలయం లోపల ధర్నా చేస్తే.. బిల్లులు చెల్లించాలంటూ ప్రభుత్వ అద్దె వాహన యజమానులు సచివాలయం ఎదుట ఆందోళన చేసిన దుస్థితి నెలకొందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గ, అసమర్థ పాలనకు నిదర్శనమిదీ అని అన్నారు. కమీషన్ల కోసం బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. చిన్న కాంట్రాక్టర్లు, చిరు ఉద్యోగులకు చెల్లించాల్సిన బిల్లులు, జీతాలు నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడం శోచనీయమని హరీశ్‌రావు విమర్శించారు. వాహన అద్దె బిల్లులు హైదరాబాద్‌లో 10 నెలలుగా, జిల్లాల్లో 2 సంవత్సరాలుగా పెండింగ్‌లో పెట్టడం అన్యాయమని అన్నారు. కమిషన్లు ఇవ్వడం లేదని అద్దె వాహనాల బిల్లులు చెల్లించడం లేదా అని నిలదీశారు. యజమానుల కష్టాలు దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే అ÷-దదె వాహనాల పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇదిలావుంటే కేసీఆర్‌పై కోపంతో కేసీఆర్ కిట్‌లు తీసేయడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. పేదల ఆరోగ్యంపై రేవంత్‌కు శ్రద్ధ లేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో బస్తీ దవాఖానలకు సుస్తీ పట్టిందని మండిపడ్డారు. శేరిలింగంపల్లిలో బస్తీ దవాఖానను హరీశ్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా దవాఖానలో సదుపాయాలను పరిశీలించారు. ఏఏ మందులు అందుబాటులో ఉన్నాయి, వైద్య పరికరాలు పనితీరు, వైద్య సేవల వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. జీతాలు అందుతున్నాయా అని సిబ్బందిని అడగడంతో.. నాలుగు నెలలుగా జీతాలు రావడం లేదని తమ కష్టాలను హరీశ్ రావుతో చెప్పుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కార్ బస్తీ దవాఖానలను నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రభుత్వం ఆరోగ్య శ్రీ బకాయిలు ఇవ్వడం లేదని చెప్పారు. గ్రీన్ చానల్ మాటలకే పరిమితమయిందని విమర్శించారు. ఈహెచ్ఎస్ కింద బకాయిలు విడుదల చేయడం లేదని మండిపడ్డారు. బిల్లులను పెండింగ్ పెట్టడంతో ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. బస్తీ ప్రజలకు తమ గడప దగ్గరే వైద్యం అందించాలనే ఉద్దేశంతో.. నాడు కేసీఆర్ గారు రాష్ట్రం మొత్తంలో 450 బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశారు. వాటిలో 110 రకాల మందులను, 134 రకాల టెస్టులను ఉచితంగా చేసేవారు. కానీ 22 నెలల కాంగ్రెస్ పాలనలో బస్తీ దవాఖానాలకే సుస్తీ పట్టుకున్నది. లింగంపల్లిలో ఉన్న బస్తీ దవాఖానా సిబ్బంది తమకు 5-6 నెలల నుండి జీతాలు రావడం లేదని బాధపడుతున్నారు. నిత్యావసరమైన మందులు కూడా అందుబాటులో లేవు. రేవంత్ ప్రభుత్వం చెప్పేది ఒకటి, చేసేది ఒకటి. సీఎం రేవంత్ రెడ్డి కొత్త వైన్ షాపుల అప్లికేషన్ ఫీజు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచాదని విమర్శించారు. దరఖాస్తులు తక్కువ వచ్చాయని వారం రోజులు గడువు పెంచిందని మండిపడ్డారు. మద్యం దుకాణాల మీద, ఆదాయం మీద ధ్యాస తప్ప ప్రజల ఆరోగ్యం శ్రద్ధ లేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ కిట్ ఎందుకు రావడం లేదని, బస్తీ దవాఖానలో మందులు ఎందుకు లేవని నిలదీశారు. బస్తీ దవాఖానల సిబ్బందికి జీతాలు ఎందుకు వస్తలేవన్నారు. ఒక్కరోజైనా రివ్యూ చేశావా అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. మద్యం దుకాణాల గురించి తప్ప గరీబ్ వాళ్ల గురించి రేవంత్ రెడ్డి మాట్లాడటం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ వచ్చినంక నల్లా నీళ్ళకు బిల్లులు వేసి పైసలు కట్టాలి అంటున్నరు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వానికి జూబ్లీహిల్స్ ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టాలె. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్తేనే బస్తీ దవాఖానాలు బాగుపడతాయి.



# పోలీస్ క్రికెట్ టీమ్‌కు ట్రోఫీ

**హైదరాబాద్, అక్టోబర్ 21:** ఛామల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎలైట్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ ట్రోఫీని పోలీస్ క్రికెట్ టీం గెలుపొందింది. అక్టోబర్ 9,10 తేదీల్లో ఉప్పల్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ టోర్నమెంట్ ఫైనల్‌లో టాలి వుడ్ టీంపై పోలీస్ క్రికెట్ టీం విజేతగా నిలిచింది. విన్నర్ టీమ్‌కు లభించిన ఐదు లక్షలు, రన్నర్ టీమ్‌కు లభించిన 3 లక్షల రూపాయల నగదు బహుమతిని పోలీసు అమరవీరుల సంస్మరణ దినం పురస్కరించుకొని పోలీసు సంక్షేమ నిధికి అందచేస్తూ ఈ చెక్కును రాష్ట్ర ప్రభుత్వ హోమ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సీవీ ఆనంద్‌కు సచివాలయంలో నిర్వాహకులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ క్రికెట్ టీమ్ సభ్యులతో పాటు, బీసీసీఐ, ప్రణవ గ్రూప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అబద్దాల ప్రచారంలో ఆరితేరిన బిఆర్ఎస్

**కేబినేట్‌లో జరగని విషయాలపై దుష్ప్రచారం**

**దండుపాళ్యం బ్యాచ్ అంటూ విమర్శలా**

**హరీష్ రావు తీరుపై మండిపడ్డ మంత్రి అడ్లూరి**



**హైదరాబాద్, అక్టోబర్ 21:** కేబినెట్ మంత్రులను దండుపాళ్యం బ్యాచ్ అంటారా అంటూ బిఆర్ఎస్ నేత హరీష్ రావుపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఫైర్ అయ్యారు. కేబినెట్లో జరగని విషయాలను జరిగాయని ప్రచారం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. అబద్దాలకు కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్ పార్టీ అంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కాంగ్రెస్ సోషల్ మీడియా కార్యకర్తలపై దాదాపు 600 పైగా ఎఫ్ఐఆర్ లు నమోదు చేశారని తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులపై గత ప్రభుత్వం క్రూరంగా ప్రవర్తించిందని విమర్శించారు. రైతుల చేతులకు బేడీలు వేసిన చరిత్ర కేసీఆర్ ప్రభుత్వానిదన్నారు. పదేండ్లు మేమే రాజులం తామే మంత్రులం అన్నట్టు వ్యవహరించారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ దుయ్యబట్టారు. ఈ మేరకు మాజీ మంత్రి హరీష్ రావుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఛాలెంజ్ విసిరారు. కేబినెట్‌పై బీఆర్ఎస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని.. కేబినెట్ సమావేశంలో వ్యక్తిగత అంశాలు చర్చ చేయలేదని తాను ప్రమాణం చేస్తానని మంత్రి స్పష్టం చేశారు. అలాగే ఈ వ్యవహారంపై మాజీ మంత్రికి సవాల్ విసిరారు మంత్రి. 'సిద్దిపేట వెంకటేశ్వర ఆలయంలో ప్రమాణం చేద్దామా? హరీష్ సెంటిమెంట్‌గా భావించే దేవుడిపై ప్రమాణం చేయగలడా? ఇద్దరం తడిబట్టలతో ప్రమాణం చేద్దామా? మా తల్లి తండ్రులపై ప్రమాణం చేసి నేను ప్రమాణం చేస్తాను. నేను ముఖ్యమంత్రి అనుమతి తీసుకొని వస్తాను. నువ్వు ఆరోపించిన విషయాలను నిజమని ప్రమాణం చేయగలవా? ఏ శనివారం వస్తారో హరీష్ రావు చెప్పాలని, ఛాలెంజ్‌ను హరీష్ స్వీకరించాలన్నారు. కొండా సురేఖ బిడ్డ.. మా అందరికీ బిడ్డ లాంటిదే' అంటూ మంత్రి అడ్లూరి పేర్కొన్నారు. హరీష్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# జూబ్లీహిల్స్ ప్రచారం కోసం స్టార్ కాంపెయినర్లు

**40మంది పేర్లు విడుదల చేసిన పార్టీ**

**జాబితాలో మాజీ సిఎం కెసిఆర్ పేరు**



**హైదరాబాద్, అక్టోబర్ 21:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక ప్రచారం కోసం భారత రాష్ట్ర సమితి బీఆర్ఎస్ పార్టీ తరపున మొత్తం 40 మంది స్టార్ క్యాంపెయినర్లకు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఆమోదం తెలిపింది. ఆ పార్టీ జనరల్ సెక్రెటరీ సోమ భరత్ కుమార్ ఇచ్చిన ప్రతిపాదన మేరకు.. వారికి వాహనాల అనుమతికి పాస్‌లను మంజూరు చేశారు. ఈ ఎన్నికల ప్రచారం అక్టోబర్ 18 నుంచి నవంబర్ 9 సాయంత్రం 6 గంటల వరకు కొనసాగనున్నది. బీఆర్ఎస్ స్టార్ క్యాంపెయిన్ల జాబితాలో ముఖ్య నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు ఉన్నారు. ఈ జాబితాలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు పేరు సైతం ఉన్నది. అలాగే, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, టీ శ్రీనివాస్ యాదవ్, వీ ప్రశాంత్ రెడ్డి, జీ జగదీశ్ రెడ్డి, గంగుల కమలాకర్, సబితా ఇంద్రారెడ్డి, ఎస్ నిరంజన్ రెడ్డి ఉన్నారు. మహమూద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్ రావు, వీ శ్రీనివాస్ గౌడ్, కొప్పుల ఈశ్వర్ సైతం స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో ఉన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్లు టీ పద్మారావు గౌడ్, పద్మా దేవేందర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు ఎం కృష్ణ రావు, కేపీ వివేకానంద గౌడ్, డీ సుధీర్ రెడ్డి, డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, కాలేరు వెంకటేశం, పాడి కౌశిక్ రెడ్డి, చామకూర మల్లారెడ్డి, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, అనిల్ జాదవ్, బండారు లక్ష్మా రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, చింతా ప్రభాకర్ సైతం స్టార్ క్యాంపెయినర్లుగా ఉన్నారు. ఎమ్మెల్సీల్లో దాసోజు శ్రవణ్, ముఠా గోపాల్, శంబీపూర్ రాజు, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, టాటా మధుసూధన్, ఎల్ రమణా, తక్కెలపల్లి రవీందర్ రావు ఉన్నారు. ఎంపీ వద్దిరాజు రవి చంద్ర, మాజీ ఎమ్మెల్యేలు విష్ణు వర్ధన్ రెడ్డి, షకీల్ అమీర్ మొహమ్మద్, మాజీ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, షేక్ అబ్దుల్లా సోహైల్ పేర్లు సైతం ఉన్నాయి.

## సంపాదకీయం




# గూగుల్ లాంటి సంస్థలను స్వాగతించాల్సిందే!

హైదరాబాద్ అభివృద్ధి, సైబరాబాద్ సృష్టి ఈ రెండు ఇవాళ తెలంగాణ గతినే మార్చాయి. ఐటి అభివృద్ధితో హైదరాబాద్ ముఖచిత్రమే మారిపోయింది. రియల్ రంగంలో కొత్త పోకడలు వచ్చాయి. ఉమ్మడి ఎపిలో చంద్రబాబు పాలన ఎలా ఉన్నా, ఆయన ఏం చేసాడనే విమర్శలకు పోకుండా పరిశీలిస్తే... ఐటిని విస్తరించ డం కోసం తీసుకున్న నిర్ణయాలు ఇవాళ హైదరాబాద్‌ను అగ్రభాగాన నిలబెట్టాయి. హైటెక్ సిటీ రాకతో సైబరాబాద్ అనూహ్యంగా విస్తరించడం, అనేక దిగ్గజ కంపెనీలు హైదరాబాద్‌లో ఏర్పాటు కావడంతో లక్షల్లో ఉద్యోగాలు వచ్చాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా మరికొన్ని లక్షల మంది హైదరాబాద్‌లో ఉపాధి పొందుతున్నారు. ఇక్కడి 70శాతం ఆదాయంతోనే తెలంగాణ మనగులుగుతందనడంలో సందేహం లేదు. రియల్ ఎస్టేట్ అనూహ్యంగా విస్తరించింది. ఇది కాదనలేని సత్యం. ఇప్పుడు అమరావతి నిర్మాణం, విశాఖను ఐటి హబ్‌గా తీర్చిదిద్దేందుకు చంద్రబాబు చేస్తున్న కృషిని అభినందించాల్సిందే. ఎందుకంటే విడివడ్డ తెలుగు రాష్ట్రం అభివృద్ధి చెందడం తెలుగువారికి గర్వకారణంగా చూడాలి. అమరావతి, విశాఖలు అభివృద్ధి చెందితే అక్కడి స్థానికులకు కూడా లక్షల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. దీనిని రాజకీయాలకు అతీతంగా అందరం స్వాగతించాల్సిందే. వైకాపా ఐదేళ్ల పాలనలో అమరావతినే కాదు, రాజధానిని తుంగలో తొక్కింది. మూడు రాజధానులంటూ అసలు రాజధాని లేకుండా చేశారు. ఇవాళ అదే వైకాప అమరావతిని, గూగుల్ రాకను వ్యతిరేకిస్తోంది. విశాఖలో అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ రావడం ఎంతో పురోగిమిస్తుందని, గూగుల్ సిఇవో సుందర్ పిచాయ్ స్వయంగా చెప్పారు. గూగుల్ సంస్థ డేటా సెంటర్ల ఏర్పాటుకు అమెరికాలోనూ భారత్‌లోనూ భారీగా పెట్టుబడులు పెడుతోంది. రాష్ట్రానికి పెట్టుబడు లు వస్తే చంద్రబాబుకు లేదా ఐటీ మంత్రి లోకేశ్‌కు వ్యక్తిగతంగా లాభం ఏమీ ఉంటుందా లేదా అన్నది ముఖ్యం కాదు. ఎందుకంటే పెట్టుబడుల ఫలితాలను ప్రజలు అనుభవిస్తారు. హైదరాబాద్ ఐటిరంగ విస్తరణెళి ఇందుకు నిదర్శనం. గూగుల్ సంస్థ రాకను మెచ్చుకోవాల్సిన వైకాపా నేతలు అదేపనిగా విమర్శలు చేయడం విడ్డూరంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో గూగుల్ గేమ్‌చేంజర్ అనే చెప్పవచ్చు. హైదరాబాద్ తో పోటీపడేలా విశాఖకు అవకాశాలు ఉన్నాయి. సంక్షేమం పేరిట ప్రభుత్వం అదేపనిగా ఉచిత పథకాలు ప్రవేశ పెట్టడం సరికాదు. ఇలాంటి సంస్థలను ప్రోత్సహించాలి. ఇలా వచ్చేవారికి తోడ్పాటును అందించాలి. చంద్రబాబుపై నమ్మకంతో ఆంధ్రపద్రేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి మొదలైంది. గూగుల్ నిర్ణయం తర్వాత మరిన్న సంస్థలు రావచ్చు. ఇప్పటికే టిసిఎస్ కూడా తన క్యాంపస్ ప్రారంభించడానికి అంగీకరించింది. ఇదే ఒరవడి కొనసాగితే పెట్టుబడుల వెల్లువపెరుగుతుంది. అయితే జగన్ బృందం గూగుల్ సహా అనేక కంపెనీల రాకపై విమర్శలు చేస్తున్నది. పెట్టుబడులు రావడం, అభివృద్ధి జరగడం అన్నది ఎవరైనా స్వాగతించాల్సిందే. జగన్ అధికారంలో ఉండగా ఇలాంటి సంస్థల రాక అన్నది చూడలేదు.

**అవినీతిని వ్యవస్థీకృతం చేసిన జగన్, కల్తీ మద్యం, ఊరూపేరు లేని బ్రాండ్లతో విచ్చలవిడి నకిలీ వ్యాపారం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులతోనే రాష్ట్రవ్యాప్తంగా కల్తీ మద్యం వ్యాపారం జరుగుతోందని అదే పనిగా ప్రచారం చేస్తున్నారు. నిజానికి కల్తీ మద్యం అమ్మకాలకు మాఫియా కారణం. దానివెనక రాజకీయ నేతలే ఉంటారు. ఇప్పుడు ఎపిలో పట్టుబడ్డ కల్తీకి రాజకీయ నేతలే అండగా ఉన్నారు. అందుకే కల్తీ సారా, కల్తీ మద్యం తాగి అడపాదడపా అనేకులు మరణిస్తూనే ఉంటారు. ఇప్పుడు కల్తీ మద్యం గురించి గగ్గోలు పెడుతున్న జగన్, ఆయన అనుచరులు గతంలో వారి పాలనలో కల్తీ మద్యం సరఫరా అన్నది ప్రభుత్వ పరంగానే చేశారు. జంగారెడ్డిగూడెంతో పాటు మరికొన్ని ప్రాంతాలలో ఆ మద్యం తాగి పలువురు**

మరణించిన విషయం గుర్తించాలి. ములకలచెరువులో కల్తీ వ్యవహారం బయటకు రాగానే బాధ్యులందరినీ ప్రభుత్వం అరెస్టు చేసింది. వైసీపీకి చెందిన మాజీ మంత్రి జోగి రమేశ్ ప్రోద్బలంతోనే కల్తీ మద్యం తయారు చేశానని ప్రధాన నిందితుడు జనార్దనరావు చెప్పారు. ఇందులో నిజానిజాలు బయటికి వచ్చేలా కఠినంగా వ్యవహరించాలి. మద్యం కుంభకోణంలో సిట్ దర్యాప్తు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడం కూడా వారి లక్ష్యం కావచ్చు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపడంతో పాటు విపక్ష పార్టీగా వైకాపా అభివృద్ధిని కూడా స్వాగతించాలి. కానీ గూగుల్ లాంటి సంస్థల రాకను తప్పుపట్టడంమో, విమర్శించడమో సరికాదు. విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాగుపడాలంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగాలి. అనేక సంస్థలు రావాలి. గూగుల్ రావాలి, టిసిఎస్ ఇతర సంస్థలు రావాలి. ఎపిలో పెట్టుబడులు లక్ష్యంగా చేపట్టిన సిఐఐ సదస్సును విజయవంతం చేయాలి. అనేక సంస్థలు వచ్చి తమ కార్యలాపాలు సాగించేలా ప్రోత్సహించాలి. అందుకు అందరూ అభినందించాలి. అప్పుడే ఇక్కడ పెట్టుబడులు పెట్టేవారికి భరోసా కలుగుతుంది. అంతేకానీ వారిలో అపనమ్మకం కలిగేలా ఎవరు విమర్శలు చేసినా క్షంతవ్యం కాదు. అమెరికాలో తెలుగువారికి ఎసరు పెడుతున్న ట్రంప్ చర్యలతో ఇప్పుడక్కడ అనిశ్చితి నెలకొంది. మనవారికి ఇక్కడే ఉద్యోగాలు రావాలంటే గూగుల్ తదితర సంస్థలు రావాలి. అవి పోటీపడి తెలుగు రాష్ట్రాల్లో పెట్టుబడులు పెడితే మనం అమెరికా తదితరదేశాలకు వెళ్లాల్సిన ఆగత్యం ఉండదు.

# ఆపరేషన్ సిందూర్‌కు శ్రీరాముడే స్ఫూర్తి

- అయోధ్యలో రామాలయం తరవాత రెండో దీపావళి
- ప్రజలకు దీపావళి శుభాకాంక్షల్లో మోడీ ప్రస్తావన



**న్యూఢిల్లీ, అక్టోబర్ 21:** దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలను ఉద్దేశిస్తూ.. ప్రధాని నరేంద్ర మోదీ ఓ లేఖ రాశారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. ఆపరేషన్ సిందూర్‌కు శ్రీరాముడే స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ భారత ధర్మాన్ని కాపాడటంతో పాటు.. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకుందన్నారు. 'అయోధ్యలో రామాలయం నిర్మించిన తర్వాత ఇది రెండో దీపావళి. ధర్మాన్ని కాపాడాలని శ్రీరాముడు మనకు బోధించాడు. అన్యాయాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని ఇస్తాడు. కొన్ని నెలల క్రితం మనం చేపట్టిన ఆపరేషన్ సిందూరే దీనికి ఉదాహరణ. మనం భారత ధర్మాన్ని కాపాడటంతో పాటు ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకున్నాం. ఈ దీపావళికి మరో ముఖ్యమైన ప్రత్యేకత ఉంది. మావోయిస్టుల నుంచి విముక్తి పొందిన అనేక జిల్లాలతో పాటు మారుమూల ప్రాంతాల్లో కూడా దీపావళి వెలుగులు నిండాయి. మన దేశ రాజ్యాంగంపై విశ్వాసంతో అనేకమంది హింసా మార్గాన్ని విడిచిపెట్టి.. జన జీవన స్రవంతిలోకి వచ్చిన అనేకమందిని మనం ఇటీవల చూశాం అని పేర్కొన్నారు. ఇది దేశానికి ఇది ఒక గొప్ప విజయం అని పేర్కొన్నారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ రేట్లను తగ్గించిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. ఈ జీఎస్టీ రేట్ల తగ్గింపు కారణంగా ప్రజలకు పెద్ద మొత్తంలో లబ్ది చేకూరుతుందన్నారు. ఇక, పౌరులు స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలని మోదీ పిలుపునిచ్చారు. అన్ని భాషలను గౌరవించాలన్నారు. ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. మనం తీసుకునే ఆహారంలో నూనె వాడకాన్ని 10 శాతం తగ్గించి.. యోగాను ఆచరిద్దామన్నారు. ఈ ప్రయత్నాలన్నీ.. మనల్ని వికసిత్ భారత్ వైపు నడిపిస్తాయన్నారు. శక్తి, ఉత్సాహం నిండిన ఈ పండగ వేళ.. దేశ పౌరులందరికి ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం దేశ పౌరులను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ లేఖ రాశారు. దసరా నవరాత్రులు ప్రారంభ వేళ.. జీఎస్టీ ధరలను భారీగా తగ్గించామన్నారు. ఇదంతా భవిష్యత్తు తరం కోసం సంస్కరణలలో భాగంగా వీటిని చేపట్టామన్నారు. ఈ సంస్కరణల కారణంగా దేశంలోని పౌరులకు రూ. వేల కోట్లు ఆదా చేయడానికి దోహదపడుతుందని తెలిపారు. అంతే కాకుండా ఈ నిర్ణయం జీవితాన్ని సులభతరం చేయడంతోపాటు ఆర్థిక వృద్ధిని పెంచుతుందన్నారు. ఇక భారత్, ఉత్తమ భారత్ స్ఫూర్తిని నిలబెట్టడం కోసం స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా దేశ ప్రజలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు. అన్ని భాషల పట్ల గౌరవం పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే ఆరోగ్యంపై అవగాహన సైతం కల్పించుకోవాలని కోరారు.

## అదుపులేని బంగారం ధరలు

**హైదరాబాద్, అక్టోబర్ 21:** దేశీయ విపణిలో బంగారం, వెండి ధరలు మరోసారి భారీగా పెరిగాయి. క్రితం రోజుతో పోలిస్తే పసిడి ధర మంగలశారం దాదాపు రూ.3వేలు పెరిగింది. హైదరాబాద్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి పుత్తడి ధర రూ.1.34 లక్షలు దాటింది. అటు వెండి ధర కూడా కేజీపై దాదాపు రూ.4వేలు పెరగడం గమనార్హం. హైదరాబాద్‌లో 10 గ్రాముల బంగారం ధర (24 క్యారెట్లు) రూ.1,31,600 పలికింది. మంగళవారం ఆ మొత్తం రూ.1,34,500కు చేరింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,21,000గా ఉంది. మరోవైపు కిలో వెండి ధర సోమవారం రూ.1,67,300 పలికింది. నేడు ఆ ధర రూ.1,71,200కు పెరిగింది. గతవారం రూ.1.85 లక్షల వరకు ఎగబాకిన వెండి ధర ఆ తర్వాత కాస్త తగ్గుతూ వచ్చింది. ఇప్పుడు మళ్లీ గిరాకీ పెరగడంతో బంగారం, వెండి ధరలు మరోసారి పరుగులు పెడుతున్నాయి. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర 4,335 డాలర్లు పలుకుతోంది. రాబోయేది పెళ్లిళ్ల సీజన్. దీంతో బంగారం ధర మరింత పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

## తిరుపతి గోశాలలో గోవుల మృతి

### ఆరోపణలపై వివరణ కోరుతూ భూమనకు నోటీసులు

**తిరుపతి, అక్టోబర్ 21:** వైసీపీ నేత, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డికి తిరుపతి ఎస్వీ వర్సిటీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. శ్రీ వెంకటేశ్వర గో సంరక్షణశాలలో గోవుల మృతిపై భూమన చేసిన ఆరోపణలపై వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ విషయంలోనే ఈ నెల 23న ఉదయం 11 గంటలకు విచారణ హాజరుకావాలని నోటీసుల్లో స్పష్టం చేశారు. శ్రీ వెంకటేశ్వర గోశాలలోని అధికారుల నిర్లక్ష్యం, సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే పదుల సంఖ్యలో గోవులు అకాల మరణం చెందాయంటూ ఇటీవల భూమన కరుణాకర్ రెడ్డి విమర్శలు చేశారు. వాటికి సరైన సంరక్షణ, వైద్యం అందించడంలో సిబ్బంది పూర్తిగా విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. అయితే, భూమన చేసిన ఈ ఆరోపణలు రాజకీయంగా సంచలనం సృష్టించాయి. మరోవైపు ఆయన చేసిన ఆరోపణలను పలువురు ఖండించారు. ఈ నేపథ్యంలోనే కొందరు భూమనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలోనే చేసిన ఆరోపణలపై వివరణ ఇవ్వాలని, సాక్ష్యాలు చూపాలంటూ భూమనకు నోటీసులు జారీ చేశారు. మరి పోలీసుల విచారణకు భూమన హాజరవుతారా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది.



## బజార్‌హత్నూర్‌లో దండారి ఉత్సవాలు



**ఆదిలాబాద్, అక్టోబర్ 21 :** ఈ సందర్భంగా గిరిజన కళాకారులు సాంప్రదాయ వేషధారణలో పాల్గొని తమ సాంస్కృతిక కళారూపాలను ప్రదర్శించారు. డప్పుల మోగింపు, గుస్సాడి వేషాల సందడి, నృత్యాలతో గ్రామం మొత్తం ఉత్సాహభరిత వాతావరణాన్ని సంతరించుకుంది. ఉత్సవాల్లో ఎంపీ జి. నగేష్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గిరిజన కళాకారులతో కలిసి నృత్య ప్రదర్శనల్లో పాల్గొని వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, గిరిజనుల సాంప్రదాయాలు తెలంగాణ సంస్కృతికి ఆభరణమని, ఈ కళారూపాలను తరతరాలకు సంక్రమించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గిరిజనుల సాంస్కృతిక సంపద తెలంగాణకు ప్రత్యేక గుర్తింపునిస్తోంది. గిరిజన కళలు, ఉత్సవాలు కొత్త తరానికి స్ఫూర్తినిస్తాయన్నారు. ప్రభుత్వం ఈ సాంప్రదాయ కళారూపాల పరిరక్షణ, ప్రోత్సాహానికి కట్టుబడి ఉందని తెలిపారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, గిరిజనులు ప్రదర్శించే గుస్సాడి %-% దండారి నృత్యాలు వారి ఐక్యత, ఆత్మీయతకు ప్రతీకలని పేర్కొన్నారు. తరువాత గిరిజన నాయకులు ఎంపీ, కలెక్టర్, ఎస్పీ లకు శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోళ్లను ప్రారంభించిన పొంగులేటి



**ఖమ్మం,అక్టోబర్21 :** తెలంగాణ వ్యాప్తంగా మంగళవారం నుంచి సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభయ్యాయి. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ ఏడాది ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో 317 జిన్నింగ్ మిల్లులను సీసీఐ నోట్గి÷ చేసింది. ఈ నెల 24న నల్గొండ జిల్లాలో పలు సీసీఐ కేంద్రాలను మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించనున్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీం నెంబర్ 18005995779 ఏర్పాటు చేసినట్లు తుమ్మల పేర్కొన్నారు.

## మంజీరా తీరాన పర్యాటక ఆకర్షణ

### అడ్వెంచర్ హబ్ పనులపై సమీక్ష

**సంగారెడ్డి, అక్టోబర్ 21:** మంజీరా తీరాన పర్యాటక అడ్వెంచర్ హబ్ ప్రాజెక్టు పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో మంజీరా నది తీరాన అభివృద్ధి చెందనున్న పర్యాటక అడ్వెంచర్ హబ్ ప్రాజెక్టు పనులపై కలెక్టర్ అధ్యక్షతన పంచాయతీ రాజ్ శాఖ విద్యుత్ శాఖ,అటవీ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో మౌంట్ ఎవరెస్టు అధిరోహకులు , ట్రాన్సుసెంట్ అకాడమీ అప్ రాక్ క్లైంబింగ్ సంస్థ నిపుణులు పి అన్విత, ఎస్ ఆనంద్ కుమార్ ,పూర్ణ ,మంజీరా డ్యామ్ పై సాహస క్రీడలు (అడ్వాంచర్) పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. మంజీరా డ్యామ్ ను సాహస క్రీడల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు గల అవకాశాలను వారు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి పరచడానికి మంజీరా నది తీరంలో ఉన్న ప్రకృతి వైభవాన్ని వినియోగించుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. అడ్వెంచర్ హబ్ ద్వారా జల క్రీడలు, బోటింగ్, క్యాంపింగ్, ట్రెక్కింగ్ వంటి కార్యకలాపాలు ప్రారంభమైతే జిల్లా పర్యాటకులకు కొత్త ఆకర్షణగా మారుతుందని తెలిపారు. మంజీరా తీరాన అవసరమైన మౌలిక వసతులైన రహదారి, విద్యుత్ కనెక్షన్, నీటి సరఫరా, భద్రతా ఏర్పాట్లపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు రూపకల్పనలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, సహజ వనరులపై ప్రభావం లేకుండా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. తదుపరి దశలో ప్రాజెక్ట్ అమలుకు సంబంధించిన సాంకేతిక ప్రణాళికను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళిక ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. మంజీరా అడ్వెంచర్ హబ్ పూర్తి స్థాయిలో అమలు చేయబడితే, సంగారెడ్డి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి నూతన దశ ఆరంభమవుతుందని కలెక్టర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు స్థలాన్ని స్వయంగా పరిశీలించేందుకు అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరింగ్ అధికారులు, విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్లు తదితర అధికారులు ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి శ్రీధర్ రావు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.




22-10-25 Samayam_Layout 1 10/22/2025 5:31 AM Page 5



# ప్రజల రక్షణ కోసం ముందుండేది పోలీసులే

మొదటి పేజీ తరువాయి

సీఆర్‌పీఎఫ్ దళాలు వీరోచిత పోరాటం చేశాయి. చైనా సైనికులపై పోరాడి 10 మంది భద్రతా సిబ్బంది అమ-రులయ్యారు. వారిని స్మరించుకుంటూ అమరవీరుల సంస్మరణ దినం నిర్విహించు కుంటున్నాం. వారి త్యాగాలను గుర్తుచేసుకుంటూ మనమంతా స్ఫూర్తి పొందుతున్నాం అన్నారు. సమాజంలో అలజడులు ఉంటే పెట్టుబడులు రావు. శాంతిభద్రతల విషయంలో రాజీపడకుండా పనిచేస్తున్నాం. నేరరహిత సమాజం కోసం అందరూ పనిచేయాల్సిన అవసరముందని సిఎం అన్నారు. సాంకేతికంగా పోలీసు శాఖను బలోపేతం చేస్తున్నాం. సైబర్ నేరాలు, వైట్ కాలర్ నేరాలు పెరిగాయి. సీసీ కెమెరాలు, డ్రోన్లు, గూగుల్ టేకౌట్‌లు విస్తృతంగా ఉపయోగించుకోవాలి. పోలీసు యంత్రాంగానికి సీసీ కెమెరాలు మూడో కన్నులా పనిచేస్తాయి. ఎవరు, ఎక్కడ, ఏ తప్పు చేసినా ఆధారాలతో పట్టుకునే పరిస్థితి రావాలి. ఈగల్, శక్తి బృందాల ఏర్పాటుతో రాష్ట్ర పోలీసు వ్యవస్థ ఆదర్శంగా నిలిచింది. డ్రగ్స్, గంజాయి స్థావరాలను గుర్తించి ధ్వంసం చేస్తున్నాం. స్మగ్లింగ్‌ను పోలీసులు అరికడుతున్నారు. ఎర్రచందనం దొంగల ఆట కట్టిస్తున్నారని అన్నారు. శాంతిభద్రతల విషయంలో రాజీ పడవద్దు ఈ ఏడాది దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో 192 మంది పోలీసులు అమరులయ్యారు. అమరులైన పోలీసుల ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా. ప్రజల రక్షణ కోసం పోలీసులు తమ ప్రాణాలు సైతం పణంగా పెడుతున్న పరిస్థితిని చూస్తున్నాం. ఫ్యాక్షనిజం, నక్సలిజం, రౌడీయిజాన్ని అణచివేయడంలో పోలీసులు మంచి పేరు తెచ్చుకున్నారు. ప్రజల కోసం పరుగులు పెడుతూ విధులు నిర్వహిస్తున్నారు. తమ సంతోషాన్ని త్యాగం చేసి పోలీసులకు సహకరిస్తున్న కుటుంబసభ్యులకు సెల్యూట్ చేస్తున్నా. పోలీసులంటే కఠినంగా ఉంటారను కుంటారు. కానీ మానవత్వంతో వ్యవహరించేది వాళ్లే. విజయవాడలో పిల్లలు చెప్పులు లేకుండా వెళ్తుంటే పెనమలూరు హెడ్‌కానిస్టేబుల్ చెప్పులు కొనిచ్చారు. ప్రజలు ఆస్తులు కాపాడాలనే తపన పడే సిబ్బంది ఉన్నారు. మానవత్వంతో స్పందించే పోలీసు అధికారులు ఉన్నారని ఈ సందర్భంగా వివరించారు. క్రిమినల్స్ సైబర్ టెక్నాలజీలో అప్డేట్ అవుతున్నారు. వారి కంటే ముందుండకపోతే నేరాలను కట్టడి చేయలేం. గూగుల్ పెట్టుబడులు రాష్ట్రంపై నమ్మకంతోనే విశాఖకు వచ్చాయి. ప్రాణం తాత్కాలికం.. చేసే పని శాశ్వతం. సమాజంలో అశాంతి సృష్టించడానికి రాజకీయ ముసుగులో కొత్త నేరాలు చేస్తున్నారు. రాజకీయ కుట్ర, ఫేక్ ప్రచారాలు చేస్తున్నారు. కుల, మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం జరుగుతోంది. సోషల్ మీడియా పెద్ద ఛాలెంజ్‌గా మారింది. వ్యక్తిత్వ హననానికి




పాల్పడుతున్నారు. దీనివల్ల ఎంతో మంది కుమిలిపోతున్నారు. పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం.. నేరస్థులపై కఠినంగా ఉండాలి. శాంతి భద్రతల విషయంలో రాజీ పడవద్దు. నేరస్థుల గుండెల్లో రైళ్లు పరుగెత్తాలి. ప్రభుత్వానికి, ప్రజలకి అండగా ఉండాలి. ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. పోలీసులకు బీమా కల్పించి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. హోంగార్డులకు హెల్త్ ఇన్సూరెన్స్ ఇస్తాం. పోలీసులకు డీఏలతో పాటు సరెండర్ లీవులు ఇస్తున్నాం. 6,100 మంది కానిస్టేబుళ్లను నియమించాం. 2047 నాటికి దేశంలో ఏపీ నంబర్ 1గా ఉండాలి. అన్ని రకాల భద్రత ఉంటేనే ఇది సాధ్యం అని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి అనిత, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు చంద్రబాబు కృషి శక్తి యాప్‌తో మహిళల భద్రతకు పెద్దపీట

### పోలీస్ అమరవీరుల సంస్మరణలో హోంమంత్రి అనిత

మహిళా సాధికారత, రక్షణ కోసం సీఎం చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అందులో భాగంగా శక్తి యాప్‌ను తీసుకు వచ్చామన్నారు. మంగళవారం పోలీసుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీస్ అమర వీరులకు హోం మంత్రి అనిత ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాను నిరోధించేందుకు ఏర్పాటు చేసిన ఈగల్ టీమ్ సమర్థవంతంగా పని చేస్తుందన్నారు. ఆపరేషన్ సేఫ్ పేరిట విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు చర్యలు చేపట్టామన్నారు. సైబర్ స్టేషన్ల ఏర్పాటు.. సీసీ కెమెరాలు, డ్రోన్లు సైతం ఏర్పాటు చేశామని వివరించారు. రాష్ట్ర ప్రజల భద్రత కోసం సీఎం చంద్రబాబు నాయుడు తీసుకుంటున్న చర్యలపై హోమ్ మంత్రి అనిత ప్రశంసలు కురిపించారు. అంతకు ముందు పోలీస్ అమరవీరులకు సీఎం చంద్రబాబు నాయుడు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాతోపాటు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## కోనసీమ బాణాసంచా పేలుడు ఘటన

### మృతుల కుటుంబాలకు 15 లక్షల చొప్పున పరిహారం

### సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశం

అంబేద్కర్ కోనసీమ జిల్లా పేలుడు ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున పరిహారం అందించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అయిన హోం మంత్రి అనిత, అధికారులు సురేష్, ఆకే రవికృష్ణ బాణసంచా పేలుడు ఘటనకు సంబంధించిన నివేదికను సీఎంకు అందించారు. ఒకే షెడ్డులో ఒకే చోట 14 మంది కార్మికులు మెటిరీయల్ మాన్యుఫాక్చరింగ్ చేశారని, హార్డ్ మెటీరియల్ వాడటం వల్లే స్పార్క్ వచ్చి, మాన్యుఫాక్చరింగ్ జరుగుతున్న ప్రాంతంపై పడిందని నివేదికలో అధికారులు పేర్కొన్నారు. ఏ మాత్రం నిబంధనలు పాటించలేదని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. నివేదికను పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, లైసెన్సు ఇచ్చే ముందు నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనేది అధికారులు నిరంతరం తనిఖీలు చేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే పీడీ యాక్ట్ కేసులు పెట్టి కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలు జారీ చేశారు.

## పోలీసుల త్యాగం మరువలేనిది



మొదటి పేజీ తరువాయి

సైనికులకు హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నాను అని ఆ పోస్టులో తెలిపారు. శాంతి, భద్రతల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న పోలీసు సిబ్బందికి అభినందనలు.. పోలీసుల త్యాగం, సేవ తర తరాలను ప్రేరేపిస్తోంది అన్నారు. ప్రజా భద్రత, చట్టం, శాంతి పరిరక్షణలో అప్రతిహతంగా పోలీసులు పని చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి పవన్ రాసుకొచ్చారు. ఇక, క్రైమ్ రేటు తగ్గించడంలో పోలీసుల చేపట్టే ప్రణాళిక, ప్రజా ముఖ్య దృష్టి కోణం ప్రశంసనీయం అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. విధుల పట్ల అంకితభావంతో పని చేసే పోలీసుల త్యాగాన్ని ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## భీమవరం డీఎస్పీ జయసూర్యపై నివేదిక

**అమరావతి :** భీమవరం డీఎస్పీ జయసూర్య వ్యవహారాలపై పశ్చిమ గోదావరి ఎస్పీతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చర్చించారు. సివిల్ తగాదాల్లో తలదూరుస్తున్న డీఎస్పీపై నివేదిక ఇవ్వాలని ఎస్పీని ఆదేశించారు. డీఎస్పీ జయసూర్యపై పవన్ కళ్యాణ్‌కు తరచూ ఫిర్యాదులు వెళ్లాయి. పేకాట శిబిరాలు పెరిగిపోయాయని, సివిల్ వివాదాలలో జయసూర్య జోక్యం చేసుకొంటున్నారని, కొందరి పక్షం వహిస్తూ కూటమి నేతల పేరు వాడుతున్నట్లు పవన్‌కు ఫిర్యాదులు వచ్చాయి. ఈ అంశంపై వెంటనే చర్యలు ఉపక్రమించారు పవన్. పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీతో దీనిపై ఫోన్‌లో చర్చించారు. డీఎస్పీకి సంబంధించిన వ్యవహారంపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. డీఎస్పీ జయసూర్యపై వచ్చిన ఫిర్యాదుల విషయాన్ని ప్రస్తావించి అతడి వ్యవహారశైలిపై నివేదిక పంపించాలని ఎస్పీకి పవన్ ఆదేశాలు జారీ చేశారు.అసాంఘిక వ్యవహారాలకు డీఎస్పీ స్థాయి అధికారి అండగా ఉండటాన్ని తీవ్రంగా పరిగణించాలన్నారు. పోలీసులు సివిల్ వివాదాల్లో తలదూర్చకుండా చూడాలని ఎస్పీకి ఉపముఖ్యమంత్రి సూచించారు. ఇలాంటి వ్యవహారాలను కూటమి ప్రభుత్వం ఉపేక్షించదనే విషయాన్ని సిబ్బందికి తెలియజేయాలని తెలిపారు. ప్రజలందరినీ సమదృష్టితో చూసి శాంతి భద్రతలను పరిరక్షించాలని పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీకి పవన్ కళ్యాణ్ ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు.

## రాష్ట్రంలో కొత్తగా 7 డయాలిసిస్ కేంద్రాలు

మొదటి పేజీ తరువాయి



కేంద్రంలో రూ.75 లక్షల విలువ చేసే రక్త శుద్ధి యంత్రాలు, పరికరాలు ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. కొత్తగా విజయనగరం జిల్లా ఎస్.కోట, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, చిత్తూరు జిల్లా పీలేరు, పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట, నెల్లూరు జిల్లా జిల్లా వెంకటగిరి, బాపట్ల జిల్లా అద్దంకి, నంద్యాల జిల్లా సున్నిపెంట సీహెచ్‌సీ ఆసుపత్రుల్లో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయని చెప్పారు. ప్రతి కేంద్రంలో రోజూ 3 సెషన్ల ద్వారా 15 మందికి రక్తశుద్ధి చేయనున్నారని వెల్లడించారు.

## రియల్ తహసీల్దార్

### బదిలీపై వెళ్తూ కాప్రా తహసీల్దార్ నిర్వాకం

### రూ. 50 కోట్ల సర్కారీ భూమి రియల్ ఎస్టేట్ కు ధారదత్తం




**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, కాప్రా:** ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన రెవెన్యూ శాఖ అధికారులు, రియల్ ఎస్టేట్ మాఫియాతో కుమ్మక్కై కోట్ల రూపాయల విలువైన సర్కారీ భూమిని అక్రమంగా బదిలీ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. జీహెచ్ఎంసీ పరిధిలోని కాప్రా మండలం, చర్లపల్లి రెవెన్యూ పరిధిలో జరిగిన ఈ వ్యవహారం, రెవెన్యూ శాఖలో వ్యాపించిన అవినీతికి మరో ఉదాహరణగా నిలుస్తోంది. సర్వే నంబర్ 137లో 2 ఎకరాలు 16 గుంటల భూమి ఇమామ్ భూమిగా ప్రభుత్వ రికార్డుల్లో ఉంది. ఈ భూమిని పూజా రియల్ ఎస్టేట్ సంస్థ అక్రమంగా కొనుగోలు చేసి, ప్లాట్లు గా అభివృద్ధి చేయడానికి ప్రయత్నించింది. ఇందులో ఒకరికి మాత్రమే ఓఆర్సీ(అక్యూపెన్సీ రైట్‌సెర్టిఫికేట్) ఉండగా, మరొకరికి ఆ సర్టిఫికేట్ లేదు. అయినప్పటికీ, ఆ భూమిని కలిపి రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు కోసం బిల్డ్ నౌ ద్వారా జీహెచ్ఎంసీకి అనుమతి దరఖాస్తు చేశారు. ఆ దరఖాస్తు పరిశీలనలో భాగంగా కాప్రా తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, సర్వేయర్ స్థల పరిశీలనకు వెళ్లగా, ఆ భూమి ప్రభుత్వ ఇమామ్ భూమి అని నిర్ధారితమైంది. అయినప్పటికీ, రియల్ ఎస్టేట్ యజమాని నుండి కోట్ల రూపాయల ముడుపులు స్వీకరించి తహసీల్దార్ అక్రమంగా ఓఆర్సీ సర్టిఫికేట్ జారీ చేశాడు. ఆ సర్టిఫికేట్ ఆధారంగా టౌన్ ప్లానింగ్ శాఖ నిర్మాణ అనుమతులు మంజూరు చేసింది. దీంతో ప్రభుత్వానికి చెందిన సుమారు రూ. 50 కోట్ల విలువైన ఇమామ్ భూమి, పూజా రియల్ ఎస్టేట్ అధీనంలోకి వెళ్లింది. ఈ వ్యవహారం స్థానిక ప్రజల్లో ఆగ్రహం రేకెత్తిస్తోంది. ప్రజలు, సామాజిక సంస్థలు సమగ్ర విచారణ జరిపి సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వర్గాల సమాచారం ప్రకారం, సదరు తహసీల్దార్ గతంలో అవినీతి నిరోధక శాఖ చేత పట్టుబడినప్పటికీ, రాజకీయ ప్రాబల్యం సహకారంతో తిరిగి అదే ప్రాంతంలో పోస్టింగ్ పొందినట్లు చెబుతున్నారు. ఈ సంఘటనతో రెవెన్యూ శాఖపై ప్రజల విశ్వాసం మరింత దెబ్బతింది. ప్రభుత్వ ఆస్తుల రక్షణకు తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, సర్వేయర్‌ల పాత్రపై తక్షణ విచారణ ప్రారంభించి, అక్రమంగా ఇచ్చిన ఓఆర్సీ సర్టిఫికేట్లను రద్దు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### “తహసీల్దార్ బదిలీ

మేడ్చల్ మల్కాజి గిరి జిల్లా లో తహసీల్దార్ లుగా పనిచేస్తున్న వారు అక్రమాలకు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న తహసీల్దార్లపై జిల్లా కలెక్టర్ మను చౌదరి వేటు వేశారు. కాప్రా తహసీల్దార్ పై అనేక ఆరోపణలు రావడంలో కాప్రా నుండి మూడు చింతలపల్లికి బదిలీ చేశారు. హైదరాబాద్ గ్గర ఉన్న నేపథ్యంలో భూముల విషయంలో అనేక ఆరోపణలతో పాటు అవినీతే అధికారులను ఎదుర్కొంటున్నా తహసీల్దార్లపై కలెక్టర్ బదిలీ చేశారు. సుమారు జిల్లా లోని పలు తహసీల్దార్లను బదిలీ చేశారు.

## లక్ష్మీనాయుడు హత్య కేసు విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు

### విచారణ వేగవంతం చేసి నిందితులకు కఠిన శిక్ష పడేలా చేస్తాం

### శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

### ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

### బాధిత కుటుంబాలకు పరిహారం ప్రకటన

**అమరావతి:** కందుకూరులో ఇటీవల హత్యకు గురైన తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి వేగంగా దర్యాప్తు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. హత్య కేసు నిందితులకు కఠినంగా శిక్షపడాలని స్పష్టం చేశారు. సచివాలయంలో హోం మంత్రి వంగలపూడి అనిత, మంత్రి నారాయణ, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఎమ్మెల్యే ఇం టూరి నాగేశ్వరరావుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీ నాయుడు హత్యను సీఎం తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన అత్యంత అమానుషమని, అమానవీయం అని వ్యాఖ్యానించారు. హత్య కేసు విచారణ వేగంగా జరిగేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు అప్పగించాలని అన్నారు. కోర్టులో కేసు విచారణ కోసం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ను నియమించాలని ఆదేశాలు ఇచ్చారు. లక్ష్మీనాయుడు హత్యతో జీవనాధారం కోల్పోయిన కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. వీరితో పాటు దాడిలో గాయపడిన వారికి కూడా ప్రభుత్వం సాయం ప్రకటించింది. లక్ష్మీ నాయుడు భార్యకు 2 ఎకరాల భూమి, రూ.5 లక్షల నగదు పరిహారం అందించాలని సీఎం ఆదేశించారు. లక్ష్మీ నాయుడి ఇద్దరు పిల్లలకు రెండు ఎకరాల చొప్పున భూమి, రూ.5 లక్షల చొప్పున ఫిక్స్‌డ్ డిపాటిజ్ చేయాలని చంద్రబాబు అధికారులను సూచించారు. అంతే కాకుండా ఇద్దరు పిల్లలను చదివించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఇక దాడిలో గాయపడ్డ పవన్, భార్గవ్‌కు కూడా పరిహారం అందించాలని అన్నారు. పవన్‌కు నాలుగు ఎకరాల భూమి, రూ.5 లక్షల నగదుతో పాటు ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరిస్తుందని చెప్పారు. భార్గవ్‌కు కూడా రూ.3 లక్షల నగదు, ఆసుపత్రి ఖర్చులు చెల్లించాలని ఆదేశించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ తరహా వ్యవహారాల పట్ల ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉంటుందని స్పష్టం చేశారు. శాంతి భద్రతల విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు.

## నేటినుంచి చంద్రబాబు దుబాయ్ పర్యటన

**అమరావతి :** నేటినుంచి మూడు రోజుల పాటు యూఏఈలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించనున్నారు. పెట్టుబడుల సాధన కోసం యూఏఈలో ముఖ్యమంత్రి బృందం పర్యటన చేపట్టనుంది. వచ్చే నెల 14-15వ తేదీల్లో విశాఖలో జరగనున్న పార్టనర్షిప్ సమ్మిట్‌కు వివిధ సంస్థల ప్రతినిధులను చంద్రబాబు స్వయంగా ఆహ్వానించనున్నారు. మూడు రోజుల పర్యటన కోసం బుధవారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నుంచి సీఎం చంద్రబాబు దుబాయ్ వెళ్లనున్నారు. 3 రోజుల్లో వివిధ అంతర్జాతీయ సంస్థల యాజమాన్యాలు, ప్రతినిధులతో వన్ టు వన్ మీటింగులకు ముఖ్యమంత్రి హాజరు కానున్నారు. పారిశ్రామికవేత్తలతో పాటు యూఏఈకి చెందిన ప్రభుత్వ ప్రతినిధులతోనూ భేటీ కానున్నారు. రేపు దుబాయ్‌లో సిఐఐ రోడ్ షో కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొనున్నారు. దుబాయ్‌లో మూడవ రోజు ఎపి ఎన్÷-ఆర్‌టి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు దయాస్పోరా సమావేశంలో పాల్గొనున్నారు. తొలి రోజు పర్యటనలో భాగంగా 22వ తేదీ ఐదు కంపెనీలకు చెందిన పారిశ్రామికవేత్తలతో సీఎం భేటీ కానున్నారు. శోభా గ్రూప్, షరాఫ్ డీజీ, ట్రాన్స్ వరల్డ్ గ్రూప్, లూథా గ్రూప్, దుబాయ్ ఫ్యూచర్ ఫౌండేషన్ సంస్థలకు చెందిన ప్రతినిధులతో రేపు సీఎం చంద్రబాబు సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. ఇండస్ట్రియల్, ఐటీ పార్కులు, లాజిస్టిక్స్, వేర్ హౌసింగ్ సదుపాయాలు, పోర్టులు-షిప్ మేనేజ్మెంట్ వంటి రంగాల్లో పెట్టుబడులపై ఆయా సంస్థల ప్రతినిధులతో చంద్రబాబు చర్చించనున్నారు. అంతేకాకుండా, పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు బృందం పలు ప్రాంతాలను సందర్శించనుంది. చంద్రబాబుతో పాటు దుబాయ్ పర్యటనలో మంత్రులు టిజి భరత్, బిసి జనార్ధన్ రెడ్డి, సీఎం సెక్రటరీ కార్తికేయ మిశ్రా, ఇండస్ట్రీస్ సెక్రటరీ యువరాజ్, ఏపీ ఇడీబీ సీఈఓ సాయికాంత్ వర్మ, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈఓ ధాత్రి రెడ్డి పాల్గొననున్నారు. నవంబర్‌లో నిర్వహించే విశాఖ పార్టనర్షిప్ సమ్మిట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం.. పారిశ్రామిక వేత్తలను ఆకట్టుకునేందుకు ఇప్పటికే సింగపూర్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో సీఎం చంద్రబాబు, నారా లోకేష్ రోడ్ షోలు నిర్వహించారు.

## ప్రజలను, వ్యాపారులను బెదిరించడం పేర్ని లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

అందుకోవడం సిగ్గుచేటని రవీంద్ర విమర్శించారు. మచిలీపట్నంలో విలేకరులతో మాట్లాడిన మంత్రి.. వైసీపీ నేత పేర్ని నాని మీద తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దశాబ్దాలుగా వ్యాపారం చేసుకునే మా కుటుంబంపై నిందలేస్తే ఊరుకునేది లేదు.. బందరు ప్రజలకు అన్యాయం చేయాలని చూసినా, అభివృద్ధి అడ్డుకున్నా తగిన బుద్ధి చెబుతాం అంటూ మంత్రి రవీంద్ర వార్నింగ్ ఇచ్చారు. 'పేర్ని నాని రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుండి ప్రజల్ని, వ్యాపారుల్ని వేధించడమే పనిగా పెట్టుకున్నారు. కొనకళ్ల బుల్లయ్య, తాను కలిసి భూములు కొట్టేశామని చెప్పడానికి



పేర్నినాని సిగ్గుపడాలి. నానీ.. దమ్ముంటే రా... రాజకీయంగా బందర్ కు నువ్వేం చేశావో. నేనేం చేశానో తేల్చుకుందాం. పిచ్చి పిచ్చిగా వాగి ప్రజల మధ్య విభేధాలు సృష్టించాలనుకుంటే బుద్ధి చెబుతాం.' అని కొల్లు రవీంద్ర హెచ్చరించారు. ఎలాంటి వ్యాపారాలు లేవని చెప్పుకునే పేర్ని నానికి ఇన్ని వేల కోట్ల ఆస్తులు ఎక్కడి నుండి వచ్చాయి..? అంటూ కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. ముడా భూముల్ని అక్రమంగా తవ్వేసి లక్షల ట్రిప్పుల మట్టి తరలించడం వాస్తవం కాదా..? వీటన్నింటి పై దమ్ముంటే చర్చకు రా.. లేదంటే సైలెంట్ గా ఉండు. అంటూ కొల్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# లక్ష్మీపురం గిర్మాజీపేట 16 డివిజన్ వీధి కుక్కల స్వైర విహారం..




**వరంగల్ అక్టోబర్ 21. (సమయం న్యూస్) :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 16వ డివిజన్ లో వీధి కుక్కల స్వైర విహారం ఆ రోడ్డు వెంట వెళ్లాలంటే భయాందోళనలకు గురవుతున్న స్థానికులు వాహనదారులు వాహనాలు వెళితే వాటి వెంట పడడం నడుచుకుంటూ వెళ్లే వారిని ఎగబడి కరవడం రాత్రులు ఇళ్లలో పడుకున్న వారికి కూడా ఇబ్బంది కలిగేలా శునకాలు అరవడం వలన ఇబ్బంది పడుతున్నామని ఇలాంటివి సంఘటనలు చాలా జరుగుతున్నాయి అయినా కూడా స్థానిక కార్పొరేషన్ సిబ్బంది స్థానిక కార్పొరేటర్ గాని మున్సిపల్ అధికారులు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు వారి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు త్వరితగతిన ఈ కుక్కల బెడద నుంచి స్థానికులను రక్షించాలని కార్పొరేషన్ అధికారులను స్థానికులు వేడుకుంటున్నారు

# శ్రీమాతా స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో నేడు ఉచిత అన్నదాన కార్యక్రమం



**వరంగల్ అక్టోబర్ 21. (సమయం న్యూస్) :** గ్రేటర్ వరంగల్ పరిధిలో గల శ్రీమాతా స్వచ్ఛంద సేవా సంస్థ వారు నేడు వరంగల్ సి కె ఎం హాస్పిటల్ నందు శ్రీమాతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు ముద్దసాని మల్లిక అధ్యక్షతన ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆస్పత్రికి వచ్చిన ప్రజలు పేషెంట్ కు సంబంధించిన అటెండెన్స్ సుమారుగా 200 మందికి పైగా ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రస్థలను స్వీకరించారు మరియు ఆసుపత్రి సిబ్బంది కూడా పాల్గొన్నారు సమస్త కార్యవర్గం ప్రధాన కార్యదర్శి నన్నపు సంజీవరావు ఉపాధ్యక్షులు ఎన్ రాజేంద్రప్రసాద్. కోశాధికారి కొత్తగట్టు కల. సరోజన తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# గ్రూప్-1 ర్యాంకర్లను సన్మానించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.



**వరంగల్ అక్టోబర్ 21. (సమయం న్యూస్):** ఇటీవల తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (TGPSC) విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో హనుమకొండ జిల్లాకు గర్వకారణంగా నిలిచిన అభ్యర్థులను ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రూప్-1లో ప్రతిభను చాటిన శ్రీ బండారి అన్వేష్ (DSP), సంఘాల జశ్వంత్ రాజ్ (DSP), పోతరాజు పవన్ (మునిసిపల్ కమిషనర్) లను ఎమ్మెల్యే గారు వారిని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు . ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ హనుమకొండ జిల్లాకు చెందిన మేధావులు అత్యున్నత పోటీ పరీక్షల్లో విజయం సాధించడం గర్వకారణం. ఇది యువతకి స్ఫూర్తిదాయకం. భవిష్యత్ లో యువతి యువకులు ప్రభుత్వ పోటీ పరీక్షలలో నియోజకవర్గం నుంచి విజయం సాధించాలని అభిలాషించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో యువతకు అవకాశాలు విస్తరిస్తున్నాయి. ఉద్యోగ నియామక పత్రాలను సీఎం గారి చేతుల మీదుగా అందుకోవడం మరింత గౌరవమైన విషయం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పేద ప్రజలకు న్యాయం అందేలా,సమాజ అభివృద్ధికి పాటు పడాలని ఆకాంక్షించారు.



మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని మేయర్ ఛాంబర్ లో స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్మెంట్ (సాస్కి) పథకం ప్రతిపాదనల రూపకల్పనపై కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి అధికారులతో సమీక్షించిన మేయర్ గుండు సుధారాణి.

# విధినిర్వహణలో పోలీసులు త్యాగం స్ఫూర్తిదాయకం.

- శాంతియుత సమాజం, పటిష్టమైన శాంతిభద్రతల తోనే అభివృద్ధి సాధ్యం:
- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్.
- విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం:
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్.



**నారాయణపేట, అక్టోబర్,21సమయం న్యూస్):** ..అమరుల త్యాగాలు, ఆశయాల సాధన దిశగా ముందుకు సాగాలి.

...విధి నిర్వహణలో, దేశ రక్షణ కోసం ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల సంస్మరణ (పోలీస్ ఫ్లాగ్ డే) ను జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్లో ఘనంగా నిర్వహించారు. పోలీసు పరేడ్ గ్రౌండ్లో నీ అమరవీరుల స్తూపం వద్ద జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్, అదనపు ఎస్పీ ఎం.డి రియాజ్ హుల్ హక్, డీఎస్పీ నల్లపు లింగయ్య పోలీస్ అధికారులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా సంఘవిద్రోహశక్తులచే పోరాడి చనిపోయిన పోలీస్ పోలీసు అమరుల త్యాగం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. ప్రజల సంరక్షణ కోసం పోలీస్ వ్యవస్థ నిరంతరం 24ి7 పనిచేస్తుందని, శాంతిభద్రతల పరిరక్షణ తో పాటు దేశ అంతర్గత భద్రత ప్రజల రక్షణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ ఇలా ప్రతి సందర్భాల్లోనూ పోలీస్ వ్యవస్థ చాలా కీలకంగా పని చేస్తుందన్నారు. ఏక్కడ ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన వెంటనే రియాక్ట్ అయి కంట్రోల్ చేయడం జరుగుతుందని చెప్పారు. శాంతిభద్రతలు పటిష్టంగా ఉన్నప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, మన రాష్ట్రం ఇంత అభివృద్ధి చెందడానికి పోలీస్ వ్యవస్థ పటిష్టంగా ఉందని తెలిపారు. అమరులైన పోలీసులకు, వారి కుటుంబాలకు ఎలాంటి అవసరాలు ఉన్న జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి పూర్తి సహకారం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అమరులైన పోలీసులకు ప్రత్యేకంగా ఈరోజు నివాళులర్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరులైన పోలీసులకు ఈరోజు శ్రద్ధాంజలి ఘటించడం జరుగుతుందని తెలిపారు. ప్రపంచమంతా నిద్రలో ఉంటే పోలీసు మేల్కొని, శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం నిరంతరం కాపలా కాస్తుంటారాని ఎండ, వాన, పగలు, రాత్రి అనే తేడా లేకుండా కుటుంబంతో కలిసి జరుపుకునే పండగల్ని కూడా త్యజించి, ప్రజల కోసం శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలని సైతం పణంగా పెట్టి ప్రజల కోసం సంఘ విద్రోహశక్తులచే పోరాడి వీర మరణం పొందిన పోలీసులు చేసిన త్యాగానికి సాను భూతి, గౌరవం చూపించడం మనందరి బాధ్యత అని తెలిపారు. అక్టోబర్ 21, అంటే పోలీసు అమరవీరుల దినం. 1959 చైనా దురాక్రమణను భారత సైన్యం సమర్థంగా తిప్పిగొట్టిన రోజు ఇది. ఈ సమరంలో ఎంతోమంది సైనికులు అమరులయ్యారు. ఆ రోజును పురస్కరించుకుంటూ, విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ యోధుల త్యాగాలను స్మరించుకుందాం. దేశ సరిహద్దుల్లో సైనికులు అమరులైన రోజు ఇది. 1959 అక్టోబర్ 21న లడఖ్ సరిహద్దులో కాపలాగా ఉన్న పదిమంది సిఆర్పిఎఫ్ జవాన్లు చైనా సైన్యంతో వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించడం జరిగింది అప్పటినుంచి దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులను స్మరించుకుంటూ ప్రతి ఏడాది అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినముగా ప్రభుత్వం పాటిస్తోంది చెప్పారు. పోలీసు వ్యవస్థ పటిష్టంగా ఉంటే అభివృద్ధి ప్రతి ఒక్కరికి చేరుతుంది అనడానికి మన రాష్ట్రమే నిదర్శన%. ఈ సమాజం కోరుకునేది శాంతి, స్థిరత్వం, అభివృద్ధి. పోలీసుల త్యాగాల ద్వారా ఎన్నో దశాబ్దాలుగా భౌతిక రక్షణ నుండి, సామాజిక రుగ్మతలను పారద్రోలడం వరకు పోలీసు వ్యవస్థ ఎల్లప్పుడూ కార్యదీక్షతో, సేవాభావంతో పని చేస్తుంది. విధి నిర్వహణలో ప్రాణాలర్పించి అమరవీరులైన పోలీసుల త్యాగాలు వెల కట్టలేనివి చెప్పారు. అమర వీరులు అయిన పోలీసుల యొక్క త్యాగాలను గుర్తు చేసుకుంటూ అక్టోబర్ 21 నుండి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి అయిన అక్టోబర్ 31వ తేదీ జాతీయ ఐక్యత దినోత్సవం వరకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు. ఈ సంవత్సరంలో దేశవ్యాప్తంగా తీవ్రవాదులు, సంఘ విద్రోహక శక్తుల్లో 191 మంది పోలీసులు అమరులయ్యారు. నారాయణపేట జిల్లాలో అంతర్గత భద్రత పరిరక్షణ విధుల్లో కానిస్టేబుల్ రాజారెడ్డి 2005 సంవత్సరంలో వీర మరణం పొందారు వారి కుటుంబ సభ్యులకు పోలీసు అండగా ఉంటారని తెలిపారు. పోలీస్ ల త్యాగనిరతిని నిరంతరం మననం చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. అనంతరం జిల్లా పోలీసులు జిల్లా పోలీస్ కార్యాలయం నుండి సావర్కర్ చౌరస్తా మీదుగా సత్యనారాయణ చౌరస్తా నుండి జిల్లా పోలీస్ కార్యాలయం వరకు జోహార్ పోలీస్ అమరవీరులకు జోహార్ జోహార్ అంటూ వారికి నివాళులర్పిస్తూ జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మొహమ్మద్ రియాజ్, డీఎస్పీ ఎన్ లిం గయ్య, పరేడ్ కమాండర్ నరసింహ, సిఐలు శివశంకర్, రామ్ లాల్,రాజేందర్ రెడ్డి, సైదులు, ఎస్.ఐ లు వెంకటేశ్వర్లు, నరేష్,ఎస్.ఎం నవీద్, బాలరాజు, భాగ్యలక్ష్మి రెడ్డి, రమేష్, సునిత, అశోక్ బాబు,ఆర్ఎస్ఇ లు శివశంకర్ శిరీష,మద్దయ్య శ్వేత, ఆర్మడు రిజర్వు పోలీస్ సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల త్యాగం చిరస్మరణీయం

- అని జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ అన్నారు.
- ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న దేశవ్యాప్తంగా నిర్వహించే
- పోలీస్ సంస్మరణ దినోత్సవాన్ని వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో
- మంగళవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన
- ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా
- జిల్లా కలెక్టర్, ప్రతీక్ జైన్ పాల్గొన్నారు.



**వికారాబాద్, అక్టోబర్,21(సమయం న్యూస్):** ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలీస్ అమరవీరుల బలిదానం దేశానికి గర్వకారణమని కొనియాడారు. పోలీస్ శాఖ అందిస్తున్న సేవలు అత్యంత విలువైనవని సమాజంలో భద్రత, శాంతిని కాపాడటంలో పోలీసులు నిరంతరం పోరాడుతున్నారని ఆయన అన్నారు. దేశ సరిహద్దుల్లో 1959లో జరిగిన చైనా దళాల దాడిలో ప్రాణాలు కోల్పోయిన 10 మంది వీరుల స్మారకార్థం ఈ రోజును జరుపుకోవడం మనందరి బాధ్యత అని వారి ధైర్యసాహసాలు, దేశభక్తి భావితరాలకు ఎం తో ఆదర్శమన్నారు. జిల్లా పరిపాలనలో పోలీస్ వ్యవస్థ పాత్ర చాలా కీలకమని, జిల్లా ప్రజల తరపున అమరవీరులకు నివాళులు అర్పిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి మాట్లాడుతూ... దేశ అంతర్గత భద్రతను కాపాడుతూ, చట్టాన్ని అమలు చేస్తూ ప్రాణాలు కోల్పోయిన వీర పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. పోలీస్ ఉద్యోగం కేవలం విధి నిర్వహణ మాత్రమే కాదుని, ప్రజలకు సేవ చేసే మహత్తర అవకాశంగా భావించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో మన జవాన్లు చేసిన, చేస్తున్న కృషి వెలకట్టలేనిది. వారి నిస్వార్థ సేవ మరియు త్యాగాలు జిల్లా పోలీసులకు నిత్య స్ఫూర్తిగా నిలుస్తాయని ఆయన అన్నారు. అమరవీరుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పోలీస్ అమరవీరుల ప్రాణ త్యాగాల స్మరణలో భాగంగా నేటి నుండి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి అయిన "జాతీయ ఐక్యత దినోత్సవం" అక్టోబర్ 31వ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఇట్టి సంధార్బంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో లో విద్యార్థులకు, పోలీస్ అధికారులకు వ్యాసరచన పోటీలు, రక్తదాన కార్యక్రమాలు, సైకిల్ ర్యాలీలు మొదలగు వివిధ కార్యక్రమాలు చేయడం జరుగుతుందని ఈ కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు పాల్గొని విజయ వంతం చెయ్యాలని జిల్లా ఎస్పి కే. నారాయణ రెడ్డి కోరారు. పోలీస్ పరేడ్ అనంతరం అమరవీరుల స్థూపం వద్ద జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి, అదనపు ఎస్పి బి.రాములు నాయక్ జిల్లా లోని పోలీస్ అధికారులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయుధ దళాల గౌరవ వందనం మధ్య జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్ అమరవీరుల పేర్లను చదివి వినిపించారు. ఇట్టి కార్యక్రమం వికారాబాద్ డిఎస్పి లు శ్రీనివాస్ రెడ్డి,శ్రీనివాస్,బాల కృష్ణ రెడ్డి , డిసిఆర్బి డిఎస్పి జానయ్య , డిటిసి డిఎస్పి శ్రీనివాసులు ,ఆర్ డిఎస్పి వీరేష్ ఇన్స్పెక్టర్ లు,ఆర్ఐ లు,ఎస్ఐ లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తొలగించిన దర్గాను యథాస్థానంలో ఏర్పాటు చేయాలి

-ఎంఐఎం పార్టీ కొడంగల్ తాలూకా
-అధ్యక్షులు,వికారాబాద్ జిల్లా జాయింట్
-సెక్రెటరీ-ఎస్బి. గుల్షన్

**కొడంగల్ మున్సిపాలిటీ(మం)(సమయం న్యూస్):** కొడంగల్ పట్టణంలో రోడ్డు విస్తరణలో తొలగించిన దర్గా ను యథాస్థానంలో ఏర్పాటు చేసేందుకు ఇచ్చిన హామీని అమలు కు నోచుకోవడం లేదని ఎంఐఎం పార్టీ కొడంగల్ తాలూకా అధ్యక్షుడు ఎస్. బీ.గుల్షన్ అన్నారు. తొలగించిన దర్గా విషయంలో ఇటీవలే హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ లో సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన సందర్భంలో దర్గాను అక్కడే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. 20 రోజులు గడుస్తున్నా.. ఇప్పటి వరకు అమలుకు నోచుకోవడం లేదన్నారు. వెంటనే దర్గా నిర్మాణానికి చర్యలు తీసుకోని పక్షంలో నిరాహార దీక్ష చేస్తాం అన్నారు. సమావేశంలో షేక్ రోమన్, ఎండీ.సర్తాజ్ హుస్సేన్, సయ్యద్ ముస్తఫా, ఎండీ. మూర్తజా, ఎండీ.అమీర్ హుస్సేన్, సయ్యద్ అర్షద్ అలీ ఖాద్రి పాల్గొన్నారు.



# స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాత్రుత్వం న్యాయం.

- బామ్ సేఫ్ లక్ష్యాలు
- కులమత రాజకీయాలకు అతీతమైన ఉదాత భరిత మార్గం ఇది
- బామ్ సేఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు గుండ్ల విజయకుమారి
- ( సమయం ఇంటర్వ్యూలో ...)



**ఖమ్మం అక్టోబర్ 21 : ( సమయం న్యూస్ )** స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాత్రుత్వం న్యాయం బామ్ సేఫ్ లక్ష్యాలు అంటూ... కుల మత రాజకీయాలకు అతీతమైన ఉదాత భరిత మార్గమని , బామ్ సేఫ్ తో పాటు తన గురించి సమయం ఖమ్మం ఉమ్మడి జిల్లా ప్రతినిధి యం డి. షఫీ యు జమ కు వెల్లడిస్తూ అనేక సామాజిక రాజకీయ అంశాల పై ఆమె తన అభిప్రాయాలను ప్రకటించారు. తాను వృత్తిరీత్యా టీచర్ అయినప్పటికీ మొదటినుండి తనకు గల సామాజిక స్పృహ , బామ్ సేఫ్ వైపు ఆకర్షింప చేసిందన్నారు. మన చరిత్ర , మన అస్తిత్వం, మనకు బోది స్తున్న పాఠాలు ఒక భావజాల పరిధిలో ఓవైపే చూపుతున్న నేపథ్యంలో ... మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మం డలంలో 2017లో జరిగిన బామ్ సేఫ్ క్యాడర్ క్యాంపు తనకు అంతకు ముందున్నజ్ఞానం లో ఉన్న అజ్ఞానాన్ని తొలగించిందని తెలిపారు. పూలే బి అంబేద్కర్ ల ప్రభావంతోతొలత సామాజిక సమస్యలపై అనంతరం రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన దివంగత కాన్షీరామ్ బామ్ సేఫ్ అనే స్వచ్ఛంద సంస్థను అంకురార్పణ చేశారని వివరించారు. ఆర్యబి ద్రావిడ , సింధు నాగరికత , మూల వాసుల అంశాలపైబామ్ సేఫ్ తన ఆలోచనను , తన జీవిత ప్రస్థానాన్ని ప్రభావిత పరచడం జరిగిందన్నారు. సమాజంలో బహుజనుల పోరాటాలు ,ఉద్యమాలు, బలిదానాలు , వారి సంస్కృతి , సాంప్రదాయాలు , భాషలు , లిపి లు , ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీల డిఎన్ఏ ... మన మంతా ఈ దేశ మూలవాసు లమని ప్రకటిస్తున్నాయని స్పష్టం చేశారు. మాతృ స్వామిక వ్యవస్థ , సింధూ లోయ ( హరప్పా ) నాగరికత నిర్మాణ కర్తలం కూడా మనమే , మన నుండే... విభజించు పాలించు సూత్రంతో స్ఫూర్తి పొందిన ఆంగ్లేయులు , మనువాద శక్తులతో పోటీ పడి చరిత్రలను విధ్వంసం చేయడమే కాకుండా పెద్ద ఎత్తున వక్రీకరణకు పాల్పడ్డారని పేర్కొన్నారు. బామ్ సేఫ్ తొలుత కాన్షీరామ్ చేతుల మీదుగా 1978లో ఆవిర్భవించగా ... పైన పేర్కొన్న లక్ష్యాల మేరకు ఇప్పటికీ పని చేస్తోందని .... ప్రస్తుతం తమ సంస్థకు జాతీయ అధ్యక్షుడిగా ఆర్ ఎల్. ధృవ్ విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. మహిళలు కూడా బామ్ సేఫ్ లో చురుకుగా పాల్గొంటున్నారని , క్యాడర్ క్యాంపు కార్యక్రమాలలో సైతం పాల్గొంటూ ... పైన ఉదాహరించిన లక్ష్యాల సాధనకు పురుషులకు దీటుగా అంకితభావంతో ముందుకు పోతున్నారని తెలిపారు. తమ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ( సీ ఈ సీ ) లో ముగ్గురు , స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ( ఎస్ ఈ సీ ) లో కూడా ముగ్గురు మహిళలు ప్రాతినిధ్య వహిస్తున్నారని పేర్కొన్నారు. తాను బామ్ సేఫ్ రాష్ట్ర అధ్యక్షులు గా ఇటీవల కాలంలోనే పదవి బాధ్యతలు స్వీకరించడం జరిగిందని , త్వరలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా డిస్టిక్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ( డీ ఈ సీ ) లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గత 53 సంవత్సరాల కాలంగా బామ్ సేఫ్ నిర్విరామంగా పని చేస్తోందని ... భవిష్యత్తులో ....తెలంగాణ రాష్ట్రంలో దీనిని మరింత బలోపేతం చేసే దిశగా తన కార్యాచరణ ప్రణాళిక ఉ ంటుందన్నారు. ఈ సంవత్సరం (2025 ) జూన్ మాసంలో తాను బామ్ సేఫ్ రాష్ట్ర అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించి , కొన్ని నెలలు కావడం మూలాన డి ఈ సి నిర్మాణాలపై దృష్టి కేంద్రీకరించలేక పోయానని తెలుపుతూ బామ్ సేఫ్ లో మహిళల ప్రాతినిధ్యం మరింత పెరగాల్సిన ఆవశ్యకత ఉందని , ముఖ్యంగా యువత ,మహిళల భాగస్వామ్యం బామ్ సేఫ్ కు అవసరమని , తన దృష్టి దీనిపై కేంద్రీకరిస్తున్నట్లు ప్రకటిస్తూ , తన ఇంటర్వ్యూను గుండ్ల విజయ కుమారి ముగించారు.

# క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్.
- కోస్గి పట్టణ కేంద్రంలోని సామాజిక
- ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన- జిల్లా కలెక్టర్



**కోస్గి మున్సిపాలిటీ (మం)(సమయం న్యూస్) :** బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ మరియు రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ హైదరాబాద్ ద్వారా ఈ నెల 24 న కోస్గి సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహణ కు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నారాయణ పేట జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళ వారం జిల్లా కలెక్టర్ సందర్శించి ఉచిత క్యాన్సర్ శిబిరం నిర్వహణ పై కడ ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి, వైద్య శాఖ అధికారులతో ఆమె సమీక్షించారు. ఈనెల 24 న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించే క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరానికి నిపుణులైన వైద్యులు వస్తారని, శిబిరంలో క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడానికి ఆరోగ్య విద్య కౌన్సెలింగ్, మహిళలకు పీ ఏ పీ స్మెర్, క్లినికల్ బ్రెస్ట్ ఎగ్జామినేషన్, మామోగ్రఫీ,అల్ట్రాసౌండ్ మెడ,అల్ట్రాసౌండ్ ఉదరం పెల్విస్,సోనో మామోగ్రఫీ, డిజిటల్ ఎక్స్ రే ఛాతీ,నోటి పరీక్షలన్నీ నిపుణులైన వైద్యుల క్లినికల్ ప్రిస్క్రిప్షన్ ప్రకారం నిర్వహించబడతాయని కలెక్టర్ తెలిపారు. శిబిరానికి ఇద్దరు మహిళా వైద్యులు ఇద్దరు పురుష వైద్యులు (రేడియాలజిస్ట్తో సహా) నర్సులు, టెక్నీషియన్లు మరియు హౌస్ కీపింగ్ సిబ్బందితో సహా 13 మంది సహాయక సిబ్బందితో వస్తారన్నారు. క్యాన్సర్ వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని, క్యాన్సర్ స్క్రీనింగ్ అనేది మన ఆరోగ్యాన్ని కాపాడుకునే ముందస్తు జాగ్రత్త అని ఆమె తెలిపారు. ఎలాంటి లక్షణాలు కనిపించకపోయినా క్యాన్సర్ ను ముందస్తుగా గుర్తించ డానికి ఈ స్క్రీనింగ్ దోహదపడుతుందని, ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. రాష్ట్ర హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు ఆదేశాల మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ తో సమన్వయంతో ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన మోడల్ క్రష్ గదిని కలెక్టర్ పరిశీలించారు. వర్కింగ్ ఉమెన్స్ పిల్లల కోసం మోడల్ క్రష్ గదిని ఎంతో సుందరంగా ముస్తాబు చేశారు. అనంతరం కలెక్టర్ కోస్గి పట్టణంలో నిర్మిస్తున్న అండర్గ్రౌండ్ డ్రైనేజి పనులను మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డా. మల్లికార్జున్, కోస్గి తహసిల్దార్ బక్క శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# నార్సింగ్ వైస్ ఛైర్మన్ జి వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సదర్ ఉత్సవాలు

- బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచంద్ర యాదవ్

**శేరిలింగంపల్లి అక్టోబర్ 21 సమయం న్యూస్ .:** సదర్ పండుగ మహోత్సవం సందర్భంగా బేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఏటా ఘనంగా సదర్ నిర్వహిస్తున్న వెంకటేశ్ యాదవ్ కు శుభాకాంక్షలు తెలిపారు, శనివారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ యాదవుల గొప్ప పండుగ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ఘనంగా నిర్వహించుకుంటున్న ఈ పండుగలు కుల మతాలకు అతీతంగా ఐక్యమత్యానికి చిహ్నంగా సదర్ పండుగ నిర్వహించడం జరుగుతుందన్నారు. అందరూ ఐక్యమత్యంతో ఉండి యాదవుల యొక్క వృత్తిని కాపాడుతూ ఐక్యమత్యమే మహాబలంగా ప్రతి ఒక్కరూ సామాజిక న్యాయంతో అందరూ విద్యా ఉద్యోగ ఆర్థిక రాజకీయాల్లో ముందు ఉండాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం పశువులను అందించే దానా సబ్సిడీలో ఆందివ్వాలని యాదవులు ముఖ్యంగా పశుసంపత్తి పశు ఉత్పత్తి పాల వ్యాపారం మీద ఆధారపడి జీవనం సాగిస్తూ ఉంటారన్నారు. మరి ప్రభుత్వాలు అన్ని రంగాలలో చేయూతనిస్తూ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఎక్కడైతే బంజరు భూమి ఘూట్ ఆన్ భూమి ఉంటదో అది పశువుల మే తకై యాదవ్లకు స్థలాలు కేటాయిం చి మరి సబ్సిడీ మీద ఈ పాల డైరీలు పెట్టుకునే విధంగా ప్రోత్స హించాలని ప్రభు త్వానికి కోరారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పెరుగు ఐలేష్ యాదవ్, అందెల కుమార్ యాదవ్, తెల్లా పూర్ శేఖర్. శం షాబాద్ మిద్దెల తేజస్వి తేజ యాదవ్, అరుణ్, కృష్ణ యాదవ్, రాము యాదవ్, యాదవ్ సంఘం పెద్దలు యువజన నాయకులు గ్రామ పెద్దలు మహిళలు యువకులు, పెద్ద ఎత్తున పాల్గొని ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలియజేశారు



# తెలంగాణ రైజింగ్ విజన్ - 2047 సర్వేలో భాగస్వాములు కావాలి

-నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్




**నారాయణపేట, అక్టోబర్,21(సమయం న్యూస్) :** తెలంగాణ రాష్ట్రాన్ని రానున్న రోజులలో అభివృద్ధి, సంక్షేమ రంగాలలో అగ్రగామిగా నిలిపేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్ విజన్ - 2047" అంశాలతో డాక్యుమెంటును రూపొందిస్తున్నదని, ఈ సర్వేలో ఉద్యోగులు, అన్ని వర్గాల వారు భాగస్వాములు కావాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా రూపొందిస్తున్న ఈ విజన్ 2047 డాక్యుమెంట్ తయారీలో ప్రతి ఒక్క పౌరుడు పాల్గొనేలా సిటిజన్ సర్వే చేపట్టారని అన్నారు. అక్టోబర్ 10 వ తేదీన ప్రారంభమైన ఈ సర్వేలో ఇప్పటికే ప్రజలు, ప్రవాస భారతీయులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సర్వేలో ప్రతీ ఉద్యోగి పాల్గొని తమ సలహాలు, సూచనలు అందించాల్సి ందిగా కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 14వ తేదీన సర్క్యులర్ జారీ చేసిందని కలెక్టర్ తెలిపారు. ఈనెల 25 వ తేదీ వరకు కొనసాగే విజన్-2047 సర్వేలో అందరు ఉద్యోగులు పాల్గొనడంతో పాటు ఈ సర్వే లింక్ ను, QR కోడ్ ను తమ తమ కార్యాలయాల్లో ప్రదర్శించాలని, ఈ సర్వే గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. తెలంగాణ రైజింగ్ విజన్ - 2047 డాక్యుమెంటరీని రూపొందించడంలో ప్రతి రాష్ట్ర పౌరుడు భాగస్వామ్యమై సిటిజన్ సర్వేలో పాల్గొని తమ ఆలోచనలను పంచుకోవాలని తెలిపారు. ఈ సర్వేలో పాల్గొనేందుకు http//www.telangana. gov.in/telanga-narising% అనే లింక్ ద్వారా పాల్గొనాలని సూచించారు.

# అక్రమంగా కొనసాగుతున్న బ్యాటరీ రీసైక్లింగ్ పరిశ్రమ

- ఆగ్రహం వ్యక్తం చేసిన రాళ్లకత్వ గ్రామస్తులు



**జిన్నారం, అక్టోబర్ 21(సమయం న్యూస్):** సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ పరిధిలోని రాళ్లకత్వ గ్రామ శివారులో సర్వే నంబర్ 286లో అసైన్డ్ భూమిలో అక్రమంగా ఏర్పాటు చేసిన బ్యాటరీ రీసైక్లింగ్ పరిశ్రమ మరోసారి వివాదానికి కారణమైంది. గ్రామ ప్రజల వివరాల ప్రకారం, ఈ పరిశ్రమ నుండి వెలువడుతున్న విషపూరిత రసాయన వాయువులు పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్నాయి. గతంలో గ్రామస్తులు ఈ విషయాన్ని పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ హైదరాబాదుకు ఫిర్యాదు చేయగా, అధికారులు పరిశీలించి ఆ పరిశ్రమను మూసివేయాలని ఆదేశించినట్లు తెలిపారు. అయితే కొద్ది రోజులు నామమాత్రంగా మూసివేసిన తర్వాత, మళ్లీ రాత్రి వేళల్లో దొంగచాటుగా కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందన లేకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజా శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని, గ్రామాన్ని ప్రమాదకర రసాయనాల నుండి రక్షించాలని వారు డిమాండ్ చేశారు. తగిన చర్యలు తీసుకోకపోతే ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమవుతామని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా దానికి సంబంధిత శాఖలే బాధ్యత వహించాల్సి ఉంటుందని గ్రామస్థులు హెచ్చరించారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డే కృష్ణ



**జిన్నారం, అక్టోబర్ 21(సమయం న్యూస్) :** పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డే కృష్ణ అన్నారు. మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని దాడిగూడెం గ్రామానికి చెందిన దాది సత్యనారాయణకు ముఖ్యమంత్రి సహాయనిది నుండి 60 వేల రూపాయల చెక్కునుపంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు వడ్డే కృష్ణ మాట్లాడుతూ పేదప్రజల ఆరోగ్యానికి సంజీవినిగా ముఖ్యమంత్రి సహాయనిది అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్ రెడ్డి మాజీ వైస్ ఎంపీపీ గంగ రమేష్ ఓట్ల మాజీ సర్పంచ్ చింతల శివరాజ్ జింకల అరబి పొట్టి భాస్కర్ పూజారి కృష్ణ శంకరయ్య నరేందర్ గౌడ్ మహేందర్ రెడ్డి విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

22-10-25 Samayam_Layout 1 10/22/2025 5:31 AM Page 8



# అత్యధిక గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించిన శివాలి

**- మరో రెండు సరికొత్త రికార్డులు**

**- ఇప్పటివరకు 21 గిన్నిస్ రికార్డులతో మరో రికార్డు**



**పటాన్ చెరు, అక్టోబర్ 21, (సమయం న్యూస్):** హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థిని శివాలి జోహ్రి శ్రీవాస్తవ (స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, 2016–2020 బ్యాచ్ సీఎస్ఈ), ఆమె తల్లిదండ్రులు కవితా జోహ్రి శ్రీవాస్తవతో కలిసి ప్రపంచంలోనే అతిపెద్ద ఓరిగామి ప్రదర్శన చేసి రెండు సరికొత్త గిన్నిస్ వరల్డ్ రికార్డులను సాధించారు. ఈ తాజా విజయంతో, శివాలి మొత్తం 21 గిన్నిస్ వరల్డ్ రికార్డులకు చేరుకుని, మనదేశంలో అత్యధిక సంఖ్యలో గిన్నిస్ రికార్డులు కలిగి ఉన్న వ్యక్తిగా ఆమె నిలిచింది. గతంలో శివాలి 19 గిన్నిస్ రికార్డులు సాధించిన విషయం విదితమే. వాటిలో 1,251 చేతితో తయారు చేసిన కాగితపు బొమ్మలు, 7,011 క్విల్డ్ పువ్వులు, 2,111 పేపర్ క్విల్డ్ బొమ్మలు, 3,501 ఓరిగామి తిమింగలాలు, 2,100 పెంగ్విన్లు, 6,132 సిట్రస్ పండ్లు, 6,001 తిమింగలాలు, 2,500 పెంగ్విన్లు, 1,993 మాపుల్ ఆకులు, 6,500 గబ్బిలాలు, 5,500 కార్లు, 3,400 డైనోసార్లు, 1,900 కుక్కలు, 3,400 నెమళ్ళు, 3,200 పందులు, 4,400 చొక్కాలు, 2,200 క్విల్డ్ బొమ్మలు, 3,200 సీల్స్, 3,400 రిబ్బన్ టైలు ఉన్నాయి. ఇవేగాక, 15 అసిస్ట్ వరల్డ్ రికార్డులు, నాలుగు యూనిక్ వరల్డ్ రికార్డులను కూడా శివాలి సాధించి, తన అసమానమైన సృజనాత్మకత, పట్టుదల, కళ పట్ల మక్కువను ప్రదర్శిస్తోంది. గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగం–క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్, గణిత శాస్త్ర ఆచార్యుడు డాక్టర్ డి. మల్లికార్జునరెడ్డి, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు శివాలి అసాధారణ విజయాలను ప్రశంసించి, అభినందనలు తెలియజేశారు.

# బిఆర్ఎస్ నేతకు దీపావళి శుభాకాంక్షలు



**జిన్నారం, అక్టోబర్ 21(సమయం న్యూస్):** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు బండి శ్రీకాంత్ గౌడ్, దీపావళి పర్వదినం సందర్భంగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గంధం చెక్కతో ప్రత్యేకంగా రూపొందించిన గోవర్ధన్ రెడ్డి చిత్రపటాన్ని బహూకరించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంలో గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, "దీపావళి వెలుగులు ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు, సౌభాగ్యాలు నింపాలని ఆకాంక్షిస్తున్నాను. ప్రజల సేవలో, అభివృద్ధి కార్యక్రమాల్లో బిఆర్ఎస్ నాయకులు ఇలాగే ముందుండాలని కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, మంద రమేష్, బ్రహ్మేందర్ గౌడ్, అంజి రెడ్డి, ఏర్పుల లింగం, నీలం మోహన్, సత్యనారాయణ గౌడ్, ఈద్గాని మల్లేష్, యాదయ్య, యాదగిరి, మల్లేష్, దుబ్బాక మహేష్, శ్రీనివాస్ యాదవ్, మహేష్ యాదవ్, వెంకట్ రెడ్డి, భాస్కర్, పోచయ్య, వెంకటేష్, ప్రసాద్, సురేష్, నాని, మేదరి విట్ఠల్, డప్పు రాజు మరియు సిజిఆర్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# వార్డు విభజనను సరిచేయండి



**- రాళ్లకత్వ గ్రామ వార్డు విభజనపై కమిషనర్‌కు వినతిపత్రం అందజేత**

**- సానుకూలంగా స్పందించిన జిన్నారం మున్సిపల్ కమిషనర్ తిరుపతి**

**జిన్నారం, అక్టోబర్ 21(సమయం న్యూస్):** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గంలోని జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని రాళ్లకత్వ గ్రామ ప్రజలు వార్డు విభజనపై తమ ఆందోళనను వ్యక్తం చేశారు. తాజాగా విడుదలైన వార్డు పునర్విభజన డ్రాఫ్ట్‌లో తప్పులు, అన్యాయాలు జరిగాయని ఆరోపిస్తూ స్థానిక నాయకులు, గ్రామస్తులు కలిసి మున్సిపల్ కమిషనర్ తిరుపతికి మంగళవారం లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేశారు. వార్డుల సరిహద్దులు సరిగ్గా నిర్ణయించకపోవడంతో పాత కాలనీలు, గ్రామాలు విభిన్న వార్డులుగా విభజించబడినట్లు వారు తెలిపారు. ఈ పరిస్థితి ప్రజలకు సౌకర్యాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల సూచనలు తీసుకుని పునర్విభజనలో తగిన మార్పులు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తిరుపతి గ్రామస్తుల అభ్యర్థనను సానుకూలంగా స్వీకరించి, వార్డు విభజనపై సమీక్ష జరిపి తగిన సవరణలు చేసి పై అధికారులకు పంపిస్తానని హామీ ఇచ్చారు. కమిషనర్ స్పందనపై రాళ్లకత్వ గ్రామ ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, గ్రామస్థులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరవీరులకు సైబరాబాద్ పోలీసులు సన్మానం.





**శేరిలింగంపల్లి అక్టోబర్ 21సమయం న్యూస్:** పోలీసు సంస్మరణ దినోత్సవం మంగళవారం సైబరాబాద్ పోలీస్ కమీషనర్ అవినాష్ మొహంతి, ఐపీస్, మాదాపూర్ సైబరాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో అమరవీరుల స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛంతో పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. ఉత్సవ గౌరవాన్ని అనుసరించి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, మరణించిన అమర వీరుల జ్ఞాపకార్థం రెండు నిమిషాలు మౌనం పాటించారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన 191 మంది పోలీసుల పేర్లను సి ఏ ఆర్. హెడ్ క్వార్టర్ డీసీపీ సంజీవ్ ప్రకటించారు. పోలీసు సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సైబరాబాద్ పోలీసులు విద్యార్థులకు ఆన్‌లైన్‌లో బహిరంగ సభలు, పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు, రక్తదాన శిబిరంతో సహా పలు కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ సంవత్సరం వ్యాసరచన పోటీలు పని ప్రదేశంలో లింగ వివక్ష పీసీ నుండి ఏ ఎస్ ఐ. అర్పీ వరకు గ్రౌండ్ లెవల్ పోలీసింగ్‌ను బలోపేతం చేయడం ఎస్ ఐ నుండి ఉన్నత అధికారులు విజేతలకు బహుమతులు వంటి అంశాలపై దృష్టి సారిస్తుందన్నారు. అదనంగా, విద్యార్థులు "డ్రగ్స్ మెనెన్స్: ప్రివెన్షన్‌లో పోలీసుల పాత్ర విద్యార్థులు డ్రగ్స్‌కు ఎలా దూరంగా ఉండగలరనే అంశంపై పోటీ పడి టాప్ ఎంట్రీలకు మెమెంటోలు. బహుమతులు అందచేశారు. గతంలో తమ ప్రాణాలను త్యాగం చేసిన వారిని గుర్తించేందుకు రోల్ కాల్ ఆఫ్ హానర్ నిర్వహించారు. ఎస్ఐ కె. హనుమంత్‌రెడ్డి ఆమన్‌గల్, కానిస్టేబుల్ ఫహీముద్దీన్ తలకొండపల్లి, ఆర్మ్డ్ కానిస్టేబుల్ ఈశ్వర్‌రావు కుటుంబాలను పోలీసు కమిషనర్ శాలువాలతో సత్కరించి, వారి సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, ఐపీఎస్., బాలానగర్ డీసీపీ కె. సురేష్ కుమార్, ఐపీఎస్, మాదాపూర్ డీసీపీ రితిరాజ్, ఐపీఎస్., రాజేంద్రనగర్ డీసీపీ యోగేశ్ గౌతమ్, ఐపీఎస్., శంషాబాద్ డీసీపీ బి. రాజేష్, డీసీపీ ఎస్బీ బి. సాయిశ్రీ, డీసీపీ క్రైమ్స్ ఎముత్యంరెడ్డి, మహిళా శిశు భద్రత డీసీపీ సృజన కర్ణం, మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ సాయి మనోహర్, మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్, మాదాపూర్ ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్, కార్ హెచ్‌క్యూటీఆర్ డీసీపీ సంజీవ్, ఏడీసీఎస్పీ, ఏసీఎస్పీ, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సమృద్ధిగా ఇసుక

**● జిల్లా కలెక్టర్**



**ఖమ్మం, అక్టోబర్ 21:( సమయం న్యూస్ ) :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా సమృద్ధిగా అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక లభ్యతపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ప్రతి సోమవారం లబ్ధిదారులకు నిర్మాణ పురోగతి ఆధారంగా బిల్లులు చెల్లించడం జరుగుతుందని అన్నారు. చింతకాని, బోనకల్ మండలాల్లో ఇసుక సమస్య కారణంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఆలస్యం అవుతుందని, ఈ సమస్య పరిష్కారం కోసం ముదిగొండ మండలం నుంచి ఇసుక స్టాక్ తెప్పించి చింతకాని, బోనకల్ మండలాల్లో ఇసుక డంప్ ఏర్పాటు చేసి ఇంటి నిర్మాణానికి ఎక్కడ ఎటువంటి సమస్య రాకుండా చూడాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరిట ఇసుక దోపిడీ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇసుక సరఫరాలో మండల స్థాయిలో ఉన్న సమస్యలను తహసిల్దార్లు ప్రత్యేకంగా పర్యవేక్షించి పరిష్కరించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో పడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇంటి నిర్మాణ పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో అప్ లోడ్ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో తహసిల్దార్ లు, హౌసింగ్ ఏఈ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలు అమ్మిన కొనుగోలు చేసిన కఠిన చర్యలు

**- జిన్నారం సర్కిల్ ఇన్స్పెక్టర్ నయీముద్దీన్**





**పటాన్ చెరు, గుమ్మడిదల, అక్టోబర్ 21(సమయం న్యూస్) :** మాదక ద్రవ్యాలు అమ్మిన కొనుగోలు చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని జిన్నారం సర్కిల్ ఇన్స్పెక్టర్ నయీముద్దీన్ తెలిపారు. మంగళవారం గుమ్మడిదల పోలిస్ స్టేషన్ పరిధిలోని దోమడుగు గ్రామంలో పితాని కృష్ణ (30) స్వంత ఇంటి వద్ద గంజాయి మొక్కలు ఉన్నాయని విశ్వసనీయ సమాచారం మేరకు గుమ్మడిదల ఎస్ ఐ లక్ష్మీకాంత్ రెడ్డి తన సిబ్బందితో పితాని కృష్ణ ఇంటి వద్ద తనిఖీలు నిర్వహించగా ఒక గంజాయి మొక్క పెంచుతున్నట్లు కనిపించింది. అట్టి మొక్కలు అంచుల సమక్షంలో సీజ్ చేసి మాదకద్రవ్యాలను చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు . ఈ సందర్భంగా సిఐ నయీముద్దీన్ మాట్లాడుతూ మండల ప్రజలు ఎవరైనా నిషేధిత మార్ధక ద్రవ్యాలను వాడిన అమ్మిన అమ్మకానికి సహాయపడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఆయన తెలిపారు.

# సొంత నిధులతో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తా

**- నన్నపునేని నరేందర్ గారు**



**వరంగల్ అక్టోబర్ 21. (సమయం న్యూస్) :** ఈరోజు 40వ డివిజన్లోని ఉర్సుగుట్ట వద్ద జ్యోతిరావు పూలే విగ్రహని కూల్చివేసిన సంఘటనను నిరసిస్తూ స్థానిక బీసీ నాయకులతో కలిసి విగ్రహ స్థలాన్ని పరిశీలించిన గ్రేటర్ వరంగల్ తొలి మేయర్ మరియు వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు శ్రీ నన్నపునేని నరేందర్ గారు అనంతరం నన్నపునేని నరేందర్ గారు మాట్లాడుతూ

ఒకవైపు బిసిల యొక్క ఉద్యమం కొనసాగుతుంటే మరొకవైపు దుండగులు జ్యోతిరావు పూలే గారి విగ్రహాన్ని ధ్వంసం చేయడం జరిగింది. కారణాలు తాగినట్లు చేసినట్లు లేకుంటే మత్తులో ఉండి చేసినట్లు లేకుంటే ఇంకో ఇతరత్ర రీతిలో చేసినట్లు లేకుంటే ఇతర కారణాలు చూపించుకుంటూ మొత్తానికి బిసిలను అణగదొక్కే ప్రక్రియ బిసిలు ఆణవాలు లేకుండా చేసే ప్రక్రియను ఈరోజు కొనసాగిస్తున్నారు కాబట్టి ఎంతటి వారు అయినా గాని పోలీసులు చర్య తీసుకోవాలని మనం డిమాండ్ చేస్తూ అదేవిధంగా ఇక్కడ జ్యోతిరావు పూలే విగ్రహం 2017 లో భరత్ అండ్ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసినారు. వారికి ఈరోజు హామీ ఇస్తునాను జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటు కావాల్సిన ఖర్చు మొత్తం నా సొంత నిధులతో ఇస్తానని ఈ కమిటీ వారికి తెలియజేస్తూ ఈరోజు బీసీ నినాదంతోటి రిజర్వేషన్ల అంశంతో ఉద్యమ కార్యచరణను చేపడుతున్న మనకు ఇలా విగ్రహాలను కూల్చడం ఒక దుర్మార్గమైన చర్య ఒక పిరికిపంద చర్యగా భావిస్తూ ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని పోలీస్ శాఖకు తెలియజేస్తున్నాము ఈ కార్యక్రమంలో 32,33,39, 40మరియు 41 డివిజన్ల అధ్యక్షులు మరియు ఇన్చార్జీలు మరియు బిసి సంఘం ముఖ్య నాయకులు మరియు బి ఆర్ ఎస్ పార్టీ యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

22-10-25 Samayam_Layout 1 10/22/2025 5:31 AM Page 9



# సమీకృత వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతుల ఆర్థికాభివృద్ధి సాధ్యం

● జిల్లా కలెక్టర్

**కొత్తగూడెం, అక్టోబర్ 21 : ( సమయం న్యూస్ ):** సమీకృత వ్యవసాయం ద్వారా రైతుల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు . మంగళవారం ఆయన ములకలపల్లి మండలంలోని పలు గ్రామాలను విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా రాజుపేట గ్రామంలో చింతకాయల నాగేశ్వరరావు, కుమారి దంపతులు నిర్వహిస్తున్న కౌజు పిట్టల యూనిట్‌ను కలెక్టర్ పరిశీలించారు. మండల సమైక్య సహాయంతో రుణం పొందిన రైతు, కౌజు పిట్టలతో పాటు నాటు కోళ్లు మరియు మేకల పెంపకం చేపడుతున్నట్టు కలెక్టర్‌కు వివరించారు. రైతు తెలిపిన ప్రకారం, 300 కౌజు పిట్టల పెంపకం చేపట్టామని ఇప్పుడు పంట చేతికి వచ్చిందని దీని ద్వారా నెలకు సుమారు 15,000 ఆదాయం పొందుతామని , రానున్న సంవత్సరంలో జిల్లాలో 500 చేపల పెంపక యూనిట్లు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, చేపల పెంపకంతోపాటు అదే ప్రాంగణంలో కౌజు పిట్టలు, నాటు కోళ్ళు, మేకల పెంపకం వంటి సమీకృత వ్యవసాయ విధానాలను అమలు చేయడం ద్వారా చేపల పంట చేతికి వచ్చేంతవరకు రైతులు నెలవారీ ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. ఈ ఆదాయాన్ని రైతులు చేపల పెంపకానికి తీసుకున్న రుణాలకు ఈఎంఐగా చెల్లించడం ద్వారా ఆర్థికభారం తగ్గుతుందని పేర్కొన్నారు. అలాగే, రైతు పామాయిల్ సాగులో అంతర్పంటగా మునగ సాగు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పూసగూడెం గ్రామంలోని డంపింగ్ షెడ్లో గ్రామపంచాయతీ వర్కర్లు తయారు చేస్తున్న బయోచార్ (జీవ బొగ్గు) తయారీ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఎండిన చెట్ల కొమ్మలు, తుమ్మ వంటి పదార్థాలను చిన్న



ముక్కలుగా చేసి మంట ద్వారా బయోచార్ తయారుచేసే విధానాన్ని సమీక్షించారు. ఈ విధంగా తయారైన బయోచార్‌ను గోమూత్రం మరియు గోవుపేడలో కొన్ని రోజులు నానబెట్టి ఆరబెట్టి పొడిచేసి పంటలకు సేంద్రియ ఎరువుగా వాడితే భూసారం మెరుగుపడి అధిక దిగుబడులు సాధ్యమవుతాయని తెలిపారు. గ్రామపంచాయతీలు చెత్త సేకరణ సమయంలో తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని ఆయన ఆదేశించారు. డంపింగ్ యార్డుల్లో తయారైన కూరగాయ వ్యర్థాల కంపోస్ట్ ఎరువును కూడా పరిశీలించారు. అనంతరం కలెక్టర్ పాతగంగారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషణవాటికను సందర్శించారు. అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలతో ముచ్చటించి, వారికి అందిస్తున్న ఆహారం గురించి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో పోషణవాటిక ఏర్పాటు చేసి, పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు సేంద్రియ పద్ధతిలో పండించిన ఆకుకూరలు, కూరగాయలు ఉచితంగా అందిస్తున్నారని సిబ్బంది వివరించారు. కేంద్రంలో పెంచిన ఆరు రకాల ఆకుకూరలను పరిశీలించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని ఆకుకూరలు ఒకేసారి కాకుండా వారానికోసారి మారుస్తూ అందుబాటులో ఉంచాలని సూచించారు. మునగ, వెలగా, చింత, ఉసిరి, కరివేపాకు వంటి మొక్కలను కూడా పెంచాలని సూచించారు. గర్భిణిల్ల కోసం ప్రత్యేకంగా పోషకవాటికలను అభివృద్ధి చేయడం ద్వారా వారికి సమృద్ధమైన పోషకాహారం అందించవచ్చని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ విద్యా చందన, తాసిల్దార్ గన్యా నాయక్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల సంరక్షణలో పోలీసుల పాత్ర కీలకం

● జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెటి

**ఖమ్మం, అక్టోబర్ 21:( సమయం న్యూస్ ):** శాంతి భద్రతల సంరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా మంగళవారం పోలీసు పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్, డిఎఫ్ఓ సిద్దార్థ్ విక్రమ్ సింగ్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతి భద్రతలు కాపాడేందుకు ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహించిన పోలీసు అమరవీరులకు ప్రతి ఒక్కరూ నివాళులు అర్పించాలని అన్నారు. ప్రభుత్వంలో ప్రతి శాఖ పని తీరులో పోలీస్ సహకారం సంపూర్ణంగా ఉంటుందని అన్నారు. భూ సేకరణ, ధాన్యం కొనుగోలు, ఎన్నికల నిర్వహణ, శాంతియుతంగా వేడుకలు జరగాలన్నా కూడా ప్రతి ఒక్క అంశంలో పోలీస్ సహకారం అవసరమని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఖమ్మం జిల్లా యంత్రాంగానికి పోలీసులు సంపూర్ణ సహకారం అందిస్తున్నారని అన్నారు. దీపావళి, హెూళి, వినాయక నిమజ్జనం వంటి అనేక పండుగలు ప్రశాంతంగా జరుపుకోవడంలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రతి పౌరులు పోలీసుల గొప్పతనం తెలుసుకోవాలని, కృతజ్ఞతగా ఉండాలని, కానిస్టేబుల్ నుంచి డీజీపి వరకు నేర నియంత్రణ కోసం పాటు పడుతారని అన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చిన వెంటనే 100 కు ఫోన్ చేస్తారని, అన్ని విపత్కర సమయాలలో మొదటగా స్పందించేది పోలీసులు మాత్రమే నని, 24 గంటల పాటు డ్యూటీలో ఉంటారని అన్నారు. పోలీసులు ప్రతిరోజు కుటుంబ సమయాన్ని త్యాగం చేస్తూ మన కోసం విధులు నిర్వహిస్తున్నారని, అటువంటి వారిపట్ల మనం నిరంతరం గౌరవ భావంతో ఉండాలని అన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు శాంతి చేకూరాలని కలెక్టర్ ఆకాంక్షించారు. పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ 21 అక్టోబర్ 1959 లద్దాక్ ప్రాంతంలో దేశ సరిహద్దు కాపాడటంలో 10 మంది సిఆర్పిఎఫ్ సిబ్బంది చైనా సైనికులతో వీరోచితంగా పోరాడి మరణించారని, విధులలో ఉండి మరణించిన పోలీసుల



త్యాగాలకు చిహ్నంగా మనం నేడు పోలీసు అమరవీరుల సంస్కరణ దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. గత సంవత్సర కాలంగా భారత దేశ వ్యాప్తంగా శాంతిభద్రతలు కాపాడేందుకు 191 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ప్రతి పోలీసు వ్యక్తికి దేశం మొదటి ప్రాధాన్యతగా ఉండాలని అన్నారు. డిఎఫ్ఓ సిద్దార్థ్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ పోలీస్ యూనిఫామ్ చాలా పెద్ద బాధ్యత అని, ప్రతి రోజు క్రిమినల్స్ తో పోరాటం, చాలా కష్టాలతో విధులు నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. సమాజంలో శాంతి భద్రతలు పకడ్బందీగా ఉండాలంటే పోలీసులు సరిగ్గా పని చేయాలని అన్నారు. పోలీసులు సరిగ్గా పనిచేస్తున్నారు అంటే దానికి వారి కుటుంబాలు కూడా చాలా సహకరిస్తున్నాయని తెలిపారు. అనంతరం విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు స్మారక స్థూపం వద్ద జిల్లా కలెక్టర్, పోలీసు కమీషనర్, అటవీశాఖ అధికారి పుష్పగుచ్చాలు ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్ పేరడ్ మైదానంలోని అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పరేడ్ నిర్వహించగా, పోలీస్ అమర వీరుల స్థూపం వద్ద జిల్లా అధికార యంత్రాంగం, పోలీస్ అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబీకులు పూలమాలలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. తొలుత, అమర వీరుల స్మృత్యర్థం సాయుధ బలగాలు పెరేడ్, గార్డ్ ఆఫ్ హానర్ నిర్వహించారు. అనంతరం పోలీసు ఆయుధాలు కిందకు దింపి వందనం చేసి రెండు నిముషాల పాటు మౌనం పాటించారు. దనపు డిసిపి లు ప్రసాద రావు, రామానుజం, పోలీసు అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# తెలంగాణ రైసింగ్ విజన్ 2047 సర్వే నందు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి.

..జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

అక్టోబర్ 25 లోపు ప్రజలు తమ అభిప్రాయాలు తెలియజేయాలి

తెలంగాణ రైసింగ్ 2047 సర్వే పై పత్రిక ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర

**పెద్దపల్లి, అక్టోబర్-21( సమయం న్యూస్,):** తెలంగాణ రైసింగ్ విజన్ 2047 సర్వే నందు ప్రతి ఒక పౌరుడు పాల్గోన్ని తమ అభిప్రాయాన్ని తెలియజేయాలి.. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.

దేశానికి స్వాతంత్రం లభించి 100 సంవత్సరాలు పూర్తయ్యే సమయానికి తెలంగాణ రాష్ట్రాన్ని మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం తెలంగాణ రైసింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ తయారు చేస్తుందని కలెక్టర్ తెలిపారు.

2047 నాటికి మన తెలంగాణ రాష్ట్రాన్ని ఏ విధంగా చూడాలనుకుంటున్నారో ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలను తెలంగాణ రైసింగ్ 2047 సర్వే నందు తెలియజేయాలని అన్నారు. ఈ సర్వేలో ఇప్పటివరకు తెలంగాణ ప్రాంతం నుంచి మూడు లక్షల మంది పాల్గొని తమ అభిప్రాయాలు తెలిపారని, అక్టోబర్ 25 తో సర్వే గడువు ముగుస్తుందని కలెక్టర్ తెలిపారు. అక్టోబర్ 25 లోపు జిల్లాలోని అన్ని వర్గాలకు చెందిన మేధావులు, సామాన్య ప్రజలు, రైతులు, కార్మికులు విద్యార్థులు, యువత ప్రతి ఒక్కరు తెలంగాణ రైసింగ్ 2047 రీసెంట్ డాక్యుమెంట్ సంబంధించి తమ అభిప్రాయాలను https://www.telangana.gov.in/telanganarising/ లింక్ నందు సర్వేలో పాల్గొని తెలియజేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# హరే రామ,హరే కృష్ణ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్పాహారం





**కొడంగల్ మున్సిపాలిటీ(మం)(సమయం న్యూస్) :** హరే రామ, హరే కృష్ణ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న అల్పాహారం లోభాగంగా వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణ కేంద్రంలో మంగళవారం విద్యార్థులకు సెట్ దోశ అందించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు అందించినట్లు ఎంఈవో రామ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సంస్థకు ధన్యవాదములు తెలియజేశారు. అదే విధముగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో %ఎఖవీజఖీ% నిర్వాహకులు చైతన్య కృష్ణ, జీ. రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# "తెలంగాణ రైజింగ్ - 2047 " సిటిజన్ సర్వే లో పాల్గొన్న 3 లక్షల మంది

● ఈనెల 25 తో ముగియనున్న సర్వే

● ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని సమాచార శాఖ కమిషనర్ ప్రియాంక సూచన

*తెలంగాణ రైజింగ్ విజన్ 2047 సిటిజన్ సర్వేలోపాలుపంచుకోండి :
https://www.telangana.gov.in/telanganarising/

TELANGANA RISING 2047
Take Citizen Survey Now

**హైదరాబాద్, అక్టోబర్ 21 ,( సమయ్దం న్యూస్,).:** తెలంగాణా రాష్ట్ర భవిష్యత్ రూపకల్పనకై ఉద్దేశించిన "తెలంగాణ రైజింగ్ - 2047 " సిటిజన్ సర్వే కు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటివరకు ఈ సిటిజన్ సర్వే లో కేవలం తెలంగాణ నుండే వివిధ ప్రాంతాల నుండి దాదాపు మూడు లక్షలకు పైగా పౌరులు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందచేశారు. భారత దేశ స్వాతంత్ర్యానికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుండి తగు సలహాలు, సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్ - 2047 " సిటిజన్ సర్వేను చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈ సర్వే ఈనెల 25 వతేదీ తో ముగుస్తుంది. ఈ సర్వే రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికీ అందుబాటులో ఉన్నందున %ఃషఃష.వశ్రీఖఅస్త్రఖఅఖ.స్త్రశీజ.ఱఅ/వశ్రీఖఅస్త్రఖఅఖతీఱఅఱఅస్త్ర% అనే వెబ్సైట్ లో సందర్శించి ప్రతీ ఒక్కరు తమ సలహాలు సూచనలను అందించాల్సింగా ఒక అధికార ప్రకటనలో తెలియ చేశారు

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగ్గైన వైద్య సేవలు

● జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీం నగర్ అక్టోబర్21( సమయం న్యూస్).:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మంగళవారం మానకొండూరు మండలంలోని వెల్ది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ల్యాబ్, మెడిసిన్ స్టోర్స్, వ్యాక్సిన్లు నిల్వ చేసే గది, లేబర్ రూమ్, వార్డులు పరిశీలించారు. ఆసుపత్రిలోని పలు రిజిస్టర్లను పరిశీలించారు. ఆసుపత్రికి వస్తున్న రోగుల సంఖ్య, అందిస్తున్న వైద్య సేవల గురించి పీహెచ్ సీ వైద్యాధికారి సాయి ప్రసాద్ ను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య మహిళ వైద్య పరీక్షల వివరాలు అడిగారు. నూరు శాతం మందికి వైద్య పరీక్షలు పూర్తిచేయాలని అన్నారు. స్క్రీనింగ్ పూర్తయి ఆరు నెలలు గడిచిన మహిళలకు మరో దఫా వైద్య పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు చేయించుకునేలా గర్భిణీలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించి ప్రతినెలా ఉచిత మందులు అందజేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని మందులు ఉంటాయని విషయాన్ని వారికి తెలియజేయాలని అన్నారు. ఆవరణలో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు లేకుండా ఆస్పత్రి పరిసరాలను శుభ్రం చేయించాలని ఆదేశించారు. వారి వెంట డీఎంహెచ్ఓ వెంకటరమణ, ప్రోగ్రామ్ ఆఫీసర్ సనా, వైద్యులు సాయి ప్రసాద్, వెంకటేష్,తహసీల్దార్ విజయ్ తదితరులు ఉన్నారు.

# దున్నరాజుకు 'రాయల్ సెల్యూట్'

## రూ. 31 వేల విలువైన విస్కీ తాగించిన యువకుడు..

**శేరిలింగంపల్లి అక్టోబర్ 21 సమయం న్యూస్ . కే.బి రాజు.**

ప్రతి సంవత్సరం దీపావళి పండుగ ముగిసిన తర్వాత హైదరాబాద్‌లో సదర్ ఉత్సవాలు అత్యంత ఘనంగా ప్రతిష్టాత్మకంగా జరుగుతాయి. ఈ వేడుకలను సదర్ సమ్మేళనాలు, దున్నపోతుల పండుగ అని కూడా అంటారు,

యాదవులు తమ సాంస్కృతిక ప్రతీకగా జరుపుకునే ఈ ఉత్సవాలకు దాదాపు 70 ఏళ్ల చరిత్ర ఉంది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం సదర్ పండుగకు 'రాష్ట్ర పండుగ' హోదాను కల్పించడం ఈ ఉత్సవాల ప్రాధాన్యతను మరింత పెంచింది.నగరంలో స్థిరపడిన యాదవ సోదరులు కుటుంబసమేతంగా ఈ ఉత్సవాల్లో పాల్గొని తమ ఐకమత్యాన్ని చాటుకుంటారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు నగర శివారులో దాదాపు 40 ప్రాంతాల్లో ఈ సదర్ సమ్మేళనాలు జోరుగా కనిపిస్తాయి. పంజాగుట్ట, ఎల్లారెడ్డి గూడ, ఖైరతాబాద్, కొత్తపేట, బోయిన్‌పల్లి, సైదాబాద్‌తో పాటు ముషీరాబాద్‌లోని 'పెద్ద సదర్' మస్త్ ఫేమస్. ఈ వేడుకల్లో లక్షలాది మంది ప్రజలు పాల్గొని, దున్నపోతుల విన్యాసాలను తిలకించడం ఇక్కడి ఆనవాయితీ.ఈసారి సిటీలోని ముషీరాబాద్‌లో జరిగిన సదర్ వేడుకలు అందరినీ ఎంతగానో ఆకర్షించాయి. ఈ వేడుకల్లో 'వస్తాద్ గుమాన్ కాళీ' అనే దున్నరాజు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 2500 కేజీల బరువు, 7 అడుగుల వెడల్పు ఉన్న ఈ భారీ దున్నపోతును మధు యాదవ్ అనే వ్యక్తి కేరళ నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చారు. సదర్ ఉత్సవాల్లో దున్నపోతులను అందంగా అలంకరించి ప్రదర్శించడం, యువకులు వాటితో కుస్తీ పడుతూ విన్యాసాలు చేయించడం సదర్‌కు స్పెషల్ అట్రాక్షన్. హర్యానా, పంజాబ్ నుంచి కోట్ల రూపాయల విలువ చేసే దున్నపోతులను కూడా ఈ వేడుకలకు తీసుకురావడం విశేషం.ముషీరాబాద్ వేడుకల్లో వస్తాద్ గుమాన్ కాళీని ప్రదర్శించిన మధు యాదవ్.. దానికి రూ. 31 వేల విలువజేసే రాయల్ సెల్యూట్ 21 ఇయర్స్ ఫుల్ బాటిల్ విస్కీని తాగించారు. ఈ దృశ్యాలు, ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో వస్తాద్ గుమాన్ కాళీ ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించింది.యాదవుల సంస్కృతికి, పశు సంపద పట్ల వారి గౌరవానికి సదర్ ఉత్సవాలు ప్రతీక. వేల సంవత్సరాల క్రితం సింధు నాగరికత కాలం నుంచే ఈ ఉత్సవాలు జరుపుకుంటున్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా యాదవులు పశువులను, ఆవులను పూజించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పాలు సమృద్ధిగా లభించాలని ప్రార్థిస్తారు. దీపావళిని ఎంత ఘనంగా జరుపుకుంటారో.. సదర్ ఉత్సవాలను కూడా అంతే ప్రతిష్టాత్మకంగా, ఉల్లాసంగా యాదవ సోదరులు నిర్వహిస్తారు. ఈ సంబురాలు హైదరాబాద్ సంస్కృతిలో ఒక భాగమై, నగరానికి ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి.





# పశు వైద్యశాలలో ఉత్తమ సేవలు అందాలి

● జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**రేగోడు అక్టోబర్21( సమయం న్యూస్):** రేగోడు మండలం పశువైద్యాలయాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అందుతున్న సేవలు గురించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆస్పత్రిలోని రికార్డులను తనిఖీ చేశారు. పశువులకు అందిస్తున్న టీకాలు, నులిపురుగుల నిర్మూలన తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యాలయంలో అందించే సేవలపై ఎప్పటికప్పుడు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పాలకుర్తి మండలంలో కలెక్టర్ పర్యటన

● త్వరగా ప్రారంభానికి సిద్ధం చేయండి

● పెండింగ్ లేకుండా చూడండి .. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



మండల భక్తుల సౌకర్యాలకు అనుగుణంగా సోమేశ్వర కళ్యాణ మండపం పనులు ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారుమంగళవారం పాలకుర్తి మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని, సోమేశ్వర కళ్యాణమంటపాన్ని ( ఫంక్షన్ హాల్ ) కలెక్టర్ సందర్శించి.. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు ముందుగా తాసిల్దార్ కార్యాలయానికి వెళ్లి.....పలు రిజిస్టర్ లను కలెక్టర్ పరిశీలించారురెవిన్యూ పరంగా ఎలాంటి పెండింగ్ ఉండద్దని సూచించారుఅనంతరం మండల సమైక్యకు సంబంధించిన సోమేశ్వర కళ్యాణమంటపానికి వెళ్లి... అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను చూసారు

నవంబర్ మొదటి వారంలో కళ్యాణమండపం ( ఫంక్షన్ హాల్) ప్రారంభం చేసుకునే విధంగా అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి కావాలన్నారుఫంక్షన్ హాల్ ఏర్పాటు కి కావలిసినచైర్స్, డెకరేషన్ ఐటమ్స్, సివిల్ వర్క్స్, ఫాల్ సీలింగ్ వర్క్స్, పెయింటింగ్, నేమ్ బోర్డు తదితర పనులు త్వరగా పూర్తి కావాలన్నారుఈ కార్యక్రమం లో మండల తహసీల్దార్, డి ఆర్డీ ఓ, డి పి ఓ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ సర్కారుపై ప్రజలకే కాదు కాంగ్రెస్ పెద్దలకు నమ్మకం లేకుండా పోయింది.

వై.సతీష్ రెడ్డి, రెడ్కో మాజీ చైర్మన్

. అందుకే ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారు

. రేవంత్ దోపిడీకి బీజేపీ అండదండలు.

**హైదరాబాద్ అక్టోబర్321( సమయం న్యూస్):** : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పని అయి-ుపోయిందనేది స్వయంగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేనే ఒప్పుకున్నారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. ప్రజలను, చివరకు వాళ్ల పార్టీ అగ్ర నాయకులను కూడా మభ్యపెట్టే ప్రయత్నాల్లో రేవంత్ రెడ్డి బిజీగా ఉన్నారు. తెలంగాణ ప్రజలను మోసం చేసినట్టే.. పార్టీ అగ్ర నాయకులను మోసం చేద్దామని చూశారు. కానీ అట్టర్ ఫ్లాప్ అయ్యారు. అందుకే.. తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశం లేకుండా పోయిందని పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే కు కూడా అర్థమైపోయింది.

అందుకే రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వదిలేసింది. ఇక జీవితంలో మళ్లీ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశాలు ఏ కోశానా కనిపించడం లేదని ఢిల్లీకి కూడా తెలిసిపోయింది. అందుకే ఇక్కడ మీనాక్షి నటరాజన్ తో రేవంత్ రెడ్డికి సమాంతరంగా మరో ప్రభుత్వాన్ని నడిపిస్తున్నట్టుగా అర్థమవుతోంది. గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి.. ఈ వర్గం.. ఆ వర్గం అని లేకుండా..అన్ని వర్గాలను మోసం చేసింది కాంగ్రెస్ పార్టీ. రేవంత్ రెడ్డి చేస్తున్న మోసాలు.. మాట్లాడుతున్న చిల్లర మాటలతో ప్రజలు పూర్తిగా విసిగిపోయారు. రేవంత్ రెడ్డి పేరు వినబడితేనే ఛీ.. అనే పరిస్థితి వచ్చింది. రెండేళ్లలోనే ప్రజల నుండి ఇంత వ్యతిరేకత రావడంతో ఇక్కడ తమ పార్టీ పని అయిపోయిందని స్వయంగా ఖర్గేకే అవగతమైంది. ఇప్పుడు మిగతామూడేళ్లు కూడా ప్రభుత్వం ఉంటుందో ఊడిపోతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది.

# ధాన్యం సేకరణలో జాప్యానికి తావులేకుండా పకడ్బందీ చర్యలు

● కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి

● కేంద్రాల వద్ద అధికారులు

● అందుబాటులో ఉంటూ పర్యవేక్షణ జరపాలని ఆదేశం

● పెగడాపల్లి, సాలంపాడ్ లలో ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



**నిజామాబాద్, అక్టోబర్ 21( సమయం న్యూస్).** : కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యం సేకరణ వేగవంతంగా జరిగేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు గాను సంబంధిత అధికారులు కేంద్రాల వద్ద క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ ధాన్యం సేకరణను నిశితంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. బోధన్ మండలం పెగడాపల్లి, సాలురా మండలం సాలంపాడ్ క్యాంప్ లలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ మంగళవారం సందర్శించారు. రైతులు తరలించిన ధాన్యం నిల్వలను పరిశీలించారు. రైతుల నుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వలు, మిల్లులకు తరలించిన ధాన్యం గురించి నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. కౌలు రైతులకు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లలో ఒకింత జాప్యం జరుగుతోందని రైతులు కలెక్టర్ దృష్టికి తేగా, కేంద్రం నిర్వాహకులకు కలెక్టర్ స్పష్టమైన సూచనలు చేశారు. పంట సాగు చేసిన ప్రతి రైతు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని, క్రాప్ బుకింగ్ డేటాలో కౌలు రైతుల పేర్లు లేని పక్షంలో వారు వరి పంట సాగు చేశారా లేదా అన్నది వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ధృవీకరణ పత్రం అందించాలని, రైతుల వివరాలలో ఏమైనా పొరపాట్లు ఉంటే వాటిని కూడా సరిచేయాలని ఆదేశించారు. వరుస క్రమంలో రైతుల వివరాలు నమోదు చేసుకుని, ఎఫ్.ఏ.క్యూ ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యాన్ని వెంటవెంటనే తూకం వేయించాలన్నారు. మిల్లుల వద్ద ధాన్యం వేగంగా దిగుమతి చేసుకుని, సత్వరమే ట్రక్ షీట్లు అందించేలా చూడాలని తహసీల్దార్ ను ఆదేశించారు. కాగా, రైతుల అవసరాలకు అనుగుణంగా ఎన్ని కొనుగోలు కేంద్రాలనైనా ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ రైతులకు తెలిపారు. గత సీజన్ లో 600 కేంద్రాలు ఉండగా, ఈసారి 670 కేంద్రాలు నెలకొల్పుతున్నామని, అవసరమైన చోట అదనంగా కూడా కేంద్రాలను అందుబాటులో ఉంచుతామని స్పష్టం చేశారు.ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు ఇబ్బందులు పడకూడదని, కేంద్రాలకు ధాన్యం తెచ్చిన వెంటనే నాణ్యాతా ప్రమాణాలను పరిశీలించి తూకం జరిపించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కేంద్రాన్ని సందర్శిస్తూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు.కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, డీఆర్డీఓ సాయాగౌడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందు, తహసీల్దార్ విఠల్, ఏ.ఓ సంతోష్, స్థానిక అధికారులు ఉన్నారు.

# పోలీసు అమరవీరుల ప్రాణ త్యాగాలు చిరస్మరణీయం

-వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**హన్మకొండ అక్టోబర్21( సమయం న్యూస్).:** శాంతి భద్రతల పరిరక్షణకై ప్రాణత్యాగాలు చేసిన పోలీస్ అమరవీరులు ప్రజల గుండెల్లో చిరస్మరణీయం నిలిచిపోతారని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములోఅమరవీరుల స్థూపం వద్ద పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని (ఫ్లాగ్ డే)ను ఘనంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఏడాది నుండి ఇప్పటి వరకు దేశంలో విధినిర్వహణలో మరణించిన 191మంది పోలీస్ అమరవీరుల పేర్లను అదనపు డీసీపీ రవి చదివి వినిపించారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న వరంగల్ పోలీస్ కమిషనర్ తో పాటు శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు,వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డా.సత్య శారద , స్నేహ శబరిష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయి, ఎన్.డి.పి సి.ఎల్ సి యం డి వరుణ్ రెడ్డి,ఎన్ సి సి గ్రూప్ కమాండర్ కర్నల్ సచిన్ అన్నారావు, కర్నల్ రవి,డిసిపి అంకిత్ కుమార్, అదనపు డిసిపిలు సురేష్ కుమార్, ప్రభాకర్ రావు శ్రీనివాస్, బాలస్వామి,రెడ్ క్రాస్ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు ఈ. వి శ్రీనివాస్ రావుతో పాటు ఏ.సి.పిలు, ఇన్స్ స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఎస్. ఐలు పోలీస్ . అమరవీరుల కుటుంబ సభ్యులు, ఇతర పోలీస్ సిబ్బంది పోలీస్ అమ-రవీరుల స్థూపం వద్ద పుష్పాగుచ్చాలు వుంచి నివాళులు అర్పించిన పిదప, ఆర్.ఐ స్పర్జన్ సారధ్యంలో సాయుధ పోలీసులు 'శోక్ శస్త్ర చేసి మరణించిన పోలీసు అమరవీరులకు పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజల సేవకోసం తమ ప్రాణాలను ఆర్పించిన పోలీసులు మహనుభావులని, పోలీసు అమరవీరుల చూపిన మార్గదర్శకాన్ని అనుసరిస్తూ, ప్రజల శ్రేయస్సు కోరకు పాటుపడాలని, ప్రజల్లో మంచి పేరు రావాలంటే చిత్తశుద్ధి, నీతి, నీజాయితీతో పనిచేయాల్సి వుంటుందని పోలీసు అమరవీరుల త్యాగాలను మరువలేమని, వారు ఎల్లప్పుడు మన గుండెల్లోనే వుంటారని, వారు మన మధ్య లేనకున్నా మనం వారిని స్మరిస్తునే వుంటామని, అసువులు బాసిన అమరవీరుల కుటుంబాలను కాపాడుకోవల్సిన భాధ్యత మనందరిపై వుందని, వారికి ఎలాంటి సమస్య వున్న వారికి పోలీస్ విభాగం తరుపున పూర్తి సహకారం అందజేయడం:జరుగుతుందని పోలీస్ కమిషనర్ తెలిపారు. అనంతరం పోలీస్ కమిషనరేట్ కార్యాలయము నుండి మిషన్ హస్పటల్ వరకు నిర్వహించిన ర్యాలీలో శాసన సభ్యులు, పోలీసులు, అధికారులు, సిబ్బంది పోలీసు అమరవీ-రుల కుటుంబ సభ్యులతో పాటు పోలీసు జాగృతి కళాబృందంసభ్యులు పాల్గొని పోలీసు అమరవీరులకు జోహర్లు అర్పించారు.



22-10-25 Samayam_Layout 1 10/22/2025 5:31 AM Page 11



# రోహిత్, కోహ్లీలతో నా రిలేషన్ మారలేదు



## నఖ్వీపై చర్యలు తీసుకోనున్న బీసీసీఐ!!

ఆసియా కప్ ముగిసి చాలా కాలమైంది. ఇంత వరకు ట్రోఫీ మాత్రం భారత్‌కు రాలేదు. తన చేతుల మీదుగా తీసుకోలేదని మొండికేసిన ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ భారత్‌కు ట్రోఫీ ఇచ్చేందుకు అంగీకరించలేదు. తనతోపాటే తీసుకెళ్లిపోయారు. దీంతో ఈ వివాదం ఇంకా ముగిసిపోలేదు. భారత్ పలు రకాలుగా ఆయన్ని సంప్రదిస్తుంటే షరతులతో ఇచ్చేందుకు అంగీకరించారు. తన చేతుల మీదుగా తీసుకుంటేనే ఇస్తానని చెబుతున్నారు. దీంతో భారత్ మరిన్ని చర్యలు సిద్ధమవుతోంది. ట్రోఫీ వివాదంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో, బీసీసీఐ తదుపరి ఐసీసీ సమావేశంలో ఈ విషయంలో అంతర్జాతీయ బోర్డు జోక్యం చేసుకోవాలని కోరవచ్చు. బీసీసీఐ గత వారంలో ఒక లేఖను పంపిందని సమాచారం, అందులో ట్రోఫీని భారత జట్టుకు ఇవ్వాలని కోరారు, అయితే నఖ్వీ నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. టీమ్ ఇండియాకు ట్రోఫీని ఇవ్వాలి లేదా త్వరలో జరగనున్న ఐసీసీ సమావేశంలో ఈ సమస్యను లేవనెత్తుతామని బీసీసీఐ స్పష్టం చేసింది. ఏషియా కప్ ట్రోఫీ ప్రస్తుతం దుబాయ్‌లో ఉంది, అక్కడ అది ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ కార్యాలయంలో ఏసీసీ ఉంచారు. ఒక మీడియా నివేదికలో, బీసీసీఐకార్యదర్శి దేవ్జిత్ సైకియా మాట్లాడుతూ, భారత బోర్డు చట్టపరంగా ఒక్కో అడుగు వేస్తోందని చెప్పారు. ఏషియా కప్ ఫైనల్‌లో భారత జట్టు పాకిస్తాన్‌పై 5 వికెట్ల తేడాతో విజయం సాధించిన తర్వాత మొహ్సిన్ చేతుల మీదుగా ట్రోఫీని తీసుకోడానికి నిరాకరించడంతో ఈ వివాదం ప్రారంభమైంది. కొంత సమయం తరువాత, మొహ్సిన్ నఖ్వీ ట్రోఫీని తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొన్ని వారాల క్రితం సెప్టెంబర్ 30న ఏసీసీ సమావేశం జరిగింది, ఆ సమావేశంలో రాజీవ్ శుక్లా భారతదేశానికి ప్రతినిధిగా ఉన్నారు, అతను ప్రస్తుతం బీసీసీఐ ఉపాధ్యక్షుడు కూడా. ఆ సమావేశంలో రాజీవ్ శుక్లా మాట్లాడుతూ ట్రోఫీ ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ ఆస్తి అని, కాబట్టి నఖ్వీ వ్యక్తిగతంగా ట్రోఫీని మైదానం నుంచి తీసుకెళ్లే హక్కు లేదని అన్నారు. బోర్డు సభ్యుల ముందు క్షమాపణ చెప్పిన తర్వాత కూడా, అతను టీమ్ ఇండియాకు ట్రోఫీని ఇవ్వడానికి నిరాకరించాడు. టీమ్ ఇండియా ట్రోఫీని తీసుకెళ్లాలనుకుంటే, వారు నేరుగా దుబాయ్‌లోని కార్యాలయానికి వచ్చి అతని చేతుల మీదుగా ట్రోఫీని తీసుకోవాలని ఆయన షరతులు పెడుతున్నారు. వీటికి టీమిండియా, బీసీసీఐ అంగీకరించడం లేదు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్ అమాయకులైన ప్రజలను పొట్టన పెట్టుకుంటుందని, జమ్ముకశ్మీర్‌లో జరిగిన దాడులు ఉదాహరణగా చూపిస్తూ ఆసియా కప్‌లో పాకిస్తాన్ క్రికెటర్లతో మాట, చేతులు కలపడానికి నిరాకరించింది. అంతేకాకుండా ఆ దేశానికి చెందిన నఖ్వీ చేతుల మీదుగా కూడా ట్రోఫీ అందుకోలేదు. దీన్ని మనసులో పెట్టుకొనే నఖ్వీ తనకు నచ్చినట్టు చేస్తున్నారు. ట్రోఫీని భారత్‌కు ఇవ్వకుండా అడ్డం పడుతున్నారు.

## 20 బంతుల్లోనే వృద్ధిమాన్ సాహా సెంచరీ



టీ20 క్రికెట్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ రికార్డు సాహిల్ చౌహాన్ అనే ఆటగాడి పేరిట ఉంది. సైప్రస్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో ఎస్టోనియా తరపున ఆడిన సాహిల్ కేవలం 27 బంతుల్లోనే సెంచరీ చేసి ప్రపంచ రికార్డు సృష్టించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇదే అత్యంత వేగవంతమైన సెంచరీ. అయితే, ఓ టీమిండియా మాజీ ఆటగాడు కేవలం 20 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసిన సంగతి చాలామంది తెలియదు. ఇది అంతర్జాతీయ క్రికెట్‌లో జరగలేదు. ఇది ప్రతిష్టాత్మక క్లబ్ మ్యాచ్‌లో జరిగింది. ఇంతటి విస్ఫోటక సెంచరీ సాధించిన బ్యాట్స్‌మెన్ మరెవరో కాదు వృద్ధిమాన్ సాహా. 2018లో క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ నిర్వహించిన %u%20 టోర్నమెంట్‌లో వృద్ధిమాన్ సాహా కేవలం 20 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. ఈ మ్యాచ్‌లో బెంగాల్ నాగ్‌పూర్ రైల్వేస్, మోహన్ బగన్ క్రికెట్ క్లబ్ జట్లు తలబడ్డాయి. మోహన్ బగన్ క్రికెట్ క్లబ్ తరపున ఓపెనర్‌గా బరిలోకి దిగిన వృద్ధిమాన్ సాహా అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శన కనబరిచాడు. అంతేకాదు ఒకే ఓవర్‌లో 6 సిక్సర్లు కొట్టి కేవలం 20 బంతుల్లోనే తన సెంచరీని పూర్తి చేసుకున్నాడు. తొలి బంతి నుంచే అద్భుతమైన బ్యాటింగ్ కనబరిచిన వృద్ధిమాన్ సాహా.. ఈ మ్యాచ్‌లో 14 సిక్సర్లు, 4 ఫోర్లు బాదాడు. దీని ద్వారా అతను 20 బంతుల్లో 102 పరుగులు సాధించాడు. వృద్ధిమాన్ సాహా చేసిన ఈ అద్భుతమైన సెంచరీ సహాయంతో, మోహన్ బగన్ క్రికెట్ క్లబ్ జట్టు బెంగాల్ నాగ్‌పూర్ రైల్వేస్ నిర్దేశించిన 152 పరుగుల లక్ష్యాన్ని కేవలం 7 ఓవర్లలోనే ఛేదించి 10 వికెట్ల తేడాతో భారీ విజయాన్ని సాధించింది. 7 సంవత్సరాల క్రితం వృద్ధిమాన్ సాహా చేసిన ఈ పేలుడు సెంచరీ దేశీయ గడ్డపై ఇప్పటివరకు సాధించిన వేగవంతమైన సెంచరీగా రికార్డుల్లోకి ఎక్కింది. సాహా కెరీర్ విషయానికొస్తే.. 2010లో టీమ్ ఇండియా తరఫున అరంగేట్రం చేసిన వృద్ధిమాన్ సాహా 40 టెస్ట్ మ్యాచ్‌ల్లో ఆడాడు. ఈ సమయంలో అతడు 56 ఇన్నింగ్స్‌లు ఆడి 3 సెంచరీలు, 6 హాఫ్ సెంచరీలతో మొత్తం 1353 పరుగులు సాధించాడు. అదేవిధంగా, భారత్ తరపున 9 వన్డేలలోనూ వికెట్ కీపర్‌గా ఆడిన సాహా కేవలం 41 పరుగులు మాత్రమే చేయగలిగాడు. అందువల్ల, 2014 తర్వాత అతనికి భారత వన్డే జట్టులో అవకాశం రాలేదు. ఈ సంవత్సరం ప్రారంభంలో అన్ని రకాల ఫార్మాట్లకు వీడ్కోలు పలికాడు వృద్ధిమాన్ సాహా. ఇప్పుడు బెంగాల్ అండర్-23 జట్టు కోచ్‌గా కొత్త ఇన్నింగ్స్‌ను స్టార్ట్ చేశాడు.

## వన్డే కెప్టెన్‌గా ఎంపికైన శుభ్‌మన్ గిల్




రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలతో తనకున్న రిలేషన్ గురించి వన్డే కెప్టెన్‌గా ఎంపికైన శుభ్‌మన్ గిల్ స్పందించాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలతో తన రిలేషన్ గతంలోలాగే ఉందని, తనకు ఏ అవసరం వచ్చినా ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లను సంప్రదించడానికి వెనుకాడనని గిల్ తెలిపాడు. సోషల్ మీడియాలో ఇటీవల వస్తున్న కథనాలపై ఈ విధంగా స్పందించాడు. భారత వన్డే జట్టుకు కెప్టెన్‌గా ఎంతో విజయవంతమైన రోహిత్ శర్మ స్థానాన్ని గిల్ భర్తీ చేశాడు. అప్పటి నుంచి ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లు రోహిత్, కోహ్లీల భవిష్యత్తుపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఆదివారం పెర్త్ వేదికగా ప్రారంభం కానున్న ఆస్ట్రేలియాతో మూడు మ్యాచ్‌ల సిరీస్ భారత వన్డే కెప్టెన్‌గా గిల్ తొలి సిరీస్.స్వాన్ నది ఒడ్డున మ్యాచ్‌కు ముందు మీడియా సమావేశానికి హాజరుకావడం చాలా అసాధారణం. “బయట ఒక విషయం నడుస్తోంది, కానీ రోహిత్‌తో నాకున్న రిలేషన్‌లో ఏమీ మారలేదు. నేను ఏదైనా అడగాలనుకుంటే, సలహా కోరాలని భావిస్తే కచ్చితంగా రోహిత్ ను సంప్రదిస్తాను. పిచ్ స్వభావం గురించి సలహా కావాలన్నా, మ్యాచ్ గురించి అయినా రోహిత్ సహాయం చేస్తాడు” అని సిరీస్ ప్రారంభానికి ముందు గిల్ అన్నాడు. “నాకు విరాట్ భాయ్, రోహిత్ భాయ్‌లతో మంచి అనుబంధం ఉంది. నేను వెళ్లి ఈ పరిస్థితుల్లో కెప్టెన్ అయితే మీరేం చేస్తారు, ఎలాంటి నిర్ణయం తీసుకుంటారని నిర్మొహమాటంగా అడుగుతాను. సలహాలు ఇవ్వడానికి వారిద్దరూ ఎప్పుడూ వెనుకాడరు. 25 ఏళ్ల కెప్టెన్‌ను. నామీద పెద్ద బాధ్యత ఉంది. ఇద్దరు మాజీ కెప్టెన్ల నుండి చాలా మద్దతు అవసరం. టీమ్‌ను ఎలా ముందుకు తీసుకెళ్లాలి, ఏ రకంగా నిర్ణయాలు తీసుకుని జట్టును ముందుకు తీసుకెళ్లాలనే దానిపై విరాట్ భాయ్, రోహిత్ భాయ్‌లతో నేను చాలాసార్లు మాట్లాడాను. వారి అనుభవాలు మాకు సహాయపడతాయి’ అని గిల్ పేర్కొన్నాడు. “మహీ భాయ్ (ఎంఎస్ ధోని), విరాట్, రోహిత్ అందించిన వారసత్వం, ఎన్నో అనుభవాల నుంచి నేర్చుకున్న విషయాలు చాలా ఉన్నాయి. వారి అనుభవం, నైపుణ్యం చాలా గొప్పది. వారి ఆట చూస్తూ పెరిగాను. వారిని నేను ఆరాధించేవాడిని, అది నన్ను ప్రేరేపిస్తుంది. అలాంటి దిగ్గజాలు నా సారథ్యంలో ఆడటం గొప్ప గౌరవంగా భావిస్తాను. జట్టుకు ఏ విధంగా మెస్సేజ్ ఇవ్వాలి. ఆటగాళ్లలో ఎలా కమ్యూనికేషన్ జరపాలి అనే విషయంపై రోహిత్, కోహ్లీలను అడిగి తెలుసుకున్నాను. వారితో కలిసి ఆడినప్పుడు కొన్ని విషయాలు నేర్చుకున్నాను. ఆస్ట్రేలియాతో సిరీస్ లో వారు ప్రత్యేకంగా నిలుస్తారు. రోహిత్, కోహ్లీలు దాదాపు 20 సంవత్సరాలుగా భారత క్రికెట్‌కు సేవలందించారు. వారి అనుభవాన్ని రిపీట్ చేయలేం. కానీ వ్యక్తిగతంగా, తనపై ఎంత ఎక్కువ బాధ్యత ఉంటే, అంత బాగా ఆడతానని నమ్ముతాను. కెప్టెన్సీ అనే అదనపు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తాను.నేను ఒత్తిడిలో రాణిస్తాను,

నా అత్యుత్తమ ఆట బయటకు వస్తుంది. బ్యాటింగ్ చేసినప్పుడు బ్యాటర్‌గా ఆలోచిస్తాను, ఆపై బెస్ట్ నిర్ణయం నిర్ణయాలు తీసుకుంటాను. ఒక బ్యాటర్‌గా, నేను కెప్టెన్‌లా ఆలోచించడానికి మాత్రం ప్రయత్నించను. అలా చేస్తే ఒత్తిడి పెరుగుతుంది. దాంతో స్వేచ్ఛగా ఆడలేం. మన అత్యుత్తమ ఆట ప్రదర్శించలేమని” ఆసీస్ తో వన్డే సిరీస్‌కు ముందు మీడియాతో మాట్లాడుతూ భారత వన్డే కెప్టెన్ గిల్ కీలక విషయాలు వెల్లడించాడు.

## అడిలైడ్ లో కోహ్లీ రానించేనా?

పునరాగమనంలో డకౌట్‌తో తీవ్రంగా నిరాశపర్చిన విరాట్ కోహ్లీ.. మరో కీలక పోరుకు సిద్దమయ్యాడు. అచ్చొచ్చిన మైదానంలో ప్రత్యర్థికి చుక్కలు చూపించేందుకు రెడీ అవుతున్నాడు. నాలుగున్నర నెలల సుదీర్ఘ విరామం తర్వాత ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇచ్చిన కోహ్లీ.. పెర్త్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్ డకౌటయ్యాడు. దాంతో ఈ మ్యాచ్‌లో టీమిండియా డక్ వర్త్ లూయిస్ పద్దతిన 7 వికెట్ల తేడాతో చిత్తయ్యింది. అడిలైడ్ వేదికగా గురువారం రెండో వన్డే జరగనుంది. ఈ సిరీస్‌లో నిలవాలంటే టీమిండియా ఈ మ్యాచ్ గెలవాలి. లేదంటే మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ కోల్పోతుంది. అడిలైడ్ వన్డే గెలవాలంటే కోహ్లీతో పాటు రోహిత్ శర్మ రాణించాలి. అయితే అడిలైడ్‌లో కోహ్లీ రికార్డ్స్ బాగున్నాయి. అడిలైడ్ వేదికగా మూడు ఫార్మాట్లలో కలిపి 15 ఇన్నింగ్స్‌లు ఆడిన కోహ్లీ.. 65 సగటుతో 975 పరుగులు చేశాడు. ఇందులో 5 సెంచరీలతో పాటు 4 శతకాలు ఉన్నాయి.ఇక్కడ ఇప్పటి వరకు 4 వన్డేలు ఆడిన కోహ్లీ 61 సగటుతో 244 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు ఉన్నాయి. దాంతో కోహ్లీ నుంచి మరో సెంచరీ వస్తుందని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. అడిలైడ్ వేదికగా అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా కూడా కోహ్లీ కొనసాగుతున్నాడు. 975 పరుగులతో అతను టాప్ స్కోరర్‌గా నిలవగా.. సర్ డాన్ బ్రాడ్‌మన్ (970), స్టీవ్ స్మిత్(934), గ్రేగ్ చాపెల్(747), షేన్ వాట్సన్(729), ఆడమ్ గిల్‌క్రిస్ట్ (687) తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. ఈ జాబితాలో బ్రాడ్‌మన్ మినహా మిగతా బ్యాటర్లంతా కోహ్లీ కంటే ఎక్కువ ఇన్నింగ్స్ ఆడారు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 2024-25లో భాగంగా అడిలైడ్ వేదికగా చివరిసారిగా ఆడిన కోహ్లీ.. ఈ డే/నైట్ టెస్ట్‌లో తీవ్రంగా నిరాశపర్చాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో 7, 11 పరుగులు మాత్రమే చేశాడు. వన్డే ప్రపంచకప్ 2027 ఆడటమే లక్ష్యంగా పెట్టుకున్న కోహ్లీ, రోహిత్‌లకు ఈ మ్యాచ్ అగ్ని పరీక్షగా మారింది. ఈ మ్యాచ్‌లో రాణిస్తేనే వారిపై ఒత్తిడి తగ్గనుంది. లేదంటే విమర్శలు రెట్టింపు అవుతాయి.

## ఘనంగా దీపావళి జరుపుకున్న భారత క్రికెటర్లు




దేశవ్యాప్తంగా దీపావళి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. భారత క్రికెటర్లు సైతం ఈ దీపావళిని ప్రత్యేకంగా జరుపుకున్నారు. దీపావళి సందర్భంగా క్రికెట్ దిగ్గజాలు తమ అభిమానులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఐసీసీ ఛైర్మన్ జై షా సహా పలువురు ప్రముఖ క్రికెటర్లు ఉన్నారు. అదే సమయంలో ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న విరాట్ కోహ్లీ దీపావళి సందర్భంగా ప్రత్యేక మెస్సేజ్ ఇచ్చారు. భారత వన్డే జట్టు వైస్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్, “అందరికీ దీపావళి శుభాకాంక్షలు! అని ఎక్స్ లో పోస్ట్ చేశాడు. మీ జీవితం వెలుగులు, ప్రేమ, అమిత ఆనందంతో నిండి ఉండాలి” అని రాసుకొచ్చాడు..భారత జట్టు టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ “వెలుగు, ఆనందం ఉంటే చాలా సానుకూలత. మీ అందరికీ దీపావళి శుభాకాంక్షలు!” అని శుభాకాంక్షలు తెలిపాడు. భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇంటిలోనూ వెలుగు ప్రకాశింపజేయాలి, ప్రతి హృదయంలో శాంతి, ఆనందం నివసిస్తుంది అని పోస్ట్ చేశారు. భారత మాజీ క్రికెటర్ వివిఎస్ లక్ష్మణ్ ఇలా పోస్ట్ చేశారు. దీపావళి దివ్య కాంతి మీ జీవితాలను శాంతి, శ్రేయస్సు, ఆనందంతో ప్రకాశింపజేస్తుంది. మీ అందరికీ ప్రకాశవంతమైన, అందమైన దీపావళి శుభాకాంక్షలు అని లక్ష్మణ్ విషెస్ తెలిపారు.

## బ్రాడ్ ఎవాన్స్ టెస్ట్ క్రికెట్‌లో కొత్త రికార్డు

జింబాబ్వే ఆల్ రౌండర్ బ్రాడ్ ఎవాన్స్ టెస్ట్ క్రికెట్‌లో కొత్త రికార్డు సృష్టించాడు. కేవలం 9.3 ఓవర్లలోనే 5 వికెట్లు పడగొట్టాడు. జింబాబ్వే టాస్ గెలిచి ఆఫ్ఘనిస్తాన్‌పై బౌలింగ్ ఎంచుకుంది. దీని ప్రకారం, మొదట బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్తాన్ జట్టు మంచి ఆరంభాన్ని ఇచ్చింది. కానీ 77 పరుగుల వద్ద 2వ వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత ఆఫ్ఘన్ బ్యాట్స్‌మెన్స్ పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఫలితంగా, ఆఫ్ఘనిస్తాన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 127 పరుగులకు ఆలౌట్ అయింది.ఆఫ్ఘనిస్తాన్ జట్టు తక్కువ స్కోరు సాధించడానికి ప్రధాన కారణం బ్రాడ్ ఎవాన్స్. ఈ మ్యాచ్‌లో ఇవాన్స్ 57 బంతులు వేసి కేవలం 22 పరుగులకు 5 వికెట్లు పడగొట్టాడు. దీంతో పాటు, జింబాబ్వే తరపున ఒక టెస్ట్ మ్యాచ్‌లో అత్యల్పంగా 5 వికెట్లు తీసిన రికార్డును కూడా అతను సృష్టించాడు. గతంలో ఈ రికార్డు జింబాబ్వే మాజీ కెప్టెన్ హీత్ స్ట్రీక్ పేరిట ఉండేది. 2001లో వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో స్ట్రీక్ 27 పరుగులకు 5 వికెట్లు పడగొట్టాడు. దీనితో, జింబాబ్వే తరపున ఒక టెస్ట్‌లో అతి తక్కువ పరుగులకు ఐదు వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. 24 సంవత్సరాల క్రితం నెలకొల్పిన రికార్డును బ్రాడ్ ఎవాన్స్ ఇప్పుడు బద్దలు కొట్టాడు. ఆఫ్ఘనిస్తాన్‌పై కేవలం 22 పరుగులకు 5 వికెట్లు పడగొట్టి అతను కొత్త చరిత్ర సృష్టించాడు. దీనితో, జింబాబ్వే తరపున అతి తక్కువ పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీసిన బౌలర్‌గా బ్రాడ్ ఎవాన్స్ నిలిచాడు.



22-10-25 Samayam_Layout 1 10/22/2025 5:31 AM Page 12





## సుజీత్ -దానయ్యల మధ్య విభేదాలు

### పోస్ట్‌తో ఫుల్‌స్టాప్ పెట్టిన సుజీత్

బాక్సాఫీసు వద్ద సందడి చేసిన 'ఓజీ' సినిమా ఓటీటీ నెట్‌ఫ్లిక్స్‌లో ఈ నెల 23 నుంచి స్ట్రీమింగ్ కానున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో.. దర్శకుడు సుజీత్ సోషల్ మీడియాలో మంగళవారం పోస్టు చేసిన ఓ నోట్ వైరల్‌గా మారింది. 'ఓజీ' విషయంలో తనను నమ్మి, ఎంతగానో సపోర్ట్ చేశారంటూ నిర్మాత డీవీవీ దానయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఓజీ' గురించి చాలామంది ఏదేదో మాట్లాడుతున్నారు. కానీ, సినిమాని ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకూ ఏం అవసరమనేది కొందరు మాత్రమే అర్థం చేసుకుంటారు. నా నిర్మాత, టీమ్ ఇచ్చిన మద్దతు గురించి మాటల్లో చెప్పలేనని పేర్కొన్నారు. సుజీత్ సడెన్‌గా ఈ పోస్టు పెట్టడంపై నెట్టింట చర్చ జరుగుతోంది. నిర్మాత దానయ్య, సుజీత్‌కు నిర్మాణ పరంగా విభేదాలు తలెత్తాయని ఇటీవల రూమర్స్ వచ్చాయి. దానిపైనే ఆయన ఇలా రియాక్ట్ అయి ఉంటారని కొందరు అభిప్రాయపడుతున్నారు. 'ఓజీ' చిత్రీకరణ దశలోనే.. నాని హీరోగా సుజీత్ ఓ చిత్రాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. 'ఓజీ' ప్రొడక్షన్ హౌస్ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపైనే దాన్ని రూపొందిస్తున్నట్టు తెలిపారు. కానీ, నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కొన్ని రోజుల క్రితం లాంఛనంగా ప్రారంభమైంది. దీంతో, దానయ్య- సుజీత్‌ల మధ్య దూరం ఏర్పడిందంటూ వార్తలొచ్చాయి.

# మడాక్ ఫిల్మ్స్ థామా

### రొటీన్‌కు భిన్నంగా సాగిన మూవీ

'స్త్రీ', 'భేడియా', 'ముంజ్యా', 'స్త్రీ 2' లాంటి విజయవంతమైన చిత్రాలతో తనకంటూ ఓ ప్రత్యేక హారర్ యూనివర్స్‌ను సృష్టించుకుంది ప్రముఖ నిర్మాణ సంస్థ మాడాక్ ఫిల్మ్స్. ఇప్పుడీ హారర్ యూనివర్స్‌లోకి రష్మిక - ఆయుష్మాన్ ఖురానాలను తీసుకొచ్చి 'థామా సినిమాను తీర్చిదిద్దింది. అలోక్ గోయల్ (ఆయుష్మాన్ ఖురానా) ఓ జర్నలిస్ట్. ఒకరోజు మిత్రులతో కలిసి ఓ పర్వత ప్రాంతానికి న్యూస్ కవరేజ్‌కి వెళ్తాడు. అక్కడ అతనిపై ఓ ఎలుగుబంటి దాడి చేయగా.. తడ్కా (రష్మిక) తనని కాపాడుతుంది. ఆమె బేతాళ జాతికి చెందిన యువతి. మనుషుల రక్తాన్ని తాగే అలవాటున్న వాళ్లకు.. ఎన్నో అతీత శక్తులుంటాయి. ఈ జాతికి నాయకుడు థామాగా పిలిచే యక్షాసన్ (నవాజుద్దీన్ సిద్ధిఖీ). అతను చేసిన ఓ తప్పు కారణంగా బేతాళ జాతి అతడిని ఎన్నో దశాబ్దాలుగా ఓ గుహలో బందీగా ఉంచుతుంది. అలాంటి బేతాళ సామ్రాజ్యంలోకి అలోక్ వచ్చాడని తెలిసి.. ఆ జాతి వాళ్లు అతడిని శిక్షించే ప్రయత్నం చేయగా.. తడ్కా తప్పిస్తుంది. ఈ క్రమంలోనే అతనిపై ప్రేమతో తన జాతిని విడిచి జనజీవనంలోకి వస్తుంది. మరి ఆ తర్వాత వీళ్ల ప్రేమ ప్రయాణం ఎన్ని మలుపులు సాగింది? అలోక్‌కు తడ్కా ఓ బేతాళిని అని ఎప్పుడు తెలిసింది? ఆమె బేతాళ జాతి పుట్టుక వెనకున్న కారణమేంటి? ఏ తప్పు చేయడం వల్ల యక్షాసన్ దశాబ్దాలుగా గుహలో బందీగా ఉండాల్సి వచ్చింది? తను బయటకి వచ్చాక ఏం జరిగింది? ఈ కథకు 'భేడియా', 'ముంజ్యా', 'స్త్రీ 2' చిత్రాలతో ఉన్న లింకేంటి? అన్నది మిగిలిన కథ.



మన జానపదాల్లో ఎన్నో బేతాళ కథలున్నాయి. కాకపోతే ఆ జాతి నేపథ్యమేంటి? అదెలా ఆవిర్భవించింది? అన్నది ఎవరికీ పెద్దగా తెలిసి ఉండకపోవచ్చు. ఈ పాయింట్‌ను ఆధారం చేసుకునే ఓ ఫిక్షనల్ హారర్ ఫాంటసీ కథను సిద్ధం చేసుకుంది ఈ చిత్ర బృందం. అయితే ఇది హారర్ జానర్‌లో సాగే చిత్రమైనా దీంట్లో భయం కన్నా ప్రేమకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు. ఆద్యంతం ఓ విభిన్నమైన ప్రేమకథను చూస్తున్న అనుభూతినే పంచుతుంది. దేశంపై దండెత్తడానికి వచ్చిన అలెగ్జాండర్‌ను బేతాళ నాయకుడు యక్షాసన్ అంతమొందించే హారర్ సీక్వెన్స్‌తో సినిమాని ఆరంభించిన తీరు ఆసక్తికరంగా ఉంటుంది. ఆ వెంటనే హీరో పరిచయ సన్నివేశాలతో కథను వర్తమానంలోకి తీసుకొచ్చాడు దర్శకుడు. ఎలుగుబంటి దాడి నుంచి హీరోను కాపాడే ఎపిసోడ్‌తో రష్మిక పాత్రని కథలోకి తీసుకొచ్చిన తీరు.. ఆ తర్వాత వాళ్లిద్దరికీ మధ్య చిగురించే ప్రేమకథ రొటీన్ రొమాంటిక్ లవ్‌ట్రాక్‌లాగే అనిపిస్తాయి. హీరోని బేతాళ జాతి బందీ చేయడం.. వాళ్లు అతన్ని యక్షాసన్‌కు ఆహారంలా గుహలోకి పంపడం.. అక్కడ తనకెదురయ్యే అనుభవాలు ఉత్సుకతరేకెత్తిస్తాయి. నాయకా నాయికలిద్దరూ అక్కడి నుంచి తప్పించుకుని జనజీవనంలోకి వచ్చినప్పటి నుంచి కథలో నవ్వులు మొదలవుతాయి. ముఖ్యంగా తడ్కా బేతాళిని అని.. రక్తం తాగుతుందని తెలిశాక.. ఆ విషయం ఇంట్లో వాళ్లకు తెలియకుండా దాచి పెట్టేందుకు హీరో పడే తిప్పలు ఫన్నీగా ఉంటాయి. ఇక రౌడీలకు బుద్ధి చెప్పే క్రమంలో బేతాళినిగా రష్మిక విజృంభించే తీరు.. ఈ క్రమంలో వచ్చే విరామ సన్నివేశాలు ద్వితీయార్ధంపై ఆసక్తిరేకెత్తించేలా చేస్తాయి. ఓవైపు హీరో కూడా బేతాళుడిగా మారడం.. మరోవైపు అతన్ని పట్టుకునేందుకు బేతాళ జాతి వ్యక్తులు రంగంలోకి దిగడం.. మరోవైపు రష్మిక చేసిన ఓ తప్పు వల్ల గుహలో బందీగా ఉన్న యక్షాసన్ బయటకు రావడం కథలో సంఘర్షణని రెట్టింపు చేస్తాయి. ఇక ఈ కథలోకి భేడియాగా వరుణ్ పాత్రను తీసుకొచ్చిన తీరు.. ఆ పాత్రకు హీరోకి మధ్య ముడిపెట్టిన వైరం థ్రిల్ పెంచేలా ఉంటాయి. ఈక్రమంలోనే తను దేవీ అనుగ్రహంతో థామాగా మారడం కాస్త సినిమాటిక్‌గా ఉంటాయి. మొత్తంగా కథ గమ్మత్తుగా మొదలై గమ్మత్తుగా ముగియడం విశేషం. రష్మక, ఆయుష్మాన్ ఖురానాలు పోటీపడి నటించారు.





## రాజ్ నిడుమోరుతో సమంత దీపావళి

నటి సమంత, బాలీవుడ్ దర్శకుడు రాజ్ నిడిమోరు డేటింగ్‌లో ఉన్నట్లు కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. ఆ వార్తలకు మరింత ప్రాధాన్యం చేకూర్చేలా తాజాగా రాజ్‌తో కలిసి సమంత దీపావళిని సెలబ్రేట్ చేసుకున్నారు. రాజ్ నిడిమోరు కుటుంబంతో కలిసి ఆమె దిగిన ఫొటోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. బాణసంచా కాలుస్తోన్న ఫొటోలను షేర్ చేసిన సామ్.. 'నా హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది' అని క్యాప్షన్ పెట్టారు. తరచూ వీరిద్దరూ కలిసి కనిపిస్తుండడంతో ఆ ఫొటోలు నెటిజన్‌లను ఆకర్షిస్తున్నాయి. రాజ్-డీకే సంయుక్తంగా తెరకెక్కించిన 'ది ఫ్యామిలీ మ్యాన్ సీజన్ 2', 'సిటడెల్: హనీ బన్నీ'లో సమంత నటించారు. ఆ సమయంలోనే రాజ్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు వస్తున్నప్పటికీ.. అధికారికంగా ఎక్కడా స్పందించలేదు. ఇక సినిమాల విషయానికొస్తే.. ఎన్నో రోజులుగా ఆమె అభిమానులు ఎదురుచూస్తోన్న 'మా ఇంటి బంగారం' త్వరలోనే ప్రారంభం కానుంది. దీనికి నందినిరెడ్డి దర్శకత్వం వహించనున్నారని సమాచారం. దీనితో పాటు 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్' ప్రాజెక్టులో సమంత ప్రస్తుతం నటిస్తున్నారు.



## మళ్లీ అవకాశాలు అంగీకరిస్తున్నా

### నటి రేణూదేశాయ్ వెల్లడి

ఒకప్పుడు కథానాయికగా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన రేణూ దేశాయ్ దాదాపు 20 ఏళ్ల తర్వాత రవితేజ 'టైగర్ నాగేశ్వరరావు'లో కనిపించిన సంగతి తెలిసిందే. సంఘ సంస్కర్త హేమలతా లవణం పాత్రని పోషించారు. అయితే, ఆ సినిమా సమయంలో తనపై కొన్ని విమర్శలు వచ్చాయని తాజాగా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఆ ట్రోల్ చేసినవారు ఎవరూ తర్వాత తనకు క్షమాపణలు చెప్పలేదన్నారు. 'నేను 'టైగర్ నాగేశ్వరరావు' చేసిన సమయంలో నాపై విమర్శలు వచ్చాయి. కమ్‌బ్యాక్ ఇచ్చింది.. ఇక ఎక్కడ చూసినా కనిపిస్తుంది. ఎలాంటి సినిమాల్లోనైనా నటిస్తుందని రాశారు. ఇప్పుడు ఆ సినిమా వచ్చి రెండేళ్లు అవుతోంది. ఇప్పటివరకూ నేను మళ్లీ స్క్రీన్‌పై కనిపించలేదు. ఏ సినిమాకు సైన్ చేయలేదు. నేను సినిమాలు అంగీకరించలేదని నా గురించి అలా మాట్లాడిన వాళ్లు ఇప్పుడు వచ్చి క్షమాపణలు చెప్పరు. మాట్లాడేవారు ఎలాగైనా మాట్లాడతారంతే. నాకు నటన అంటే చాలా ఇష్టం. కానీ, అదే నా లక్ష్యం కాదు. 15 ఏళ్ల వయసులోనే ఇండస్ట్రీకి వచ్చాను. నేను డబ్బుకు ప్రాధాన్యం ఇచ్చే మనిషిలా కనిపిస్తాను. డబ్బును జాగ్రత్తగా ఖర్చు చేస్తాను.. కానీ, దానికి ప్రాధాన్యం ఇవ్వను. ఒకవేళ నేను అప్పటినుంచి ఇప్పటి వరకూ సినిమాలు చేస్తూ ఉన్నట్లైతే ఇప్పటికి చాలా మంచి పేరు వచ్చేదని రేణు చెప్పారు. తనకు ఇప్పుడు గొప్ప పాత్రలు వస్తున్నాయన్నారు. మహిళా ప్రాధాన్యం ఉన్న చిత్రాల్లో ఛాన్స్‌లు వస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అత్తగారి పాత్రకు ఓకే చేసినట్లు చెప్పారు. త్వరలోనే ఆ సినిమా ప్రారంభం కానుందన్నారు. అత్తాకోడళ్లకు సంబంధించిన కామెడీ చిత్రంగా అది రానున్నట్లు వెల్లడించారు. తనకు ఆధ్యాత్మిక మార్గం అంటే ఇష్టమని.. భవిష్యత్తులో సన్యాసం తీసుకునే అవకాశం ఉందని రేణూ దేశాయ్ చెప్పారు.

## శృతి మించుతున్న సోషల్ మీడియా

### హీరోయిన్ల పెళ్లిళ్లపై అసత్య ప్రచారాలు

సోషల్ మీడియ అప్రచారంతో ఒక్కోసారి సినీతారల జీవితాలు ప్రమాదంలో పడుతుంటాయి. ముఖ్యంగా పెళ్లి విషయంలో ఇది ఎతంగానో వారి వ్యక్తిగత జీవితాన్ని ప్రభావితం చేస్తుంది. ఇదేదీ పట్టించుకోకుండా విమర్శకులకు దీనిని ఎంజాయ్ చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల తీరు కారణంగా ఇప్పుడు హీరోయిన్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. సత్యమిది. ప్రజలను ఎక్కువగా ఆకర్షించేవి సినిమాలు, రాజకీయాలు. సామాజిక మాధ్యమాల వేదికగా వీటిపై చర్చకు అడ్డూ, అదుపు ఉండదు. చాలావరకూ సినిమా హీరోలు, హీరోయిన్లు వీటి గురించి పెద్దగా పట్టించుకోరు. ఎవరి సినిమాల్లో వాళ్లు బిజీగా ఉంటే, జనాలు మాత్రం వాళ్ల పెళ్లిళ్లు, హనీమూన్‌లు, వారి బిడ్డల నామకరణాలతో ఊపిరి సలపని అప్‌డేట్స్‌తో బిజీగా ఉంటున్నారు. ఓ రకంగా తమ సరదా తీర్చుకోవడం తప్ప నిజానిజాలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. గత కొన్నేళ్లుగా ఇవీ శ్రుతి మించిపోతున్నాయి. అందుకే పలువురు తారలు గట్టిగానే బదులిస్తున్నారు. పెళ్లికాని అగ్ర కథానాయికల్లో త్రిష ఒకరు. దీంతో త్రిష పెళ్లి ఎప్పుడూ హాట్ టాపికే. ఈ క్రమంలో ఇటీవల ఆమె పెళ్లి వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో త్రిష కాస్త ఘాటుగానే స్పందించారు. 'నాకోసం నా జీవితాన్ని ప్లాన్ చేస్తున్న వాళ్లను నేను ప్రేమిస్తా. హనీమూన్ షెడ్యూల్ కూడా చెబుతారేమోనని వేచి చూస్తున్నా' అంటూ వ్యంగ్యంగా పేర్కొన్నారు. ఇక పెళ్లయిన హీరోయిన్ గురించి అయితే, ఆమె గర్భిణి అంటూ పోస్టులు పెట్టి, నానా హంగామా సృష్టిస్తుంటారు. ఇలాంటి వ్యాఖ్యలే మరోసారి ఆమె చెవిన పడటంతో సోనాక్షి తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. 16నెలలకు పైగా గర్భిణిగా ఉండటం వరల్డ్ రికార్డు ఉదర భాగంపై చెయ్యి వేసి ఫొటో దిగినందుకు ఇలాంటి వదంతులు సృష్టించారు. వాటికి మా సమాధానం ఇదే' అంటూ ఈ ఫొటోను పంచుకున్నారు. తెలుగు హీరోయిన్ అంజలిది అదే పరిస్థితి. 'నాకు తెలియకుండానే ఇప్పటికి నాలుగుసార్లు పెళ్లి చేశారు. ఇప్పుడు ఐదోసారి చేస్తున్నారు. నేను కూడా సోషల్ మీడియాలో దీని గురించి విన్నాను. నేను పెళ్లి చేసుకొని వేరే ఇంట్లో ఉంటున్నట్లు రాశారు. వాళ్లకు తెలియని విషమేమిటంటే నేను అవుట్ డోర్ షూటింగ్స్‌లోనే ఎక్కువగా ఉంటున్నా. ఆ వార్తకు, నాకు ఎలాంటి సంబంధం లేదు. అది ఫేక్ న్యూస్. పెళ్ళైతే చేసుకుంటా.. కానీ ఇప్పుడు కాదు. దానికి కొంచెం టైమ్ ఉంది' అంటూ వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఇదే పరిస్థితి మృణాళ్ ఠాకూర్ ఎదుర్కొన్నట్లు తెలిపింది. 'నా స్నేహితులు, స్టైలిస్ట్ డిజైనర్లు, బంధువులు వరుసగా ఫోన్‌కాల్స్ చేసి తెలుగు అబ్బాయిని పెళ్లి చేసుకుంటున్నావా? అని అడుగుతున్నారు. ఆ అబ్బాయి ఎవరో నాకూ తెలుసుకోవాలని ఉంది. ఈ ఫన్నీ రూమర్ గురించి ఏం మాట్లాడాలో కూడా తెలియట్లేదు. త్వరలోనే పెళ్లవుతుంది. అయితే.. వరుడిని మీరే వెతికిపెట్టి నాకు చెప్పండి. కల్యాణ వేదిక, ఆ లోకేషన్ వివరాలు కూడా పంపండి. సరేనా? అని వ్యంగ్యంగా సమాధానమిచ్చారు. ఇక ఈ జాబితాలో తమన్నా, శ్రుతిహాసన్, అనుపమ పరమేశ్వరన్, సాయిపల్లవి చాలామంది హీరోయిన్స్ ఉన్నారు. 'మాకు పెళ్లి కుదిరితే, మేమే చెబుతాం' అంటూ వాళ్లు మొత్తుకున్న సందర్భాలెన్నో. తెలుగు అగ్ర కథానాయకుడు ప్రభాస్, కథానాయిక అనుష్కలకు అయితే, సోషల్‌మీడియా ఎన్నిసార్లు పెళ్లి చేసిందో లెక్కేలేదు.





Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**